

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 92 • పేజీలు:12+16 • వెల: రూ.5 | శుక్రవారం • 2-3-2018 | www.manamnews.com | /manamnews

ఇక ఆస్తుల స్వాధీనమే

'ఎఫ్ఈవో' బిల్లుకు కేంద్రం ఓకే

7లో..

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: పౌర్ణమి ఉ.6.21, పాడ్యమి తె.4.06; నక్షత్రం: పుబ్బ రా.10.06 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.7.12-8.42, రా.10.29-12.00; దుర్ముహూర్తం: ఉ.8.58-9.45, మ.12.52-1.39; రాహుకాలం: ఉ.11.01-12.28; అమృతఘడియలు: సా.4.11-5.40; శుభసమయం: సా.5.00-6.00;

సూర్యోదయం: 6.38

సూర్యాస్తమయం: 6.19

ఇదీలోకం!



జాబిలమ్మపైనా వాట్సాప్!

చంద్రుడిపై త్వరలో 4జీ నెట్‌వర్క్.. తొలి అడుగు పడిన 50 ఏళ్లకే నెట్

- వోడాఫోన్-నోకియా భాగస్వామ్యం.. మొట్టమొదటి వాణిజ్య ల్యాండింగ్
- చంద్రుడి నుంచి హెచ్‌డీ లైవ్ స్ట్రీమింగ్.. పరిశోధనల్లో అతిపెద్ద ముందడుగు



6లో..

ఎండలు మండిస్తాయి!

- సాధారణం కంటే 1 డిగ్రీ ఎక్కువ
- మార్చి నుంచి మే వరకు ఇంతే
- ఉత్తరాదిలో అధిక ఉష్ణోగ్రతలు
- రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా
- కొన్ని రాష్ట్రాల్లో 1.5 డిగ్రీలు అధికం



7లో..

అపాచీ హెలికాప్టర్.. మేడిన్ తెలంగాణ

ఏరోసెజ్‌లో హెలికాప్టర్ల తయారీ ప్రారంభం

- టాటా-బోయింగ్ సంస్థ ఆధ్వర్యంలో తయారీ
- పాల్గొన్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రతన్ టాటా, అమెరికా రాయబారి కెన్ జస్టర్
- లోపరహితంగా హెలికాప్టర్ల తయారీ...
- గడువుకు ముందే ఉత్పత్తుల విడుదల: నిర్మల

హైదరాబాద్, మార్చి 1 (మనం ప్రతినిధి):

తెలంగాణ పరిశ్రమల్లో మరో కలికితురాయి చేరింది. రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ ఐఐసీ) మిగతా 6లో..





కలర్ క్రష్

'కుటుంబం'లో



జయేంద్ర సరస్వతికి కన్నీటి వీడ్కోలు

- మఠంలో పూర్తయిన మహాసమాధి
- మూడున్నర గంటల కార్యక్రమం
- భక్తులకు కనిపించని ప్రక్రియ

7లో..

కుసంస్కారం.. అహంకారం

మా పథకాలే ప్రారంభిస్తున్నారు.. కేటీఆర్‌పై మండిపడ్డ జానారెడ్డి

- శిలాఫలకాలపై మా పేర్లు చూడండి
- ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారు
- మాలో ఎందరిని జైలుకు పంపారు?
- మంత్రి.. నా స్థాయి నాయకుడు కాదు

6లో..



సింగరేణి ఖుషీ!

తప్పిన ప్రైవేటీకరణ ముప్పు

- కేసీఆర్ భరోసాతో కార్మికుల్లో ఆనందం
- కేంద్ర వాటా కొంటామన్న మాటతో ధీమా
- ప్రైవేటుపరమైతే శాశ్వత కార్మికులకు ముప్పు
- ప్రణాళికతో ముందుకెళ్తే భవిత బంగారమే

6లో..



రావాలా? వద్దా? అనుకున్నాను!

- ప్రధానిని కేసీఆర్ ఏకవచనంతో సంబోధించారు
- ఇదే విషమమై కేటీఆర్‌కు ఫోన్ చేశాను
- విమానం ఎక్కేముందూ మళ్లీ చేశాను
- ఏదో పొరపాటున మాట జారీ ఉంటారన్నారు
- అందుకే ఇక్కడికి వచ్చా..నా నిరసన తెలిపా..
- తెలంగాణకు మంచి భవిష్యత్ ఉంది: నిర్మల

హైదరాబాద్, మార్చి 1: ''సిద్ధాంతరీత్యా ఎన్ని భేదభావాలున్నా.. ఆ విమర్శలను వింటాం. దానికి జవాబివ్వాలంటే పార్టీ ఇస్తుంది. ఎవరికి వారు ఇస్తారు. చెప్పాలసిన పద్ధతిలో చెబితే ఎవరైనా జవాబు ఇవ్వొచ్చు. కానీ ఎన్నికైన ముఖ్యమంత్రి, రాజ్యాంగ పదవిలో ఉన్నవారు ఏకవచనంలో ప్రధాన మంత్రి గురించి కొంచెం అలా మాట్లాడటం నాకు అస్సలు బాగా అనిపించలేదు'' అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మాజీ అధ్యక్షుడు బంగారు బంగారు లక్ష్మన్ సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీని సీఎం కేసీఆర్ ఏకవచనంతో సంబోధించడంపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా తాను టాటా-బోయింగ్ ఉత్పత్తుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొనడానికి గల కారణాలను వివరించారు. ''ఈ రోజు ఉదయం మేకిన్ ఇండియా.. అది కూడా డిఫెన్స్ ప్రొడక్షన్‌లో ప్రపంచవ్యాప్తంగా పెద్ద కంపెనీలలో ఒకటైన బోయింగ్, భారతదేశంలో ఉన్న పెద్ద కంపెనీ టాటా కలిపి తెలంగాణలో ఆదిభట్లలో పెద్ద యూనిట్ తయారుచేశారు. 2016లో మనోహర్ పారిక్కర్ దానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు హెలికాప్టర్ల తయారీ మొదలైంది. కేటీఆర్ నాకు ఫోన్ చేశారు. నాకు రావాలా..? వద్దా? తెలియడం లేదు. దేశ ప్రధాని గురించి ఇలా మాట్లాడాక నేను వచ్చి పాల్గొనడం బాగోదు.. రావాలా? వద్దా? అని మాట్లాడాను. అప్పుడు ఆయన నల్గొండ పర్యటనలో ఉన్నారు. విమానం ఎక్కే ముందు కూడా మరోసారి కేటీఆర్‌కు ఫోన్ చేశాను. లేదండీ.. నాన్నగారు అలా మాట్లాడతారని నేను అనుకోను, ఏదో పొరపాటున మాట జారి ఉంటారని ఆయన చెప్పారు. అందుకే నేను వచ్చాను. తెలంగాణకు ఎంతో భవిష్యత్తు ఉంటుందని, ఏరోస్పేస్ పరిశ్రమకు కూడా ఇక్కడ చాలా బాగుంటుందనే నేను వచ్చాను'' అని నిర్మల పేర్కొన్నారు. ''ప్రారంభోత్సవ కార్యక్రమంలో వేదికపై కేటీఆర్ పక్కన కూర్చున్నప్పుడు కూడా దీని గురించి మాట్లాడాను ముఖ్యమంత్రిగా ఉండి.. ప్రధానమంత్రిని ఏకవచనంలో మాట్లాడటం సరి కాదని.. అది మా అందరికీ బాధ కలిగించిందని చెప్పాను. పార్టీ కార్యకర్తగా కాకుండా దేశ పౌరురాలిగా స్పందించాను'' అని తెలిపారు. దళిత నేపథ్యంగల బంగారు లక్ష్మణ్ కేంద్రమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా ఎదగడం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేపీ శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లడుతున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

విద్యుత్ సంస్థల్లో తెలంగాణేతరుల దరఖాస్తులూ స్వీకరించండి: హైకోర్టు



హైదరాబాద్, మార్చి 1(మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ విద్యుత్ సంస్థల్లో సహాయ ఇంజనీర్లు, జూనియర్ గణాంకాధికారుల పోస్టుల భర్తీ కోసం తెలంగాణేతరులు చేసుకునే దరఖాస్తులను కూడా ఆమోదించాలని హై కోర్టు ఆదేశించింది. అంతేకాక ఆయా పోస్టుల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలకు తెలంగాణేతర దరఖాస్తుదారులను అనుమతించాలని చెప్పింది. విద్యుత్ సంస్థల్లో వివిధ పోస్టులకు తెలంగాణ స్థానికతను చూపుతూ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబడుతూ పావని, నిఖిల్‌కుమార్ రిట్లు వేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాధన్, న్యాయమూర్తి విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ గురువారం వీటిని విచారించింది. విద్యుత్ సంస్థలు తెలంగాణేతరుల దరఖాస్తుల్ని కూడా స్వీకరించాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. లోక్‌సభకు మాత్రమే స్థానికతపై నిర్ణయం తీసుకునే వెసులుబాటు రాజ్యాంగం ఇచ్చిందని, విద్యుత్ సంస్థలకు లేదన్నది పిటిషనర్ల వాదన.

బంద్‌ను విజయవంతం చేయండి

- కోదండరాం మద్దతు కోరిన మంద కృష్ణ

హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతనిధి): ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఈ నెల 13వ తేదీన తలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. ఈమేరకు టీజేఏసీ చైర్మన్ కోదండరాను గురువారం కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాట్లాడుతూ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కేంద్రంలో తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే బిల్లు పెడతామని గతంలో పలువురు బీజేపీ పెద్దలు చెప్పారన్నారు. 1994 నుంచి 2018 వరకు ఎస్సీ వర్గీకరణకు బీజేపీ మద్దతు ఇస్తూనే వస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని విస్మరించిందన్నారు. బీజేపీ కూడా మాదిగలను మోసం చేస్తుందన్నారు. బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లు పెట్టేలా చేసేందుకు 13న బంద్ తలపెట్టామని తెలిపారు. వర్గీకరణ కోసం తెలుగు రాష్ట్రాల్లో శాంతియుత పోరాటాలను చేస్తామన్నారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీఆర్‌ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు: వంటేరు

హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): టీఆర్‌ఎస్‌తో టీడీపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని ఆ పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాపరెడ్డి స్పష్టం చేశారు. అవినీతి ప్రభుత్వానికి టీడీపీ ఎన్నటికీ అండగా ఉండదన్నారు. టీటీడీపీ నేతలు, కార్యకర్తలు టీఆర్‌ఎస్‌తో పనిచేసేందుకు సిద్ధంగా లేరని చెప్పారు. ప్రతాపరెడ్డి టీడీపీని విడుతున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో పార్టీ అధినేత చంద్రబాబును వంటేరు గురువారం కలిశారు. వంటేరుపై అక్రమంగా కేసులు పెట్టారని బుధవారం జరిగిన టీటీడీపీ సర్వసభ్యసమావేశంలో వ్యాఖ్యానించిన బాబు, వంటేరుకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ కోసం శ్రమిస్తున్న ఏ ఒక్క నాయకుడిని వదులుకోబోమని బాబు భరోసానిచ్చారు.

అమరుల కుటుంబ సభ్యుడిని రాజ్యసభకు పంపండి: రేవంత్



హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): తెలంగాణ నుంచి ఎన్నికలు జరగనున్న మూడు రాజ్యసభ సీట్లలో అమరవీరుల కుటుంబాల నుంచి ఒకరికి అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాడు సీఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు సీట్లను టీఆర్‌ఎస్ వారికే ఇచ్చుకుని, మూడో సీటును మాత్రం అమరవీరుల కుటుంబాలకు కేటాయించాలని కోరారు. వాస్తవానికి సంఖ్యాబలం ప్రకారం టీఆర్‌ఎస్ రెండు సీట్లు మాత్రమే గెలుచుకోగలదని, మూడో సీటు ఫిరాయింపు ఎమ్మెల్యేల బలంతో గెలుస్తారని చెప్పారు. తన సోదరుడి కొడుకు సంతోష్‌కు సీటు ఇవ్వాలని చూస్తున్నారని, కుర్రకుంకను రాజ్యసభకు ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. సంతోష్ ఏరోజూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనలేదని, కనీసం చిన్న కేసు కూడా ఆతనిపై లేదన్నారు. కేసీఆర్‌కు సేవలు చేయడమే సంతోష్‌కున్న అర్హతా అని ప్రశ్నించారు. కేసీఆర్ తన కుటుంబ సభ్యులకే పదవులు ఇచ్చుకుంటున్నారని, తెలంగాణకోసం ప్రాణాలు అర్పించిన వారిని పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాలో సంతోష్ పాత్ర ఉందని, రాజ్యసభకు ఆయన్ని అభ్యర్థిగా ప్రకటిస్తే, అన్ని ఆధారాలను వెల్లడిస్తానని రేవంత్ చెప్పారు. కేసీఆర్ అమరవీరుల కుటుంబాల వారికి అవకాశం ఇవ్వకుంటే కాంగ్రెస్ పార్టీనే ఆ పనిచేయాలని తాను పార్టీ నాయకులను కోరుతున్నట్లు రేవంత్ రెడ్డి చెప్పారు. మిగిలిన పార్టీలను సంప్రదించి పోటీకి పెడితే కేసీఆర్ నిజస్వరూపం ప్రజలకు తెలుస్తుందన్నారు. అమరవీరుల కుటుంబ సభ్యుడికి మద్దతు ఇస్తారో, తన బంధువుకు మద్దతు ఇస్తారో తేలిపోతుందన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఓటును చూపించి వేయాల్సి ఉంటుందని, విప్ జారీ చేస్తే ఫిరాయింపుదారుల రంగు సైతం బయటపడుతుందన్నారు. సాంకేతికంగా చూస్తే సభలో టీడీపీకి 15 మంది, కాంగ్రెస్‌కు 21 మంది ఉన్నారని, రాజ్యసభ్య సీటు గెలిచేందుకు 30 ఓట్లు సరిపోతాయన్నారు.

వనపర్తిలో 'సాండ్ ట్యాక్సీ' ప్రారంభం

వనపర్తి, మార్చి 1 (మనం ప్రతినిధి): సామాన్యులకు సాధ్యమైనంత తక్కువ ధరకు ఇసుకను అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సాండ్ ట్యాక్సీ విధానాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లాకు సంబంధించి సాండ్ ట్యాక్సీ విధానాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, ప్రభుత్వ పనులకు తక్కువ ధరకే ఇసుకు అందిస్తామన్నారు. పెద్దమందడి మండలం వెల్టూరు గోపాలసముద్రం చెరువులో 2లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక గుర్తించామని, త్వరలో వినియోగంలోకి తెస్తామని చెప్పారు. ఆన్‌లైన్ విధానం ద్వారా ఇసుకు కొరత సమస్య ఉండదన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్వేతామహంతి, ఎమ్మెల్యే డాక్టర్ జి.చిన్నారెడ్డితో కలిసి సాండ్ ట్యాక్సీ పాలసీ ట్రాక్టర్‌ను ఆయన ప్రారంభించారు. అంతేకాక ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేశారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.


బంపర్లతో పరేషాన్!

ప్రమాద తీవ్రతను పెంచుతున్న క్రాష్‌గార్డులు

- వాహనాలపై భారం.. తగ్గుతున్న జీవితకాలం



హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): కార్లకు అమర్చుతున్న బంపర్లు యమపాశాలుగా మారుతున్నాయి. రక్షణ కోసమని వాహనదారులు ఏర్పర్చుకుంటున్న క్రాష్‌గార్డులు, ఎదుటి వ్యక్తికి ప్రాణ సంకటంగా పరిణమిస్తున్నాయి. లక్షలు పోసి కొంటున్న వాహనాలను కాపాడుకునేందుకు, ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకునేందుకు కార్లు, ఇతర పెద్ద వాహనాలకు బుల్‌గార్డులు, క్రాష్ గార్డులు(బంపర్లు) ఏర్పాటు చేసుకోవడం తెలిసిందే. అయితే వీటి వల్ల లాభాల మాట అటుంచితే నష్టాలే ఎక్కువగా ఉంటున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోడ్డు ప్రమాదం సంభవించినప్పుడు అవతలి వాహనంపై ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతోపాటు, తమ వాహనంలోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోకపోయే ముప్పు ఉన్నదని వాహన తయారీదారులు హెచ్చరిస్తున్నారు. ఈ గార్డులు బిగించుకోవడం చట్టపరంగానూ నేరమేనంటున్నారు రవాణాశాఖ అధికారులు. ఈ విషయాన్ని కేంద్రం కూడా నిర్ధారించింది. వాహనాలకు అదనపు హంగులు, క్రాష్ గార్డులు, బుల్ గార్డులు వంటివి ఏర్పాటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే ఉన్నవాటిని తొలగించాలని కేంద్రం నుంచి గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రాలకు ఆదేశాలు అందాయి.





ఇరువురికీ ప్రాణ గండం!

ముఖ్యంగా కార్ల ముందు, వెనక భాగంలో క్రాష్, బుల్ గార్డులను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్నప్పుడు ఈ బంపర్(క్రాష్ గార్డు) వల్ల ద్విచక్రవాహనదారుడు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది. రెండు కార్లు, లేదా కారు, మరేదైనా ఇతర వాహనం ఒకదానికొకటి ఢీకొన్నప్పుడు, డివైడర్‌ను ఢీకొన్నప్పుడు ఏర్పడే ఒత్తిడి కారుపై పడకుండా బంపర్‌పై పడుతోంది. కారుపై ఒత్తిడి లేకపోవడంతో సైడ్ డోర్లు, స్టీరింగ్ వద్ద ఉండే ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంలేదని వాహన రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తొలుత అవగాహన.. ఆపై చర్యలు..

కేంద్రం నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ యోచిస్తోంది. ఈ గార్డులు నియమించుకోవడం వల్ల వాటిల్లే నష్టంపై తొలుత అవగాహన కల్పించి, ఆ తర్వాత నుంచి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్టు రవాణాశాఖ అధికారి ఒకరు తెలిపారు. వివిధ పనులమీద రవాణశాఖ కార్యాలయాలకు వచ్చే వాహనాలకు ఉన్న గార్డులను తొలగిస్తున్నామని ఆ అధికారి చెప్పారు. 1988 మోటార్ వాహనాల చట్టంలోని సెక్షన్ 190, 191 ప్రకారం గార్డులను ఏర్పాటు చేసుకోవడం నేరం, ఇలా ఏర్పాటు చేసుకుంటే పెద్ద మొత్తంలో జరిమానా కూడా విధించవచ్చునన్నారు. అవగాహన కార్యక్రమాల అనంతరం ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

హైదరాబాద్‌లో మరీ ఎక్కువ..


రద్దీగా ఉండే నగర రోడ్లలో బుల్‌గార్డులు, క్రాష్ గార్డులతో సమస్య ఎక్కువగా ఉంటోంది. గార్డులు ఏర్పర్చిన వాహనాలు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటంతోపాటు, వేగంగా ఓవర్‌టెక్ చేస్తున్న సందర్భాల్లో బంపర్లు తగిలి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలక గురవుతున్నారు. వాహన పొడవు, వెడల్పు, బరువు తదితరాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే వాహనం మార్కెట్లోకి రావడానికి అనుమతిస్తారు. క్రాష్, బుల్ గార్డులతో వాహనం బరువు పెరిగి, మైలేజ్‌పై ప్రభావం పడడంతోపాటు వాహన జీవితకాలం తగ్గిపోయే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సిరియాలో బాల్యం చిధ్రం

- అగ్రరాజ్యాల క్రీనీడలో బతుకు దుర్భరం
- ఆధిపత్యం కోసం జనావాసాలపై బాంబులు
- నాలుగు రోజుల్లో 500 మంది వరకు మృతి
- వారిలో 200 మందికిపైగా పసిమొగ్గలే..
- సోషల్ మీడియాలో ఫొటోలు విస్తృతంగా వైరల్
- బాల్యాన్ని బతికించుకుందామని వెల్లువలా విజ్ఞప్తులు



ఐక్యరాజ్యసమితి, మార్చి 1: సిరియాలో బాల్యం రక్తమోడుతోంది. కొన్నేళ్లుగా అంతర్యుద్ధంలో చిక్కుకున్న ఆదేశంలో.. సిరియా,రష్యా- అమెరికా ఆధిపత్య పోరుకు బాల్యం చితికిపోతోంది. రాకెట్ దాడులు.. విస్ఫోటనాల నడుమ చిన్నారులు బిక్కుబిక్కుమంటున్నారు. తిరుగుబాటుదారుల అధీనంలోని తూర్పు గౌటాలో సిరియా-రష్యా (ప్రభుత్వ) దళాలు జరుపుతున్న దాడులతో పసిమొగ్గలు నేలరాలుతున్నాయి. కొద్దిరోజులుగా ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారంలోకి వస్తున్నాయి. అయితే ఇందులో కొన్ని ఫొటోలు ఎప్పటివో లేదా ఇరాక్ యుద్ధ సమయానికి సంబంధించినవిగా రూఢీ అవుతున్నప్పటికీ.. మరికొన్ని చిత్రాలు మాత్రం అక్కడి పరిస్థితులకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బాల్యాన్ని బతికించుకుందామని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. మీ ఆధిపత్య కోసం పసిమొగ్గలను సమిధలను చేస్తారా? అని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. మరోవైపు, సిరియాలో కొనసాగుతున్న మారణహోమంపై ఐక్యరాజ్యసమితిలో బుధవారం జరిగిన చర్చలో రష్యా, సిరియా- అమెరికా మధ్య తీవ్ర గు వాగ్యుద్ధం చోటు చేసుకుంది. కాల్పుల విరమణ సమయంలోనూ దాడులకు దిగడమేమిటని అమెరికా వాదిస్తే.. అందుకు మీరే కారణమని రష్యా, సిరియా విరుచుకుపడ్డాయి. తిరుగుబాటుదారలకు పరోక్షంగా సహకరిస్తూ ఆయుధాలు సరఫరా చేస్తున్నారని ధ్వజమెత్తాయి. ఈ వాదోపవాదాల నడుమనే గౌటా నగరంపై తక్షణమే 30 రోజుల పాటు కాల్పుల విరమణను అమలు చేయాలని ఈ మేరకు భద్రతా మండలి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. గౌటా వాసులతో పాటు సిరియా అంతటా ఈ సమయంలో బాధితులను అన్నివిధాలా ఆదుకోవాలని నిర్ణయించారు.బాంబుదాడుల ప్రభావిత ప్రాంతాల్లో మఖ్యంగా చిన్నారులకు తక్షణమే వైద్య సహాయం అందివ్వాలని ఏకభిప్రాయానికి వచ్చారు. గతంలోనూ ''తక్షణమే సిరియాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేయాలి'' అని ఐరాస భద్రతా మండలి తీర్మానం చేసినా, సంతకం చేసిన రష్యా ప్రత్యక్ష సహకారంతో అస్సాద్ ప్రభుత్వ సాయుధ బలగాలు భీకర బాంబు దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయని సభ్య దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ''రోజుకు ఐదు గంటలపాటు కేటాయించిన దాడుల విరామ సమయం'' లోనూ దాడులు కొనసాగుతూనే ఉండడంతో గౌటాలో నెత్తురు ఏరులై పారుతోందని ఆందోళన వ్యక్తం చేశాయి.



ముదురుతున్న సంక్షోభం..

సిరియా సంక్షోభం నానాటికీ ముదురుతున్నదనే సర్వత్రా నెలకొంది. ఇది ఎలాంటి విపరిణామాలకు దారితీస్తోందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా, రష్యా జోక్యంతో సిరియా అంతర్యుద్ధం కాస్తా అంతర్జాతీయ యుద్ధంగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. గౌటాలో ప్రభుత్వ దళాలే కాదు, ఈ ప్రాంతాన్ని నియంత్రిస్తున్న రెబెల్స్, వారికి మద్దతిస్తున్న అల్ కాయిదా గ్రూపులు ప్రభుత్వ దళాలపై ఎదురుదాడి చేస్తున్నాయి. డమాస్కస్‌లోని ప్రాంతాల నుంచి నాలుగురోజుల క్రితం పన్నెండు రాకెట్లతో దాడి చేసినట్లుగా భావిస్తున్నారు.

ఆధిపత్య పోరులో చిన్నారులే సమిధలు!

2011లో మధ్య ప్రాచ్యంలో సుదీర్ఘకాలంగా పాలన సాగిస్తున్న నిరం కుశ రాజ్యాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు 'మల్లెపూవు విప్లవం' పేరుతో వెల్లువెత్తాయి. ఆ క్రమంలోనే సిరియాలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా అణచివేతకు గురయ్యాయి. అసద్ ప్రభుత్వం వైదొలగాలని ప్రారంభమైన శాంతియుత నిరసనోద్యమం క్రమంగా అమెరికా సారథ్యంలోని నాటో కూటమి సహకారంతో సాయుధ పోరాట మార్గాన్ని చేపట్టింది. ఇందుకు ప్రతిగా సిరియా, దాని మిత్రపక్ష దేశాలైన రష్యా, ఇతర దేశాలు దాడులకు తెగబడుతున్నాయి. 2015 నుంచి తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా రష్యా వైమానిక దాడులు నిర్వహిస్తున్న నాటి నుంచి సిరియాలో మానవత్వ సంక్షోభం క్రమంగా పరాకాష్ఠకు చేరింది. మరో వైపు, అమెరికా సైనిక బలగాల కూటమి ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్ల స్థావరాలపైనే కాక, రష్యా అనుకూల అసద్ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో ప్రభుత్వ సైనిక స్థావరాలపై కూడా వైమానిక దాడులు చేస్తోంది.

గౌటాలో నెత్తుటి ప్రవాహం..!

సిరియా రాజధాని డమస్కస్ శివారు నగరమైన గౌటా 2013లో ప్రభుత్వ బలగాల ఆధీనంలో ఉండేది. అయితే మిగతా ప్రాంతాల్లోచావుదెబ్బ తిన్న మిలిటెంట్లు వేల మంది, సాధారణ పౌరులతో కలగలసిపోయి గౌటా నగరంలోకి చొరబడ్డారు. 2017 నాటికి గౌటానగరం తిరుగుబాటుదార్ల వశమైంది. అయితే గౌటా నగరంపై పట్టు సాధించడం ప్రభుత్వ బలగాలకు కీలకం. దాంతో సిరియా-రష్యా మిత్ర పక్ష దళాలు ఈ నగరంపై పెద్ద ఎత్తున దాడులకు పాల్పడుతున్నాయి. వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు విడిచారు. ముఖ్యంగా చిన్నారుల వేదన వర్ణనాతీతం. ఇందుకు సంబంధించి కొన్ని వీడియోలు, ఫొటోలు కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం పొందుతున్నాయి. అయితే..అందులో కొన్ని తప్పుడువని కొందరు ఆధారాలతో సహా పేర్కొంటున్నారు.



రాతి మేఘం నుంచి చంద్రుడి ఆవిర్భావం

బోస్టన్, మార్చి 1: రాత్రిపూట ఆకాశంలో ప్రకాశిస్తూ కాంతిని పంచే చంద్రుడు డోనట్ వంటి రాతి మేఘం నుంచి పుట్టుకొచ్చాడని పరిశోధకులు చెబుతున్నారు. తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైందని వెల్లడించారు. భూమి ఆవిర్భవించిన సమయంలో జరిగిన భారీ విస్ఫోటనం కారణంగా కొంత భాగం విడిపోయి కాలక్రమంలో చంద్రుడు పుట్టాడని ఇప్పటి వరకూ ఖగోళ శాస్త్రవేత్తలు నమ్ముతూ వచ్చారు. అయితే, ఈ నమ్మకం తప్పని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధకుడు సైమన్ లాక్ పేర్కొన్నారు. చంద్రుడు భూమి నుంచి ఆవిర్భవించలేదనే దానికి తగిన కారణాలూ చెబుతున్నాడు. అంగారక గ్రహ పరిమాణంలోని భారీ పదార్థం ప్రోటో ఎర్త్‌తో ఢీ కొన్నపుడు కొంతభాగం విడిపోయి కక్ష్యలో తిరుగుతోందని, కాలక్రమంలో ఇదే చంద్రుడిగా రూపాంతరం చెందిందన్న వాదన సరికాదన్నాడు. చంద్రుడి సైజున్న ఉపగ్రహం ఏర్పడడం అంత తేలికైన పని కాదని లాక్ చెబుతున్నారు. భారీ ద్రవ్యరాశి ఉన్న ఉపగ్రహం ఏర్పడాలంటే గ్రహాలు అత్యంత సమీపంలో నుంచి ఢీ కొనాలని వాదిస్తున్నాడు. మరి చంద్రుడు ఎలా ఏర్పడి ఉంటాడన్న విషయంపై మాట్లాడుతూ.. విపరీతమైన ఉష్ణోగ్రత కారణంగా భారీ పరిమాణంలోని రాయి భాష్పీభవనం చెంది డోనట్ లాంటి ఆకారాన్ని సంతరించుకుందన్నాడు. ఉష్ణోగ్రత తగ్గుతున్నకొద్దీరాతి మేఘం మధ్యలో ఘనీభవిస్తూ వచ్చి ఉంటుందన్నారు. ఆపై ప్రస్తుతమున్న చంద్రుడు ఆవిర్భవించాడని లాక్ పేర్కొన్నారు.

వైట్‌హౌస్ నుంచి మరో నిష్క్రమణ

వాషింగ్టన్, మార్చి 1: అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ విధుల నుంచి మరో ఉన్నతాధికారి నిష్క్రమించారు. అధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ హోప్ హిక్స్ తన పదవికి రాజీనామా చేశారు. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయం నుంచి ట్రంప్ వెంట ఉన్న ఆమె ఉన్నట్టుండి రాజీనామా చేయడం వైట్‌హౌస్‌లో కలకలం రేపింది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యంపై హౌస్ ప్యానెల్ దాదాపు తొమ్మిది గంటల పాటు విచారించిన మరుసటి రోజే హిక్స్ రాజీనామా చేయడం గమనార్హం. విధుల్లో ఇన్నాళ్లు హిక్స్ చాలా అద్భుతంగా పనిచేశారని ప్రశంసిస్తూ ట్రంప్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.





రాష్ట్రవ్యాప్తంగా గురువారం హోలీ సంబురాలు అంబరాన్ని అంటాయి.. యువతీయువకులు వేడుకల్లో మునిగి తేలారు.. హైదరాబాద్‌లో వివిధ ప్రాంతాల్లో హోలీ సంబురాల దృశ్యాలు

హైకోర్టు లాయర్ల విధుల బహిష్కరణ

- జడ్జిల నియామకం చేపట్టాలని డిమాండ్



చార్మినార్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న హైకోర్టు లాయర్లు

హైదరాబాద్, మార్చి 1(మనం లీగల్ ప్రతినిధి): రెండు తెలుగు రాష్ట్రాల హైకోర్టు లాయర్ల సంఘాలు ఏకగ్రీవంగా చేసిన తీర్మానానికి అనుగుణంగా గురువారం లాయర్లు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. ఈ ఆందోళన శుక్రవారం కూడా కొనసాగనుంది. ఏపీ, టీఎస్ హైకోర్టు లాయర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు ధనుంజయ, కనకయ్యల సారధ్యంలో న్యాయవాదులంతా హైకోర్టు ఆవరణలోనే ఉన్న బార్ కౌన్సిల్ భవన్ నుంచి మదినా బిల్డింగ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మదీనా చౌరస్తా వద్ద న్యాయవాదులు కొద్దిసేపు బైఠాయించి నిరసన వెలిబుచ్చారు. లాయర్లు కోర్టు విధుల బహిష్కరణతో కోర్టు హాల్స్ వెలవెలబోయాయి. అత్యవసర కేసులకు చెందిన ఒకటి రెండు కేసుల్లో మాత్రమే లాయర్లు వాదనలు వినిపించారు. లాయర్లు వస్తే కేసులు వింటామని, లేనట్లయితే కేసుల్ని కొట్టేయకుండా వాయిదా వేస్తామని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘాలు గత మంగళవారం సర్వసభ్య సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారంకోసం సమైక్యంగా పోరాడాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశాయి. హైకోర్టుకు 61 న్యాయమూర్తుల పోస్టులుంటే అందులో ఖాళీగా ఉన్న సగం పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, దీనిపై సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. 2015 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లుగా తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు పూర్తి స్థాయి ప్రధాన న్యాయమూర్తి లేరని చెప్పారు. వెంటనే ప్రధాన న్యాయమూర్తి పోస్టును భర్తీ చేయడంతో పాటు హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని హైకోర్టుల్లో 2012 లోపు దాఖలైన కేసులను సత్వరమే కాలవ్యవధిలో పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన సర్క్యులర్‌ను తక్షణమే ఉపసంహరించాలని పేర్కొన్నారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రెండు సంఘాలు డిమాండ్ చేస్తూ సమైక్యంగా ఉద్యమించాయి. తమ ఆందోళన తర్వాత కూడా కేంద్రం, సుప్రీంకోర్టుల నుంచి సానుకూల స్పందన లేకపోతే 15 రోజుల తర్వాత తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని సంఘ నేతలు చెప్పారు. ఈ ఆందోళనకు దిగువ కోర్టుల్లోని లాయర్లు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి మద్దతు తెలిపారు. లాయర్ల నిరసన సందర్భంగా పోలీసులు పెద్ద సంఖ్యలో హైకోర్టు సరిసరాల్లో మోహరించారు. ర్యాలీ, నిరసనలు ప్రశాంతంగా జరిగింది.

సత్యపాల్ సింగ్‌ను బర్తరఫ్ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

హైదరాబాద్, మార్చి1(మనం ప్రతినిధి): సైన్స్‌ను కించపరుస్తూ అశాస్త్రీయ భావజాలాన్ని ప్రచారంచేస్తున్న కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.రాములు, చావా రవి డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ శాస్త్రీయంగా నిరూపితమైన డార్విన్ పరిణామ సిద్ధాంతం పనికిరాని చెత్త అని, సిలబస్ నుంచి తొలగించాలన్నారని చెప్పారు. న్యూటన్ గమన సుత్రాలు, మంత్రాల్లోనే ఉన్నాయని, బడి భవనాల వాస్తు మంచిగుంటేనే చదువు బాగా వస్తుందంటున్నారని ఆయనపై మండిపడ్డారు. దేశం వాస్తు బాగలేకనే.. ఇంతటి అజ్ఞాపు వ్యక్తి కేంద్ర మంత్రి అయ్యారని అన్పిస్తుందన్నారు. వ్యక్తిగత విశ్వాసాలను, అభిప్రాయాలను ఇతరులపై రుద్దడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని మండిపడ్డారు. సత్యపాల్ సింగ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించి రాజ్యాంగం ఔన్నత్యాన్ని కాపాడాలని వారు కోరారు.

ఫాంహౌస్‌లో టీఆర్ఎస్ నేతల పేకాట

- మందు.. విందు.. యువతులతో చిందులు
- 14మంది అరెస్టు.. 2.50 లక్షలు స్వాధీనం

హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): ఫాంహౌస్‌లో పేకాట ఆడుతూ, యువతులతో అసభ్య నృత్యాలు చేస్తున్న అధికార పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హోలీ పర్వదినం సందర్భంగా ప్రభుత్వం మద్యం దుకాణాలను మూసివేయించినా.. కార్యకర్తలు మాత్రం మద్యం సీసాలతో పట్టుబడ్డారని ఎస్‌వోటీ పోలీసులు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరులో ఓ ఫాంహౌస్‌కు గురువారం పెద్ద సంఖ్యలో కార్లు వచ్చాయి. దీంతో లోపల ఏంజరుగుతోందనే అనుమానంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు అక్కడికి చేరుకుని సోదాలు జరిపారు. ఈ సమయంలో టీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు కొందరు యువతులతో చిందులేస్తూ, పేకాట ఆడుతూ దొరికారని సమాచారం. అక్కడే పెద్ద సంఖ్యలో మద్యం సీసాలు ఉన్నట్టు తెలిసింది. మొత్తం 14 మంది టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.2.50 లక్షలను, పలు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో టీఆర్ఎస్ అత్తాపూర్ డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు ఉన్నట్టు తెలిసింది.

సమితులకే సర్వాధికారాలు..!



- వ్యవసాయ అధికారులపై పెత్తనం
- సహకర సంఘాలు నామమాత్రమే
- కొన్నింట్లో పంచాయతీలదీ ప్రేక్షకపాత్రే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అధికారులు

హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అత్యధిక జనాభాకు జీవనాధారమైన వ్యవసాయ రంగం ప్రస్తుతం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ పరిస్థితి నుంచి సాగును బయటపడేసేందుకు సీఎం కేసీఆర్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇందుకోసం 24 గంటల విద్యుత్, ముందస్తు పెట్టుబడి తదితర పథకాలను తీసుకొచ్చారు. ఈ క్రమంలో మార్కెట్ మంత్రాంగంలో దగా పడుతున్న రైతుకు ఆపన్నహస్తం అందించేందుకు 'రైతు సమన్వయ సమితి కార్పొరేషన్'ను ఏర్పాటు చేశారు. విత్తు కొనుగోలు నుంచి పంట అమ్ముకునే వరకు అన్ని దశలలోనూ రైతన్నకు అవసరమైన సాయం అందించేందుకు ఈ సమితులు తోడ్పడతాయి.

ఇప్పటికే అనధికారిక ఆదేశాలు

రాష్ట్రవ్యాప్తంగా సమన్వయ సమితిల సభ్యులు ఇప్పటికే వ్యవసాయ శాఖలో జరిగే ప్రతి కార్యక్రమ సమాచారాన్ని తెలపాలని గ్రామ సమన్వయ సమితి సభ్యులు అధికారులను ఆదేశిస్తున్నారు. సమితుల్లోని సభ్యులు అధికార పార్టీకి చెందిన వారు కావడంతో పైస్థాయి నుంచి ఒత్తిళ్లు వస్తాయనే ఉద్దేశంతో అధికారులు సైతం వారు చెప్పిన విధంగానే నడుచుకుంటున్నారు. ఇటీవల రాయితీ ట్రాక్టర్ల అంశంలోనూ సమన్వయ సమితి సభ్యులదే పైచేయిగా సాగింది. వాస్తవానికి వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తుదారు నిజంగా అర్హుడా..? లేదా? అనే విషయాన్ని నిర్ధారిస్తారు. కానీ సమితి సభ్యులు పేర్లు సూచిస్తుండడంతో వారు జాబితాను నింపడానికే పరిమితం అయ్యారు. పరిస్థితి ఇలానే కొనసాగితే.. త్వరలో ప్రభుత్వం అందించనున్న వరి నాటు యంత్రాల విషయంలోనూ రైతు సమితి సభ్యులు చెప్పిందే ఫైనల్ అనే పరిస్థితి నెలకొంది.

అందుకు అనుగుణంగా చట్టంలో సీఎం మార్పులు చేర్పులు కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో 'రైతు సమన్వయ సమితులు' కీలకం కానున్నాయి. రైతాంగం సంక్షేమం కోసం ఏర్పాటైన ఈ సమితుల విషయమై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుండగా.. అధికారులలో మాత్రం సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి తమ పాలిట గుదిబండలాగా మారనున్నాయనే సందేహం వెలిబుచ్చుతున్నారు. ఇటీవల రాజేంద్రనగర్‌లో నిర్వహించిన రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ అవగాహన సదస్సులో సమితి సభ్యులకు సీఎం కేసీఆర్ సూచించిన విధులు–బాధ్యతలను వింటే ఎవరికైనా ఈ అనుమానం కలుగుతుందంటున్నారు. దీంతో రైతు సమితుల పట్ల అధికారులు పెద్దఎత్తున ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నామమాత్రంగా సహకార సంఘాలు



రైతులు పంటలను అమ్ముకోవడం, రుణాలు పొందడం వంటి అంశాల్లో వ్యవసాయ సహకార సంఘాలు కీలకంగా పనిచేస్తున్నాయి. పంట దిగుబడులను రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయడం, ఎరువులు సకాలంలో అందించడం వంటి విషయాలకే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు పరిమితం అయ్యాయి. తాజాగా సీఎం కేసీఆర్ ఆ అంశాలను రైతు సమన్వయ సమితులే చూసుకుంటాయని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇక సహకార సంఘాల పాత్ర నామ మాత్రంగా మారనుందని తేట తెల్లమైంది.

ఇప్పటివరకు అధికారులే..

రాష్ట్రవ్యాప్తంగా పంటలను అమ్మడం, పంటల సాగు వంటి అన్ని విషయాల్లో అధికారుల ప్రమేయం ఉండేది. అధికారికంగా ఒక్క వ్యవసాయ మంత్రి తప్ప కిందిస్థాయిలో రాజకీయ నాయకుల జోక్యం ఉండేది కాదు. తాజాగా ఏర్పాటుచేసిన గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి సభ్యులు 1.61 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రస్థాయి సమితిలో ఉండే వ్యవసాయ రంగ నిపుణులు, ఎండీ మినహా మిగతా వారందరూ రాజకీయ నాయకులు. ఇందులోనూ అధికార పార్టీకి చెందిన టీఆర్ఎస్ కార్యకర్తలు కావడం గమనార్హం. అయితే అధికార యంత్రాంగం ప్రకారం చూస్తే.. మూడునాలుగు గ్రామాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ), మండలానికి వ్యవసాయ అధికారి(ఏఓ), నియోజకవర్గానికి సహాయ సంచాలకులు (ఏడీ), జిల్లాకు జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) వ్యవసాయ సంబంధిత అంశాలను పర్యవేక్షించడంతో పాటు బాధ్యులుగా ఉండేవారు. రైతు సమన్వయ సమితులు మండల వ్యవసాయాధికారిపైనా పెత్తనం చేలాయించేలా వాటి విధివిధానాలు ఉన్నాయి. ఇవి అమల్లోకి వచ్చిన క్షణం నుంచి అధికారులు ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యే అవకాశాలున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మండల సమన్వయ కర్తకు ప్రత్యేక గది

మండల రైతు సమన్వయ సమితి సమన్వయకర్తకు మండల కేంద్రంలో ప్రత్యేకంగా గదిని కేటాయించడంతో పాటు కంప్యూటర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రామస్థాయిలో నిర్మించనున్న రైతు వేదికలు, గ్రామపంచాయతీల్లో గ్రామ సమన్వయ కర్తలకు గదిని కేటాయించే అవకాశం ఉంది. దీంతో రైతులు ఏలాంటి సమస్య ఉన్నా.. సమన్వయకర్తల వద్దకే వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఇదీగాక భూ రిజిస్ట్రేషన్ల విషయంలో తహసీల్దార్లు, రిజిస్ట్రార్లను పర్యవేక్షించడం, ఏలాంటి జాప్యంలేకుండా రైతుల పేరు మీదకు భూమిని రిజిస్ట్రేషన్‌చేసే బాధ్యతలోనూ సమితులు భాగం అవుతాయని సీఎం కేసీఆర్ ప్రాంతీయ సదస్సుల్లో ప్రకటించారు. ఫలితంగా గ్రామపంచాయతీల్లోని రెవెన్యూ అధికారులు, వ్యవసాయ కార్యక్రమాల్లో గ్రామపంచాయతీల పాత్ర తగ్గనుంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న అధికార యంత్రాగానికి ప్రత్యామ్నాయంగా రైతు సమన్వమ సమితులు మారే ప్రమాదం ఉంది. నిజంగా అదేజరిగితే రానున్న రోజుల్లో అనేక సమస్యలు ఎదురుకానున్నాయి.

ప్రొటోకాల్ రగడ..

వాస్తవానికి ఇప్పటివరకు రైతు సమన్వయ సమితి సభ్యుల ప్రొటోకాల్ విషయం తేలలేదు. కానీ గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచ్‌ను మించి గ్రామ రైతు సమన్వయ సమితి సమన్వయకర్తకు ప్రాధాన్యం ఇవ్వాలనే ప్రచారం సాగుతోంది. ఏదైనా కార్యక్రమం తలపెట్టినప్పుడు.. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఇదే పరిస్థితి ఎదురవుతోంది. దీన్ని బలపరిచేలా.. రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా గుత్తా సుఖేందర్‌రెడ్డిని ప్రకటించిన మరుసటి రోజే రాష్ట్ర విద్యుత్, ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి గుత్తాను అధికారికంగా కలవడం ప్రొటోకాల్ అంశానికి బలానిస్తోంది.

పొత్తు ఖాయం

సందర్భానుగుణంగా నిర్ణయం

- ఆలోగా పార్టీని బలోపేతం చేయండి
- టీటీడీపీ పొలిట్‌బ్యూరో భేటీలో బాబు



టీటీడీపీ నేతలతో సమావేశమైన చంద్రబాబు నాయుడు

హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): యువతరాన్ని ప్రోత్సహించి తెలంగాణలో టీడీపీని బలోపేతం చేయాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, టీటీడీపీ నేతలకు సూచించారు. ఇక్కడి ఆయన నివాసంలో టీటీడీపీ పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యులతో గురువారం భేటీ అయ్యారు. తెలంగాణలో పార్టీ పరిస్థితులపై నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. పల్లెపల్లెకు తెలుగుదేశం, శిక్షణ తరగతులు వంటి కార్యక్రమాలపై సమీక్షించిన బాబు, వాటిని మరింత ముమ్మరం చేయాలని నేతలకు సూచించారు. రాష్ట్రస్థాయి నేతలంతా జిల్లా ల్లో విస్తృతంగా పర్యటించాలని ఆదేశించారు. మార్చి 29న పల్లెపల్లెకు తెలుగు దేశం కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, తదనంతరం మే 28 వరకు పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందించుకోవా లని బాబు చెప్పారు. పార్టీ ఓటింగ్ శాతాన్ని మరోసారి సమీక్షించుకుని పొత్తులపై సందర్భా న్నిబట్టి నిర్ణయం తీసుకుందామని, అప్పటివరకు స్వశక్తితో ఎదగాలని టీటీడీపీ నాయకులకు భరోసానిచ్చారు. పార్టీ మహానాడుకు ముందే తెలంగాణలో 3 భారీ బహిరంగ సభలు నిర్వహించాలని టీటీడీపీ నేతలు ప్రతిపాదించగా, బాబు సుముఖత వ్యక్తంచేసినట్టు సమాచారం.

హరీశ్వర్‌రెడ్డికి పరామర్శ



కొద్ది రోజులు అనారోగ్యంతో బాధ పడుతున్న వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, టీఆర్ఎస్ నేత కొప్పుల హరీశ్వర్ రెడ్డిని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం పరామర్శించారు. హరీశ్వర్‌రెడ్డి కొద్ది రోజులుగా హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న చంద్రబాబునాయుడు రాజకీయాలకు అతీతంగా ఆయన తనయుడు లోకేశ్‌తో కలిసి అపోలో ఆస్పత్రిలో ఉన్న హరీశ్వర్‌రెడ్డిని కలిశారు. ఆరోగ్యం గురించి వాకబు చేశారు. చంద్రబాబు రాక పట్ల హరీశ్వర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.

చంద్రబాబు జీవిత చరిత్రకు పుస్తక రూపం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు జీవిత చరిత్రను కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు డైరీ రూపంలో ముద్రించారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు నాయుడు ఈ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందడి శ్రీనివాసరావు చంద్రబాబునాయుడికి శాలువ కప్పి సన్మానించారు. తన జీవితానికి పుస్తక రూపం ఇచ్చిన శ్రీనివాసరావును చంద్రబాబు అభినందించారు.

శివాజీ పాలనే పాలకులకు స్ఫూర్తి

- పాశ్చాత్య విధానాలు మనకు పనికిరావు
- ఆరెస్సెస్ నేత దత్తాత్రేయ హొసబళే



మాదాపూర్‌లో పుస్తకావిష్కరణ చేస్తున్న దత్తాత్రేయ హొసబళే తదితరులు



హైదరాబాద్, మార్చి 1 (మనం ప్రతినిధి): దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చినా మేథోపరమైన స్వాతంత్ర్యం ఇంకా రాలేదని, ఈ పరిస్థితిని మార్చవలసిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ సర్ కార్యవాహ్ (ఆర్ఎస్ఎస్ జాయింట్ జనరల్ సెక్రటరీ) దత్తాత్రేయ హొసబళే అన్నారు. మాదాపూర్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెయినింగ్‌లో జరిగిన ఒక పుస్తకావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా అసంపూర్ణమైన, అసమగ్రమైన విదేశీ మూస ఆలోచనా ధోరణినే రుద్దే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. పాశ్చాత్య ఆలోచనలు భారతదేశపు సమస్యలకు పరిష్కారం చూపలేవని ఆయన అన్నారు. భారతదేశం విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిందని, ఈ తరం వీటిని మరింత పెంపొందించాలని, ప్రతిభను పెంపొందించాలని దత్తాత్రేయ పేర్కొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి అనిల్ మాధవ్ దవే హిందీలో రాసిన 'శివాజీ – స్వరాజ్ సే సురాజ్ తక్' పుస్తకం తెలుగు అనువాదం 'శివాజీ – స్వరాజ్యం నుంచి సురాజ్యం దాకా'ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుపరిపాలన ప్రజాకేంద్రితమై ఉండాలని, ప్రజా సంక్షేమమే ప్రాతిపదికగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా భాగస్వామ్యం ఉండాలని, నిర్ణయాల్లో, వాటి అమలులో ప్రజల పాత్ర తప్పనిసరని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన మై గవ్ డాట్ ఇన్ పోర్టల్ గురించి ప్రస్తావిస్తూ ఈ యాప్ వల్ల ప్రజలు పరిపాలనలో పాలు పంచుకునేందుకు వీలు కల్పిస్తోందని తెలిపారు. ఈ పాలనకు ప్రేరణ ఛత్రపతి శివాజీ నుంచే లభించిందని చెప్పారు. శివాజీ సాధారణ మహిళలతో మాట్లాడి తన రాజ్యంలోని పరిస్థితులను గురించి తెలుసుకునేవారని, నేటి పాలకులు దీనినుంచి ప్రేరణ పొందాలని సూచించారు.

శ్రీశైలం శివాజీ స్ఫూర్తి కేంద్రం, సోషల్ కాజ్, చేతన సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ పి సుబ్బారెడ్డి, సోషల్ కాజ్ అధ్యక్షులు సోమరాజు సుశీల, ఇండిక్ ఎకాడమీ అధ్యక్షులు శ్రీనివాస్ ఉడుమూడి, మావుడూరి సూర్యనారాయణ మూర్తి ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనా రెడ్డి, నెహ్రూ యువక్ కేంద్ర ఉపాధ్యక్షులు పేరాల శేఖర రావు, బీజేపీ సీనియర్ నేత ఎస్వీ శేషగిరిరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పుస్తకాన్ని సీనియర్ జర్నలిస్ట్ కె.రాకాసుధాకర్ రావు తెలుగులోకి అనువదించారు.

కుటుంబంసహా రైతు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో అఘాయిత్యం
- ఇద్దరు పిల్లలకు నిద్ర మాత్రలు వేసి.. భార్యకు విషమిచ్చి.. ఉరేసుకున్న భర్త
- దంపతుల మృతి.. ఆస్పత్రిలో చిన్నారులు
- మంచిర్యాల జిల్లా చొప్పిరిపల్లిలో ఘటన

కాసిపేట, మార్చి 1(మనం న్యూస్): అప్పుల బాధ తాళలేక ఓ రైతు కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇద్దరు పిల్లలతో నిద్ర మాత్రలు మింగించి, భార్యకు విషమిచ్చి, తాను ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై ఓ లేఖ కూడా రాశాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చొప్పరిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఈ విషాధం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొండగొర్ల తిరుపతికి(38), భార్య భూమ క్క, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిరుపతి తన రెండెకరాల తో పాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కూరగాయలు సాగుచేశాడు. ఇందుకోసం అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. దిగుబడిరాక చేసిన అప్పులు తీర్చలేక బుధవారం రాత్రి కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గురువారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తిరుపతి, అతని భార్య భూదేవి అప్పటికే మరణించగా, ఇద్దరు పిల్లలను ఆస్పత్రికి తరలించారు. కాగా తిరుపతి సూసైడ్ నోట్ రాశాడాని పోలీసులు చెప్పారు. ఆరేళ్లుగా వ్యవసాయం చేస్తున్నానని, కూరగాయల సాగు చేసి తీవ్రంగా నష్టం పోయాయని తిరుపతి పేర్కొన్నాడు. ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరితే.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 5 లక్షల రుణం ఇవ్వాలంటూ అధికారులను ఆదేశించారన్నాడు. అయితే బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఓ అధికారి 20వేలు లంచం ఇస్తేనే లోను మంజూరు చేస్తానని తేల్చిచెప్పాడన్నాడు. లంచం ఇవ్వలేక కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటున్నానని తిరుపతి లేఖలో పేర్కొన్నాడు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శుక్రవారం, మార్చి 2

ప్రైవేటీకరణపై చర్చ!


ప్రజా సంపదలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకే తెగనమ్మడం ప్రైవేటీకరణకు పర్యాయపదంగా మారింది. విజయ్‌మాల్యా, నీరవ్ మోదీ, విక్రమ్ కొఠారీ, నేడు శ్రీ లక్ష్మీ కాట్సిన్ లిమిటెడ్ అధినేత ఎం.పి.అగర్వాల్ చేసిన బ్యాంకుల కుంభకోణాలు వరుసగా బయటపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలంటూ కొద్దిరోజులుగా కార్పొరేట్ శక్తులు చర్చిస్తున్నాయి. అయితే ఈ బ్యాంకుల కుంభకోణాలకు ప్రధాన కారణం ఆ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు/వ్యక్తులే అయినపుడు వాటిని ప్రైవేటీకరించడం వల్ల దేశానికి ఒరిగేదేమిటి? సామాజిక బాధ్యత/భద్రత పునాదిగానో లేదా లాభసాటిగానో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థల్లోని ఉన్నతాధికారులు, పాలకులతో కుమ్మక్కై, వారికి లంచాలు ముట్టజెప్పి సంబంధిత ప్రభుత్వ సంస్థలను నీరుగార్చివేసి, వాటిని ప్రభుత్వం నుంచి కారుచౌకగా కొట్టేయడం వంటి కార్పొరేట్ కుట్రలు గతం నుంచి ప్రజలు చూస్తూనే ఉన్నారు. నిధులు అందించక ఊపిరి ఆడనివ్వకుండా చేయడమో లేదా సదరు ప్రభుత్వరంగ సంస్థ లాభాలను ఇతర సంక్షేమ పథకాలకు తరలించి రాజకీయ లబ్ధి పొందాలనుకునే పాలకులను అడ్డంపెట్టుకొని ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ ఒక్కొక్కటిగా దివాలా తీయిస్తున్నారు. ఖజానాకు గుదిబండగా మారిందనే నెపంతో వాటిని ప్రైవేటీకరణ పేరుతో కారుచౌకగా తెగనమ్మించి ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రైవేటీకరణ పేరుతో జరుగుతున్న ఆర్థిక విధ్వంసం కారణంగా ఆయా సంస్థల కారణంగా ఉపాధి పొందుతున్న ప్రత్యక్ష, పరోక్ష లబ్ధిదారులే కాక, ప్రజాసంపదను దుర్వినియోగం చేస్తున్నారు. అభివృద్ధి విధానాలు, సంక్షేమ కార్యక్రమాలు చేయవలసిన బాధ్యతనుంచి పక్కకు తప్పుకొని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు నెరవేర్చే కార్యనిర్వాహక యంత్రాంగంగా ప్రభుత్వం మారిపోయింది. కార్పొరేట్ శక్తుల ప్రోత్సాహబలంతో ప్రభుత్వరంగ సంస్థల్లో చోటు చేసుకున్న కుంభకోణాలు, దివాలా పరిస్థితులను సాకుగా చూపి ప్రైవేటీకరణ ద్వారా ఖజానా ఆదాయాన్ని పెంచుకొని, ఓట్లకోసం సంక్షేమ కార్యక్రమాలకు ఆ సొమ్మును కేంద్ర వినియోగిస్తుండడంపై ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

బ్యాంకింగ్ వ్యవస్థను సంక్షోభం ముంగిట నిలిపిన ఈ ఆర్థిక నేరాలన్నీ కార్పొరేట్ సంస్థల నిర్వాక ఫలితమే. అలాంటిది బ్యాంకింగ్ కుంభకోణాలకు మూలం ప్రభుత్వరంగ బ్యాంకుల యాజమాన్యమేనని ప్రచారం చేస్తున్న కార్పొరేట్ మీడియా కథనాల తీరు గర్హనీయం. సొంత సంస్థల్లో అత్యంత క్రమశిక్షణాయుతంగా పథకం ప్రకారం కార్యకలాపాలను నిర్వహించడం, సామాజికంగా ఉమ్మడి ఆస్తులు, బాధ్యతల విషయంలో అరాచకంగా ప్రవర్తించడం ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ వర్గాల పనితీరు. అలాంటి స్వభావం గల ప్రైవేటు యాజమాన్యాలు చే ఎన సహాయ నిరాకరణ కారణంగానే బ్యాంకుల జాతీయకరణ అంశం ఆనాడు ముందుకొచ్చింది. ఆ తర్వాత దేశ ఆర్థికాభివృద్ధిలో ఒకదశ దాకా బ్యాంకులు నిర్వహించిన పాత్ర గణనీయమైనదని చెప్పనక్కర్లేదు. అలాంటి బ్యాంకులను దివాలా తీయించడంలో కీలకపాత్ర పోషించిన కార్పొరేట్ వర్గాలే నేడు బ్యాంకుల ప్రైవేటీకరణకు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేటురంగ యాజమాన్య విధానాలు గొప్పగా ఉంటే కంపెనీలు దివాలా తీసి బ్యాంకులకు అప్పులు ఎందుకు ఎగగొడుతున్నాయి? బ్యాంకులు రుణ సంక్షోభపు ఊబిలోకి దిగబడి పో యేలా దివాలా తీయించిన మొండి బకాయిలన్నీ ప్రైవేట్ వర్గాలు చేసినవే గ దా!

దేశంలో ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన నాటి నుంచి దేశ, విదేశీ కార్పొరేట్ వర్గాల నిర్వాకం వల్లే వివిధ రంగాల్లో కుంభకోణాలు వెలుగు చూశాయి. కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ స్కాంల పర్వం నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ పాలనలో పరాకాష్ఠకు చేరిందనడంలో సందేహం లేదు. స్వాతంత్ర్యానంతర కాలంలో నుంచి దేశంలో అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాల పర్యవసానంగా ఆర్థిక, సామాజిక, నైతిక వ్యవస్థలన్నీ పతనావస్థకు చేరుతున్నాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత్ మోదీ వంటి ఆర్థిక నేరస్థులతో వ్యవహరించేందుకు 'దేశం విడిచి పరారైన ఆర్థిక నేరస్థుల బిల్లు'ను తీసుకురావాల్సిన అవసరాన్ని 2017 ఫిబ్రవరిలో అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించినా ఇంతవరకు దాని ఊసే లేదు. బ్యాంకులు తదితర ప్రభుత్వ రంగ సంస్థల్లో కుంభకోణాలు చేసిన ఆర్థిక నేరస్థులపై కఠినమైన చర్యలు తీసుకునే చట్టపరమైన విధానాలను రూపొందించి కచ్చితంగా అమలు చేసే యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలాపాలను సమకాలీన అవసరాల రీత్యా తీర్చిదిద్ది ప్రజా ప్రయోజనాలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వాలది. ప్రభుత్వ రంగం మంచిదా? ప్రైవేటు రంగం మంచిదా? అనే చర్చ నిరర్థకమైనది. ప్రజా ప్రయోజనాల కేంద్రంగా ఉండే పాలకుల రాజకీయార్థిక విధానాలు, చిత్తశుద్ధితో అమలు చేసే స్ఫూర్తి ఉంటే ప్రభుత్వ రంగం, ప్రైవేటు రంగాలను సమన్వయించి భారత్‌ను ఒక ఆర్థికాద్భుతంగా తీర్చిదిద్దగలిగే అవకాశాలు ఎప్పటికీ ఉంటాయి.



మంచిమాట




'ఎదుటి వ్యక్తి నీ దారిలో లేనంత మాత్రాన వాళ్లంతా దారితప్పారని అనుకోవడం పొరపాటు.'

-హెచ్ జాక్సన్ బ్రౌన్

నల్లబంగారం భవిష్యత్తు ఏమిటి?

దేశంలో 1774లో ఈస్టిండియా కంపెనీ అధ్వర్యంలో పశ్చిమబెంగాల్ దామోదర నది పరి వాహకంలోని రాణిగంజ్‌లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైనది. దాదాపు 199 సంవత్సరాలు బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ ప్రైవేటు యాజమాన్యంలోనే కొనసాగింది. ఈ సుదీర్ఘ కాలంలో బొగ్గు ఉత్పత్తికై పాటుపడిన శ్రామికుల కుటుంబాలు బాగుపడి సామాజిక అభివృద్ధికి తోడ్పడినట్లుగా మనకు ఎక్కడా ఆధారాలు లేవు. కాని బొగ్గు ఉత్పత్తి క్రమంలో రక్షణ సౌకర్యాలు కొరవడి జరిగిన ప్రమాదాల్లో వందలమంది కార్మికులు చనిపోయినటుగా అనేక ఆధారాలున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1973 మే 30న బొగ్గుగనుల జాతీయకరణ చట్టాన్ని తీసుకువచ్చారు. దాని మార్గదర్శకంలోనే 1975 నవంబర్ 1న 'కోల్ ఇండియా లిమి టెడ్'ను కేంద్ర ప్రభుత్వసంస్థగా ఏర్పాటు చేసినారు. ప్రజల కలలకు అనుగుణంగానే కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) తన లోగోను 'నల్లవజ్రం' (బ్లాక్ డైమండ్)గా ప్రకటించుకున్నది. రాజ్యాంగ ప్రవేశికకు ఆదర్శంగా బొగ్గు ఉత్పత్తిలో స్వయం ప్రతిపత్తిని, పర్యావరణ పరిరక్షణకు సాధించుకుంటూ మానవ మనుగడకు తోడ్పాటు నిస్తామన్న లక్ష్యాన్ని కూడా ప్రకటించుకున్నది. బొగ్గు బాయిలల్లో శ్రమటోడ్చి వెలికి తీసిన బొగ్గుతో లోకానికి జిగేల్మనే కరెంటు ఉత్పత్తికి దోహద పడిన శ్రామికుల బతుకులకు భరోసానిచ్చింది. కార్మిక సంఘాల పోరాటాలను గౌరవించి చర్చలకు అవకాశమిచ్చింది. జెబిసిసిఐ (జాయింట్ బై పార్టీయేట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ), ఎన్‌సీడబ్ల్యూఏ (నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్)ల ద్వారా మెరుగైన వేతన భత్యాలను, సంక్షేమాన్ని కల్పించింది. 1975 జనవరి ఒకటి నుంచి అమలులోకి వచ్చిన మొదటి నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్ 2016 జూలై ఒకటో తేదీ నుంచి అమలవుతున్న పదవ నేషనల్ కోల్‌వేజ్ అగ్రిమెంట్‌లకు సహకరించింది. ఆరులక్షలకు పైగా శాశ్వత కార్మికులతో, ఉద్యోగులతో ఉపాధి అవకాశాలకు కొంగు బంగారమైంది. ప్రభుత్వ సంస్థలు సహజ సంపదను వికేంద్రకరించి వచ్చిన ఉత్పత్తి ఫలాలను వేతన భత్యాలు, సంక్షేమం రూపకంగా కల్పిస్తూ దేశాభివృద్ధిలో పాలుపంచుకున్నాయి. బొగ్గుబాయిల కార్మికుల ఉద్యోగుల పిల్లలు ఉన్నత ఉద్యోగాలను పొందినారు. వృత్తి కులాలకు, చిరువ్యాపారులకు ఉపాధి దొరికి సామాజి క అభివృద్ధి జరిగింది. కోల్ ఇండియా లిమిటెడ్ కూ డా 2008-2009 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 45,797 కోట్ల టర్నోవర్ సాధించి డిపార్ట్‌మెంట్ పబ్లిక్ ఎంటర్ ప్రైసెస్ మార్గదర్శకంతో 'నవరత్న కంపెనీ'గా ప్రకటించబడింది. ప్రపంచంలోని ఆరు పెద్ద మైనింగ్ కంపెనీల జాబితాలో కోల్ ఇండియా లిమిటెడ్ కూడా వాసికెక్కింది. 1991 జూలై 16న తీసుకువచ్చిన నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాల మూలంగా అన్ని ప్రభుత్వ పరిశ్రమల మనుగడ ప్రశ్నర్థాకమైంది. వార్షిక బడ్జెట్‌లలో పరిశ్రమలకు కేటాయించే బడ్జెట్ సపోర్ట్‌ను ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. కాని యేటేటా రాయల్టీ యితరత్రా పన్నుల పేర వందల కోట్ల రూపాయలను ప్రభుత్వాలు పొందుతున్నాయి. అయితే కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కంపెనీలకు రాయల్టీ ఇతరత్రా పన్నుల చెల్లింపుతో పాటుగా బొగ్గు ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా 'కోల్ రెగ్యులేటరీ అథారిటీ' (ప్రభుత్వం) చెప్పిన ధరకు థ ర్మల్ ఫవర్ ప్రాజెక్ట్‌లకు అమ్మాలి. ఇంకా బొగ్గు సరఫరా ఒప్పందంతో ఉత్పత్తి చేసిన బొగ్గులో 70 శాతాన్ని థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకే సరఫరా చేయాలి. మిగిలిన బొగ్గును ఈ అక్షన్‌లో అమ్ముకుంటూ నిలదొక్కుకోవాలి. 2016 ఏప్రిల్ ఒకటిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా చేసిన సర్వే ప్రకారం దేశంలో 308.802 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలున్నాయి. కోల్ ఇండియా లిమిటెడ్ గడచిన 2016-17 ఆర్థిక సంవత్సరంలో 554.1 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది.



> బొగ్గుబాయిలు, బొగ్గు పరిశ్రమలు ప్రభుత్వ పరిశ్రమలుగా కొనసాగినప్పుడే సంపద వికేంద్రీకరించబడుతుందని, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్న భావవ్యాప్తి సార్వత్రిక ఎన్నికలను ప్రభావితం చేసే విధంగా జరగాలి. దానికి సమాంతరంగా ఆచరణాత్మకమైన ఐక్యపోరాటాలు కూడా జరగాలి.

సింగరేణి కంపెనీ 61.3 మిలియన్ టన్నుల బొగ్గుతో కలిపి దేశంలో దాదాపు 600 మిలి యన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగింది. దీనికితోడు 2017 ఆగస్టు 20 నాటి సమాచారం ప్రకారం 2016- 17 ఆర్థిక సంవత్సరంలో విదేశాల నుంచి 191.95 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతైంది. కోల్ ఇండియా విస్తరించిన జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల బొగ్గుగనులలో 2017 అక్టోబర్ ఒకటి తేదీ నాటికి 3,10,016 మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అలాగే కోల్ ఇండియా ఆస్తులు రూ.116,078-87 కోట్లు ఉన్నట్లుగా తెలుస్తోంది. బొగ్గు నిక్షేపాలను తవ్వుకునేందుకు పెట్టుబడిదారులకు ఇవ్వడానికి వాజపేయి ప్రభుత్వం నుంచి మొదలైంది. బొగ్గు గనుల జాతీయకరణ చట్టం 1973కు సవరణలు తేవడానికి 2000, 2012, 2014లలో ప్రయత్నాలు జరిగినవి. చివరకు మోదీ ప్రభుత్వం 'బొగ్గు గనుల ప్రత్యేక నిబంధనల చట్టం 2015'ను తీసుకువచ్చింది. 2018 ఫిబ్రవరి 20న ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగి న ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ సంఘం (సీసీఈఏ) సమావేశంలో పెద్దబొగ్గు గనులను, మధ్య స్థాయి, చిన్నబొగ్గు గనులలో కూడా ప్రైవేటు రంగానికి బొగ్గు తవ్వుకోవడానికి అవకాశమిస్తున్నట్లుగా నిర్ణ యించారు. కేంద్రంలో అధికారంలో కొనసాగిన పాలక పక్షాలన్నీ బొగ్గు గనులను ప్రైవేటుకు ఇవ్వడానికే మొగ్గు చూపినవి. 1993 నుంచి 2005 సంవత్సరాల మధ్య కాలంలో ప్రైవేటుకు గంపగుత్తగా ఇచ్చిన 22 కోల్ బ్లాక్‌లపై సుప్రీంకోర్టు అభిశంసించి రద్దుచేసింది. బొగ్గుబ్లాక్‌లను వేలంపాట ద్వారా ప్రైవేటుకు కేటాయించాలని సూచించింది. మోదీ ప్రధానమంత్రిగా బీజేపీ ప్రభుత్వం బొగ్గుగనులను తవ్వే పనులను ప్రైవేటుకు ఇచ్చిన చర్యను సమర్థించుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. దీన్ని ఉద్యోగ నియామకాలకు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన విషయంగా దాట వేయరాదు. ఓపెన్ కాస్ట్ గనులలో బొగ్గును తీసుకున్న తరువాత బొందలను మట్టితో పూడ్చిభూమిని యథాస్థితికి తెచ్చి అడవుల పెరుగు దలకు కృషిచేయాలి. అండర్ గ్రౌండ్ గనులలో బొగ్గు తీసిన స్థలాన్ని ఇసుకతో నింపుకుంటూ మిగతా బొగ్గు తీయాలి. అప్పుడే ధరిత్రి భూమాతగా వర్ధిల్లుతుంది. పర్యావరణం పరిరక్షించబడుతుంది. ప్రభుత్వ బొగ్గు పరిశ్రమలైన కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కంపెనీలు పూర్తిస్థాయిలో పర్యావరణ పరిరక్షణ పనులను చేపట్టడం లేదు. ఇక ప్రైవేటు యాజమాన్యంలో బొగ్గు గనులలో బొగ్గును తీస్తే ఎంత విధ్వంసం జరుగుతుందో చెప్పలేము. చైనా, ఇండోనేషియా మిగతా దేశాలలో ప్రైవేటు బొగ్గు గనుల అనుభవాలను నిదర్శనంగా తీసుకోవాలి. థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికై బాయిలర్‌లలో మండించే బొగ్గు వలన వెలువడే కార్బన్‌డై యాక్సైడ్, సల్ఫర్‌డై అక్సై డ్, హైడ్రోక్లోరిక్, అర్సెనిక్ తదితర వాయువుల వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. కాలిన బొగ్గు బూడిద ఇతర వ్యర్థ పదార్థాల వలన నేల, గాలి, నీరు కలుషితమవుతాయి. ఉష్ణోగ్రతలు పెరిగి గ్లోబల్ వా ర్మింగ్‌లతో వర్షపాతం తగ్గుతుంది. బొగ్గు వినియోగా నికి పోను ప్రభుత్వ పరిశ్రమలపరంగా బొగ్గు ఉత్పత్తి జరగనందుననే ప్రైవేటుకు బొగ్గుగనులను ఇస్తున్నా మని, బొగ్గు దిగుమతులను తగ్గించడానికి, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాచేసుకోవడానికి ప్రైవేటు బొగ్గు గనులే పరిష్కారంగా సిద్ధాంతీకరించడంలో ఏమాత్రం హేతుబద్ధత లేదు. రానున్న కాలంలో సౌర విద్యుత్, ఫవన్ విద్యుత్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఈలోపు కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కంపెనీలకు బడ్జెట్ సపోర్ట్‌ను కల్పిస్తూ కొత్త బొగ్గుగనులను తవ్వుకున్నట్లయితే బొగ్గు ఉత్పత్తి పెరుగుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తద్వారా సామాజిక అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ జరుగుతుంది. కాని బీజేపీ ప్రభుత్వానికి ప్రభుత్వ పరిశ్రమల పరిరక్షణపైగాని, విస్తరణలపై మక్కువ లేదనిపిస్తుంది. దానికి నిద ర్శనంగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి 80 వేల కోట్ల రూపాయలను పరిశ్రమల ఉపసంహరణ ద్వారా సమకూర్చుకోవాలని ప్రకటించడాన్ని చెప్పుకోవచ్చు. అయితే కేంద్రం తీసుకున్న నిర్ణయం వలన కోల్ ఇండియా లిమిటెడ్ భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. తెలంగాణలో వెలుగొందుతున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ భవిష్యత్ ఏమిటన్న సందేహాలు కలుగడం సహజం. అయితే సింగరేణి కంపెనీకి వెసులుబాటు ఉన్నది. 51 శాతం భాగస్వామ్యం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, 49 శాతం భాగస్వామ్యం కేంద్ర ప్రభు త్వానికి ఉన్నది. కార్యనిర్వహణ బాధ్యతలు కూడా తెలంగాణ ప్రభుత్వానికే ఉన్నది. అందువలన సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటుకు ఇవ్వాలంటే తప్పని సరిగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించవలసి ఉన్నది.కాబట్టి సింగరేణి కంపెనీకి ప్రమాదమేమీ లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఇటీవల శ్రీరాంపూర్‌లో సింగరేణి కార్మికుల బహిరంగ సభలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కేంద్రం తీసుకున్న నిర్ణయంతో కోల్ ఇండియాలో భయం పుట్టింది. సింగరేణి కార్మికులు భయపడవద్దని, సింగరేణిని ప్రైవేటు చేయబోమని భరోసా ఇచ్చినారు. ఈ ప్రభుత్వ కాలంలోనే తాడిచర్ల బొగ్గుబ్లాక్‌ను ఓపెన్‌కాస్ట్ గనిగా ప్రైవేటుకు అప్పగించారు. అలాగే 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను కూడా ప్రైవేటుకు అప్పగించారు. కాబట్టి సింగరేణి కంపెనీ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగానే ఉన్నది. బొగ్గుబాయిలు, బొగ్గు పరిశ్రమలు ప్రభుత్వ పరిశ్రమలుగా కొనసాగినప్పుడే సంపద వికేంద్రీకరించబడుతుందని, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్న భావవ్యాప్తి సార్వత్రిక ఎన్నికలను ప్రభావితం చేసే విధంగా జరగాలి. సమాంతరంగా ఆచరణాత్మకమైన ఐక్య పోరాటాలు కూడా జరగాలి.

మేరుగు రాజయ్య
సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్

అశ్లీలం చిమ్ముతున్న సినీరంగం

వర్తమానకాలంలో ప్రజలను బలంగా ప్రభావితం చేస్తున్న సాధనాలలో సినిమా అతి ప్రధానమైనది. సమాజాన్ని చైతన్యవంతం చేసే విషయంలో చిత్రరంగ ప్రభావం తక్కువేమీకాదు. ఒకప్పుడు సినిమాలు సామాజిక చైతన్యానికి, ప్రగతిశీల భావాలకు నెలవుగా ఉండేవి. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా, సామాజిక చైతన్యాన్ని ప్రోదిచేసే అనేక సినిమాలు గతంలో నిర్మించబడ్డాయి. కాని ఈనాడు అదే సినిమా నైతిక విలువలకు తిలోదకాలిచ్చి, మానవ సంబంధాలను అపహాస్యం చేస్తూ, మతసామరస్యానికి విఘాతం కలిగిస్తూ, మానవీయ విలువలను గాలికొదిలేసి, అసభ్యతను, అశ్లీలతను, సాంస్కృతిక కాలుష్యాన్ని పెంచి పోషిస్తూ ఉంది. సినిమారంగమంతా కాకపోయినా, అసభ్య, అశ్లీల సన్నివేశాలతో యువతరాన్ని రెచ్చగొట్టడం, మతం మసాలా అద్ది మతవర్గాల మధ్య వైషమ్య వాతావరణం కల్పించడం లాంటి పెడధోరణులకు మాత్రం కొదవ లేదనే చెప్పవచ్చు. ఇటీవల సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయిన ప్రియాప్రకాష్ వారియర్ నటించిన 'ఒరుఅడార్ లవ్ 'టీజర్ కూడా దీనికి ఒక ఉదాహరణ.

ప్రియా వారియర్ పేరుప్రస్తుతం సంచలనంగా మారిపోయింది. సంచలనానికి కేంద్రబిందువైకూర్చుంది. సోషల్ మీడియాలోనే కాదు,ప్రధాన మీడియాలోకూడా చర్చోపచర్చలకు దారి తీసిందీపేరు. ఇంతకూ ప్రియా చేసినఘనకార్యం ఏమిటి?కేవలం కన్నుగీటడం. ఈఒక్క ఎక్స్ ప్రెషన్స్‌కే టీనేజంతా ప్రియాకు ఫిదా అయిపోయింది.

అయితే, ఇందులో ముస్లిం కోణం ఏముంది? ముస్లింలకు ఆగ్రహం తెప్పించిన అంశం ఏమిటి? విషయం ఏమిటంటే, ముహమ్మద్ ప్రవక్త(స), హజ్రత్ ఖదీజా (ర.అన్ హా)గార్లను ఈపాటలో అవమానపరిచారన్నది ఆరోపణ. దీని ఆధారంగానే హైదరాబాద్, ముంబై నగరాలలో చిత్రదర్శకుడు సహా, మొత్తం పదిమందిపై కేసులు కుడా నమోదయ్యాయి. అసలు ఈ వివాదానికి కారణం ఏమిటి? నిజంగానే కేసులు పెట్టిన ముస్లిం సోదరులు అంటున్నట్లుగా ఆ పాటలో ముహమ్మద్ ప్రవక్త(స)నుగాని, ఆయన సతీమణి బీబీ ఖదీజా (ర.అన్ హా)గారిని గాని కించపరిచినట్లు, అవమాన పరిచినట్లు ఏమైనా ఉందా? నిజానికి అలాంటిదేమీలేదు. అలాంటిదేమైనా ఉండి ఉంటే ముందుగా కేరళలోని మళయాళం భాష తెలిసిన ముస్లిములే ఊరుకునేవారుకాదు. అక్కడిభాష, ఆపాటలోని భావాన్ని తెలిసినవారెవ్వరూ మాట్లాడలేదు. కేసులూపెట్టలేదు. మరొక విషయం ఏమిటంటే, అది ఈరోజు కొత్తగా రాసినపాటకూడాకాదు. 1990ల్లోనే పి.ఎం జబ్బార్ అనే ఒకముస్లిం లిరికిస్ట్ ఆపాటరాశాడు. దాని మ్యూజిక్ డైరెక్టర్ షాహిద్ రహ్మానీ, ఆచిత్రదర్శకుడు ఉమర్ లూలూ అందరూ ముస్లిములే.

కేరళ ముస్లిం సంస్కృతిలో ఆపాట ఒకభాగంగా మారిపోయింది.



వివాహ సందర్భాల్లో, పండుగల్లాంటి శుభకార్యాల్లో అక్కడి ముస్లిములు అనాదిగా ఆపాటను పాడుకుంటూనే ఉన్నారు. బీబీ ఖదీజా(ర.అన్ హా) గారి సుగుణాలను కీర్తిస్తూ పాడుకునేపాట అది.

విషయం ఏమిటంటే, 'ఒరుఆడార్ లవ్' చిత్రంలో 'మాణిక్య మలరాయ పూవీ' అనే ఈపాట బ్యాక్ గ్రౌండ్‌లో ప్రియా ప్రకాష్ వారియర్ బోయ్ ఫ్రెండ్‌కు కనుబొమ్మలద్వారా హావభావాలు పలికిస్తూ, కన్నుగీటుతున్నట్టు చిత్రించారు. ఒకవైపు 'మహా'ప్రవక్త దంపతుల పవిత్రప్రేమను ఘనంగా కీర్తిస్తూ, ఆనేపథ్యంలో ఈకవ్వింపులు, కన్నుగీటడాల్లాంటి పోకడల దృశ్యీకరణలేమిటి? దానికీ దీనికి అసలేమైనా సంబంధం ఉందా? దీనిద్వారా సమాజానికి ఇవ్వదలచుకున్న సందేశం ఏమిటి? ముఖ్యంగా యువతరానికి ఇస్తున్న సందేశం ఏమిటి? ఇదిఅభ్యంతరకరం కాదా?

అయితే ఇది ముస్లింలకు మాత్రమే అభ్యంతరంకాదు, యావత్తు సమాజానికీ అభ్యంతరకరం. యువతరాన్ని భావోద్రేకాల ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేసి, తద్వారా లాభాలు దండుకోవాలన్న దుర్మార్గపు ఆలోచన దీనివెనుక ఉంది. ఇదీ అభ్యంతరకరం. నిజానికి ఆపాటకూ, సన్నివేశానికి ఏకోశానా సంబంధం లేదు. ప్రవక్త సతీమణి బీబీ ఖదీజాగారి సుగుణాలను కీర్తిస్తూ కేరళ ముస్లింలు సంతోష సమయాల్లో, ముఖ్యంగా వివాహ సందర్భాల్లో పాడుకునే జానపదగేయమది. అలాంటి పవిత్రప్రేమ బంధాన్ని వర్ణిస్తూ భక్తిభావంతో పాడుకునే సందర్భానికి, చౌకబారు, అసభ్య సన్నివేశాన్ని జోడించి చూపించడం అసలు సమస్య.

ఎక్కడో ఒకచోట ముస్లింల భావోద్రేకాలను రెచ్చగొట్టి, వాళ్ళనురోడ్డెక్కించి, సంచలనాలు నమోదుచేసి, చౌకబారుప్రచారం పొందాలన్నది అసలు ఉద్దేశ్యం. ఇటువంటి చౌకబారు ప్రచారం ఈరోజేదో కొత్తగా సృష్టించిందికాదు. కన్నుకొట్టడమే ఏంఖర్మ, అంగాంగ ప్రదర్శనలకే దిక్కులేదు. రాంగోపాల్ వర్మ జి.యస్ .టీ దీనికి పరాకాష్ట. ఇలాంటి దిక్కుమాలిన, అశ్లీలకర ప్రదర్శనలకు యువతరం ఫిదా అయిపోతున్నది. కొంతమంది పెద్దలుకూడా నీతి నియమాలను పక్కనబెట్టి, 'ఆ..ఏముంది..వినోదం..' అనే దౌర్భాగ్య పరిస్థితులు దాపురించాయి. ఇదివిచారకరం. ఈవిధమైన ఆలోచనా ధోరణి మారాలి. సినిమాలు సమాజానికి, ముఖ్యంగా యువతరానికి దిశానిర్దేశం చేయగలగాలి. మంచి సందేశాన్ని ఇవ్వగలగాలి. ఆరోగ్యకరమైన వినోదంతోపాటు, విజ్ఞానాన్ని పంచాలి.

యండి. ఉస్మాన్ ఖాన్
సీనియర్ జర్నలిస్ట్
9912580645

ఆత్మరక్షణ ఆలోచన

మన లేఖలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి నాలుగు సంవత్సరాలు కావొస్తుంది. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని అప్పటి కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొంది. దీనిపై ఇంతవరకు ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ.. అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు ఒక్కసారైనా ప్రస్తావించిన దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపిస్తుండడంతోనే 'ప్రత్యేక హోదా' ప్రస్తావనతో రాజకీయ పార్టీలు ముందుకు తీసుకొస్తున్నాయి. హోదాపై కేంద్ర ప్రభుత్వం స్తబ్దుగా ఉన్నా.. సాధించుకోవాల్సిన హక్కు మాత్రం ఏపీ రాష్ట్ర ప్రభుత్వానిదే. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ కారణాలో.. వ్యక్తిగత ప్రయోజనాల కోసమో గానీ.. నాలుగు సంవత్సరాలుగా ఏనాడూ ప్రత్యేక హోదా ప్రస్తావనను నోటి నుంచి జారనీయలేదు. ఓవైపు స్వరాష్ట్రంలో ప్రతిపక్షాల నుంచి అడపాదడపా ప్రత్యేక హోదాపై విమర్శలు విన్పిస్తున్నా.. వాటిని బాబు పెడచెవిన పెట్టారు. తాజాగా రాజకీయాల్లో దుందుడుకుగా వ్యవహరిస్తున్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రత్యేక హోదాపై రాష్ట్రంలో 'జేఎఫ్‌సీ' పేరుతో పెద్ద చిచ్చును రగిల్చాడు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఒక అడుగు ముందుకేసి ప్రత్యేక హోదాను ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ తన ఎంపీలతో రాజీనామా చేయిస్తానని, ప్రత్యేక హోదాపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోతే అవిశ్వాస తీర్మానం పెడతామని పేర్కొన్నారు. అపర చాణక్యుడుగా పేరుగాంచిన చంద్రబాబు ఇక ప్రత్యేక హోదాపై మాట్లాడడం అనివార్యమని భావించి, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించడం మొదలుపెట్టాడు. తన పార్టీ నాయకులతో బీజేపీపై మాటల తూటాలను పేల్చి .. ఇలా ప్రతిపక్షాలను ఇరుకున పెట్టేలా, ప్రజలను నమ్మించేలా ప్రయత్నాలు చేశారు. దీన్ని ప్రతిపక్షాలు అవకాశంగా తీసుకుని హోదాపై బాబు మాట్లాడకుండా.. తన పార్టీ నాయకులు, మంత్రివర్గంతో మాట్లాడించడంతో కేంద్రంపై మెతకవైఖరిని ప్రదర్శించడమేనని ఆరోపించాయి. ఇక తప్పేలా లేదనుకున్నారో, ఏమోగానీ బాబే స్వయంగా రంగంలోకి దిగారు. తనదైన శైలిలో చాణక్య నీతితో కేంద్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు కురిపించారు. ఒకానొక స్థాయిలో కేంద్రంతో తెగతెంపులు చేసుకునేందుకైనా తాము సిద్ధమనే స్థాయికి వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల్లోకి వెళ్లాలంటే.. బీజేపీతో మైత్రిని దూరం చేసుకుంటేనే మంచిదని ఇప్పటికే ఆయన భావించారు. ఆ దిశగా పార్టీకి మార్గదర్శకాలను పంపారు. పార్టీ నేతలు సైతం ఇదే ధోరణిలో ఇటు రాష్ట్రంలోని బీజేపీ నాయకులపై.. అటు కేంద్రం ప్రభుత్వంపై బహిరంగంగానే విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. విమర్శలో భాగంగా మా ఎంపీలతో అవిశ్వాసం పెట్టడానికి, అఖిలపక్షం వేయడానికి సిద్ధమని ప్రకటించారు. ప్రత్యేక హోదా సాధించేందుకు చక్కని ఊతంలా కన్పించిన జేఎఫ్‌సీని సైతం చంద్రబాబు తన వ్యూహంతో తుత్తునీయలు చేశారు. ఆకస్మాత్తుగా కేంద్రంపై టీడీపీ తన వైఖరిని మార్చుకోవడంతో ప్రతిపక్షాలు డోలాయమానంలో పడిపోయాయి. చంద్రబాబు తన రాజకీయ చతురతను ఉపయోగించి ఎన్నికల్లో పార్టీ దెబ్బతినకుండా ఆత్మరక్షణకు వీలైన ఆలోచన చేస్తున్నారు.

- పి. ప్రదీప్, మంచిర్యాల

మనం
కుటుంబం
శుక్రవారం, 2 మార్చి 2018
www.manamnews.com



color crush

కలర్ క్రష్..

ఇలా హ్యాపీగా!

జాగ్రత్తలు తప్పనిసరి

హోలీ అంటే ఏదో మొరటుగా ఆడే పండుగ అన్న కాలం పోయింది. కలర్‌ఫుల్ ప్రపంచంలో ఒక్కరోజైనా రంగులతో తడిసిముద్దయిపోదామనే భావన బలపడుతోంది. అయితే.. ఇప్పుడున్న కలుషితాలకు హోలీ ఆడాలంటే అడుగడుగునా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. లేదంటే పండుగ అయ్యాక డాక్టర్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అందుకే మీ కట్టు-బొట్టు-జుట్టుపై కనీస అవగాహన కల్పించుకుని, కొన్ని చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఈ పండుగ మరింత ఉత్సాహాన్నిస్తుంది. కలర్స్ ఎంజాయ్ చేయాలంటే ఎక్కడపడితే అక్కడ కొనకుండా, ఆర్గానిక్ రంగులనే ఎంచుకునేందుకు మొట్టమొదటి ప్రాధాన్యం ఇవ్వండి. సహజసిద్ధ పద్ధతుల్లో తయారైన ఈ రంగులు కాస్త ఖరీదు ఎక్కువైనా వీటితో మీకు పెద్ద ప్రమాదాలు జరగవు. సింథటిక్ కలర్ పౌడర్స్ మీ కంట్లో, ముక్కులో, గొంతులోకి వెళ్తే.. దీర్ఘకాలంపాటు మీరు జబ్బుపడతారు. ఇక వెంట్రుకలపై వీటి ప్రభావం అత్యధికంగా ఉంటుంది. అందుకే పొడి జుట్టుతో హోలీ ఆడకుండా నూనె రాసుకుని రంగులు చల్లుకోండి. ఇక మంచి మాయిశ్చరైజర్ రాసుకుని, అది చర్మంపై పూర్తిగా ఆరాకనే రంగుల్లో మునిగి తేలండి. కుదిరితే కళ్ల జోడు (కూలింగ్ గ్లాసెస్), ముక్కుకు మాస్కులులు వేసుకుని ఎంజాయ్ చేయండి. ఫుల్ హ్యాండ్స్ కుర్తాలు, జాకెట్లు, షర్టులు ధరించండి. కాటన్ వస్త్రాలు ధరిస్తే అవి రంగులను పీల్చుకుని మీ శరీరానికి రక్షణ కవచంలా నిలుస్తాయి. ఖరీదైన వస్త్రాలు అస్సలు ధరించకండి. పిచికారీలతో రంగులు చల్లుతున్నప్పుడు మీ చెవుల్లో, కంట్లో, ముక్కులోకి డైరెక్టుగా రంగు నీళ్లు పోకుండా జాగ్రత్త వహించండి.



మత్తు పానీయాలతో పారాహుషార్

ఇక హోలీ అంటేనే భంగ్ వంటి పలు మత్తు పదార్థాలను సేవించే సందర్భమని ఉత్తరాది వారు భావిస్తారు. కనుక హోలీ స్పెషల్ స్వీట్లు, లస్సీ వంటి పదార్థాల్లో మత్తుమందు ఎంత మోతాదులో ఉందో మీకు తెలియదు కాబట్టి, అసలు కొత్తవారు ఎవరైనా మీకు నోరూరించే హోలీ పసందులు ఇస్తే మాత్రం వాటిని ముట్టుకోకండి. అవి తిని మత్తులో పడిపోతే ఆ తరువాత ఏ అఘాయిత్యం జరుగుతుందో ఊహించలేం. సో.. కొన్ని జాగ్రత్తలతో మీ ఆరోగ్యం, అందానికి భంగం వాటిల్లకుండా కలర్స్ క్రష్‌ను ఆస్వాదించేందుకు సన్నద్ధమవండి.. హ్యాపీ హోలీ.



మీరు సెన్సిటివ్ అయితే గోవిందా..

మీరు సెన్సిటివ్ అయితే మాత్రం హోలీకేళీకి దూరంగా ఉండండి. ఇందులో ఎటువంటి మొహమాటం అవసరం లేదు. ఎందుకంటే మీరు సున్నిత స్వభావులైతే మాత్రం ఈ సందర్భంగా ఎదురయ్యే సంఘటనలను మీరు స్పోర్టివ్ గా తీసుకోలేరు సరికదా..కుళ్లి కుళ్లి మథనపడతారు. ఇక సరదాగా ఏవేవో సినిమా డైలాగులు వేస్తూ, పాటలు పాడుతూ, ఆట పట్టిస్తూ.. హుషారుగా సాగే హోలీ సందడిని మీరు అస్సలు తట్టుకోలేరు. పైపెచ్చు మీ మనసులో అవసరంగా లేనిపోని అనుమానాలు, భయాలు మొదలవుతాయని తెలుసుకోండి. ఇక మీ చర్మం సున్నితమైన చర్మమైతే మరింత ప్రమాదం. అలర్జీల వంటివి మీ చర్మాన్ని పాడు చేసి, అనారోగ్యంపాలు చేస్తాయి. అందుకే మీ చర్మ తత్వం, మీ మనస్తత్వాన్ని గుర్తెరిగి హోలీ సంబరాల్లో పాల్గొనండి. లేదా దూరం నుంచి చూసి ఆనందించండి. ఈ రంగుల పండుగలో కలర్స్‌లో మునిగితేలినా, హోలీ ఆడుతున్న వారిని చూసినా మనకు ఎంతో ఆహ్లాదం కలగుతుంది. అదే హోలీ స్పెషాలిటీ..

నగలతో గేమ్స్ వద్దు..

హోలీ సందడిలో భాగంగా మనం రంగుల ముద్దగా మారిపోతాం. కానీ ఈ సమయంలో మీరు నగలు ధరించారంటే మాత్రం వాటిపై మరకలు పడటం ఖాయం. ఒకవేళ ఆ రంగులు ఆర్గానిక్ రంగులు కాకపోతే మాత్రం ఇక నగలపై రంగుల మరకలు శాశ్వతంగా పడిపోతాయి, కనుక నగలు తీసి హోలీలో మునిగితేలండి. కావాలనుకుంటే గిల్టు నగలు ధరించి సెల్ఫీలు, వీడియోలు తీసుకుని మీ ముచ్చట తీర్చుకోండి. ఏదో సినిమాల్లో హీరోయిన్ నిండు నగలతో హోలీ ఆడింది కదా..! అని మీరు కూడా అలా ముస్తాబై నగలను నాశనం చేసుకోకండి. పైపెచ్చు గుంపులు గుంపులుగా ఆడే హోలీలో ఎవరు మీకు రంగులు పూయడానికి వచ్చి మీ నగలను ఎత్తుకెళ్తారో చెప్పలేం. అందుకే సందట్లో సడేమియాలుంటారు కనుక విలువైన నగలు ధరించకండి.





ఆకతాయిలతో జాగ్రత్త..

రోడ్లపైన, వీధుల్లో, రిసార్టుల్లో జరిగే హోలీ ఫెస్టివల్ లో ఆకతాయిలు పాల్గొంటూ ఉంటారు. మీరు తెలిసిన వారి మధ్యనే హోలీ జరుపుకుంటే ఏ దిగులూ ఉండదు. కానీ కొత్త ప్రాంతాల్లో, రిసార్టుల్లో రంగుల పండుగలో పాల్గొంటే మాత్రం ఆకతాయిలు ఏ అఘాయిత్యానికైనా పాల్పడవచ్చు. కనుక ముఖాలు కూడా కనిపించకుండా రంగుల మయమైన ప్రజలమధ్య హోలీ జరుపుకునే సమయంలో మీ చుట్టుపక్కల ఎలాంటి వారున్నారో కూడా ఓ కన్నేసి ఉంచడం అత్యవసరం. ఇక డీజేల హోరు వంటివి పెద్దగా ఉన్నచోట మీరు సాయం కోసం అరిచినా ఎవరికీ వినిపించదు.



సబ్జా... సూపర్ ఫుడ్!

ఔషధ గుణాలు మెండుగా ఉన్న సబ్జా గింజలపై చాలామందికి చిన్న చూపు ఉంది. వేసవిలో సబ్జా గింజలను రోజూ తీసుకోవడం అలవాటుగా పెట్టుకుంటే చాలా మంచిది

ఎలా తినాలి?

మార్కెట్లో లభించే సబ్జా గింజల్లో ఇసుక, రాళ్లు లేకుండా శుభ్రం చేసుకోండి. వీటిని కాసిన్ని నీళ్లు పోసి నానబెట్టండి. 10 నిమిషాలకంతా మీకు ఉబ్బిన సబ్జాలు కనిపిస్తాయి. ఇందులో మరింత నీరు పోసి పూర్తిగా నాననివ్వాలి. ఆతరువాత మీకు నచ్చిన వెరైటీలను ట్రై చేసేందుకు ఓ రెండు నిమిషాల సమయం వెచ్చిస్తే చాలు బోలెడు సబ్జా వెరైటీలు సిద్ధమవుతాయి. వేసవిలో అయితే చల్లని పాలు లేదా మజ్జిగ కలుపుకుని తాగితే చాలు. కమ్మని రుచినచ్చే సబ్జా గింజలను నిర్లక్ష్యం చేయకండి. ఎందుకంటే.. గోరువెచ్చని నీటిలో నానబెట్టిన సబ్జా గింజల్లో యాంటీ ఆక్సిడెంట్లు విడుదలై.. జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుంది.



ఏముంటుంది?

సబ్జా గింజలు చూసేందుకు చాలా చిన్నగా కనిపిస్తాయి.. నానితే కాస్త సగ్గుబియ్యంలా అగుపిస్తాయి. అయితే వీటిలో ఉన్న ఔషధ గుణాలు అన్ని వయసుల వారిపై మంచి ప్రభావం చూపుతాయి. బ్లడ్ షుగర్‌ను అదుపులో ఉంచుతుంది. మలబద్ధకాన్ని పారద్రోలుతుంది. చల్లదనాన్ని ఇచ్చి.. మీ ఒంట్లోని వేడిని తగ్గిస్తుంది. యాంటీ ఏజింగ్‌గా పనిచేసే సౌందర్య సాధనం కూడా. స్కిన్ ఇన్ఫెక్షన్స్‌కు మంచి మందుగా సబ్జా గింజలు పనిచేస్తాయి. జుట్టు రాలడం తగ్గి, వాటి పెరగడంలో సహకరించే సబ్జా విత్తనాలకు మీ మెనూలో సరైన ప్రయారిటీ ఇవ్వడం ఇప్పటినుంచైనా మొదలు పెట్టండి.

హెల్తీ డ్రింక్...

సేమ్యా, ఐస్ క్రీం, పళ్లు, జ్యూస్, పెరుగు, మజ్జిగ, పాలు ఇలా దేంతోనైనా సులువుగా కలిసిపోయే సబ్జా గింజలు వేసవి తాపం నుంచి విముక్తినిచ్చే బెస్ట్ బాడీ కూలెంట్స్. మిల్క్ షేక్స్, నిమ్మ రసం, షర్బత్ ఇలా వేటిలోనైనా నానబెట్టిన సబ్జా గింజలను కలిపి తాగవచ్చు. బాడీ డీటాక్స్ కావాలంటే షార్ట్ కట్‌గా సబ్జా నీరు తాగితే సరిపోతుంది. ఎసిడిటీ వంటి సమస్యలకు ఇది విరుగుడుగా పనిచేస్తుంది. విటమిన్ కే, ఐరన్ పుష్కలంగా ఉన్న సబ్జా నవయవ్వనం నింపేలా సహకరిస్తుంది. తరచూ వచ్చే సీజనల్ డిసీజెస్, ఇన్ఫెక్షన్స్ పై చక్కగా పనిచేసే సబ్జాను మీరు మీ కిచెన్‌లో ఎప్పుడూ స్టాక్ పెట్టుకోండి. థాయ్‌లాండ్ వంటి దేశాల్లో కొబ్బరి నీళ్లు, కొబ్బరి పాలు, తేనె, పాలు, నీళ్లు, చక్కెరతో కూడిన పలు కాంబినేషన్లతో తయారు చేసే వెరైటీలు తప్పకుండా సేవిస్తారు. కానీ చిన్న పిల్లలకు మాత్రం ఇవి గొంతులో చిక్కుకునే ప్రమాదం ఉంది కనుక సబ్జా గింజల వెరైటీలను చిన్నారులకు ఇవ్వకపోతే మంచిది. ఇక గర్భిణీ స్త్రీలలో కూడా సబ్జా ఈస్ట్రోజెన్ స్థాయిని తగ్గించేలా ప్రభావం చూపే అవకాశం ఉంది కనుక వీటిని గర్భిణీలు సేవించకపోతే మంచిది. తక్కిన వాంతా సబ్జాల వెరైటీలను ఈ వేసవిలో హాయిగా ఎంజాయ్ చేయవచ్చు.





పొట్ట చుట్టూ ఉండే కొవ్వు సహజంగా కరిగేందుకు ఇది చక్కగా పనిచేస్తుంది. రోజు కనీసం ఓ చిన్న గ్లాసైనా సబ్జా నీరు, లేదా సబ్జాతో చేసిన ఆహార పదార్థాలు సేవించండి, ఇది రుచికరంగానూ ఉంటుంది. ఒబేసిటీతో బాధపడేవారు తప్పనిసరిగా సబ్జా గింజలు తీసుకోవాలి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అత్యధికంగా ఉన్న ఈ గింజల్లో ఫైబర్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. దీంతో కడుపు బాగా నిండినట్టు అనిపిస్తూ, ఏదేదో జంక్ ఫుడ్ లాగించాలనే ఆలోచనలకు కళ్లెం వేస్తుంది. కనుక ఆకలి అదుపులో ఉండేలా ఇవి పనిచేస్తాయి. ఎప్పుడూ ఆకలితో అలమటించేవారు ఫ్రూట్ సలాడ్, వెజిటబుల్ సలాడ్స్ లో కూడా నానబెట్టిన సబ్జాలను ఉపయోగిస్తే ఆకలిని కొంతవరకూ జయించే చాన్స్ ఉంటుంది.

జాబిలమ్మపైనా వాట్సాప్!

చంద్రుడిపై త్వరలో 4జీ నెట్‌వర్క్.. తొలి అడుగు పడిన 50 ఏళ్లకే నెట్



- వోడాఫోన్-నోకియా భాగస్వామ్యం
- మొట్టమొదటి వాణిజ్య ల్యాండింగ్
- చంద్రుడి నుంచి హెచ్‌డీ లైవ్ స్ట్రీమింగ్
- పరిశోధనలలో అతిపెద్ద ముందడుగు

వాషింగ్టన్, మార్చి 1: ''చందమామతో ఒక మాట చెప్పాలి.. ఒక పాట పాడాలి'' అని సినీకవులు రాశారు. కానీ ఇప్పుడు ''చందమామకే ఒక వాట్సాప్ పంపాలి.. ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాలి'' అనుకోవాల్సిన సమయం వచ్చేసింది. ఎందుకంటే చంద్రుడి మీద కూడా త్వరలోనే 4జీ నెట్‌వర్క్ వచ్చేస్తోంది. జాబిలమ్మపై మనిషి తొలిసారి కాలు పెట్టి.. సగర్వంగా జెండా ఎగరేసిన సరిగ్గా 50 సంవత్సరాల తర్వాత అక్కడ ఇంటర్‌నెట్ వాడుకునే అవకాశం వచ్చేస్తోంది. అవును.. వచ్చే సంవత్సరమే చంద్రుడిపై ఉన్నవారికి మనం వాట్సాప్ పంపొచ్చు, వాళ్లతో వీడియో కాల్ మాట్లాడుకోవచ్చు. వోడాఫోన్ జర్మనీ, నోకియా సంస్థలు సంయుక్తంగా ఈ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాయి. చంద్రుడి ఉపరితలం మీద రోవర్లు సేకరిస్తున్న శాస్త్రీయ సమాచారం మొత్తాన్ని అక్కడి నుంచి ఇక్కడకు పంపడం సులభం అవ్వడానికి ఈ నెట్‌వర్క్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అంతరిక్ష స్థాయి నెట్‌వర్క్ అభివృద్ధి చేయడానికి వీలుగా తాము నోకియాను సాంకేతిక భాగస్వామిగా నియమించుకున్నట్లు వోడాఫోన్ తెలిపింది. ఈ నెట్‌వర్క్ పరికరాల బరువు కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఒక పంచదార బ్యాగ్ కంటే కూడా ఇది తక్కువ బరువే ఉంటుందని చెబుతున్నారు.

మొట్టమొదటి వాణిజ్య ల్యాండింగ్

ఇప్పటివరకు వ్యోమగాములు మాత్రమే చంద్రుడి మీదకు వెళ్లేవారు. మొదటిసారిగా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై కాలు మోపారు. కానీ ఇప్పుడు ఇన్నాళ్ల తర్వాత తొలిసారి అక్కడ వాణిజ్యపరమైన ల్యాండింగ్ జరగబోతోంది. బెర్లిన్‌కు చెందిన అంతరిక్ష పరిశోధనా సంస్థ పీటీ సైంటిస్ట్స్ దీనికి సూత్రధారి కానుంది. నోకియా బెల్ ల్యాబ్స్ నుంచి అత్యంత తేలికైన మొబల్ మాస్ట్‌లను ఇది ప్రయోగిస్తుంది. ఇందుకు స్పేస్ ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్‌ను ఉపయోగిస్తారు. ఇది అమెరికాలోని ఫ్లోరిడాలో గల కేప్ కానావెరల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన నుంచి టేకాఫ్ అవుతుంది. ఆ తర్వాత వోడాఫోన్ ఇంజనీర్లు బ్యాటరీని చాలా తక్కువగా వినియోగించుకునే నెట్‌వర్క్‌ను రూపొందిస్తారు. అందుకు నోకియా పరికరాలను ఉపయోగించుకుంటారు. ఆడి సంస్థ తయారుచేసిన రోవర్లు ఇప్పటికే చంద్రుడిపై ఉన్నాయి. వాటి ద్వారా హైడెఫినీషన్ (హెచ్‌డీ) ఫుటేజిని భూమ్మీద ఉన్న బేస్ స్టేషన్‌కు పంపడం వీలవుతుంది. విశ్వంలోనే తొలిసారి.. నేరుగా చంద్రుడి మీద నుంచి హెచ్‌డీ లైవ్ స్ట్రీమ్ ప్రసారం చేయడానికి 180 మెగాహెర్ట్జ్‌ల ఫ్రీక్వెన్సీ బ్యాండ్ ఉపయోగించాలని వోడాఫోన్ భావిస్తోంది. సౌరవ్యవస్థలో కేవలం భూమ్మీద మాత్రమే కాకుండా.. ఇతర గ్రహాల మీద నివాసం ఏర్పరుచుకోగలగాలంటే ముందుగా వేరే గ్రహాలపై తగిన మౌలిక సదుపాయాలు కల్పించుకోవాలని.. అందుకోసం సౌర వ్యవస్థపై పరిశోధనలు చేయడంలో ఇది తొలి, కీలకమైన అడుగు అవుతుందని పీటీ సైంటిస్ట్స్ సంస్థ వ్యవస్థాపక సీఈవో రాబర్ట్ బోమ్ చెప్పారు. ముందుగా చంద్రుడి మీద ప్రత్యేకమైన కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను నెకొల్పి, తగిన పరిశోధనలు చేస్తామన్నారు. ఇది చాలా తక్కువ విద్యుత్తును ఉపయోగించుకుంటుందని, డేటా పంపేటపుడు కూడా తక్కువగానే వాడుకుంటుందని.. అందువల్ల ఎక్కువ కాలం పనిచేస్తుందని ఆయన వివరించారు. మొబైల్ నెట్‌వర్క్ సదుపాయాల అభివృద్ధి విషయంలో ఇది ఒక విప్లవాత్మకమైన ముందడుగని వోడాఫోన్ జర్మనీ సీఈవో హేన్స్ ఆమెట్‌సైటర్ తెలిపారు.

పోస్టాఫీసు కనిపించదు గానీ..
ఎక్కడ చూసినా మద్యం షాపులే

- సర్కారుపై కమల్‌హాసన్ మండిపాటు
- దుకాణాల సంఖ్య తగ్గించాలని సూచన
- మద్యనిషేధం సాధ్యం కాదని వెల్లడి



చెన్నై, మార్చి 1: తమిళనాడులో మద్యం దుకాణాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని కమల్‌హాసన్ అన్నారు. రాష్ట్రంలో అన్ని టస్మాక్ దుకాణాలు అక్కర్లేదని.. బయటకు వెళ్తే పోస్టాఫీసు కనిపించడం కష్టం అవుతోంది గానీ, టస్మాక్ షాపు మాత్రం వెంటనే కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఇది వెంటనే మారాలని ఒక తమిళ పత్రికలో రాసిన వ్యాసంలో సూచించారు. ఇటీవలే మక్కల్ నీది మయ్యమ్ అనే రాజకీయ పార్టీ పెట్టిన ఆయన.. క్రమంగా ప్రభుత్వ విధానాలను విమర్శించడం మొదలుపెట్టారు. ఇన్నాళ్లుగా ఆ పత్రికలో రాస్తున్న వ్యాస పరంపరను తాజా కథనంతో ఆపేశారు. మద్యాన్ని పూర్తిగా నిషేధించడం కూడా సాధ్యం కాదని ఆ కథనంలో కమల్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ మద్యం తాగడం మానేలా చేయడం అయ్యే పని కాదని, అలా చేస్తే జనాలు హత్యలకు పాల్పడి నానా కంగాళీ చేసేస్తారని రాశారు. తమిళనాడులో అధికారపార్టీ నాయకులకు సొంతంగా డిస్టలరీలు ఉన్నాయని, ముందుగా వాళ్లు మద్యనిషేధం గురించి మాట్లాడి.. ఆ తర్వాత మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తారని అన్నారు. చివరకు స్కూళ్ల దగ్గర కూడా టస్మాక్ షాపులు పెడుతున్నారని, తమ డిస్టిలరీలలో ఉత్పత్తి చేసిన మద్యాన్ని అమ్ముకోవడం ఒక్కటే వాళ్లకు కావాలని విమర్శించారు. మహిళల ఓట్ల కోసమే వాళ్లు మద్యనిషేధం గురించి మాట్లాడతారన్నారు.

సినిమాలు బంద్

దక్షిణాది మొత్తం థియేటర్ల సమ్మె.. నిర్మాతల మండళ్లదే నేతృత్వం



- నేటినుంచి నిరవధికంగా మూసివేత
- వీపీఎఫ్ తగ్గించాలని ప్రధాన డిమాండ్
- రంగంలోకి కొత్త డిజిటల్ ప్రొవైడర్లు
- భారీగా తగ్గింపు ధరలతో రంగప్రవేశం

విశాఖపట్నం, మార్చి 1 (మనం న్యూస్‌బ్యూరో): సినిమా థియేటర్‌ల వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్)ను తగ్గించాలన్న ప్రధాన డిమాండుతో శుక్రవారం నుంచి రెండు తెలుగు రాష్ట్రాలు సహా దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో సినిమా థియేటర్లు మూత పడుతున్నాయి. నిరవధిక సమ్మెకు థియేటర్ల యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు.. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ కు చెందిన నిర్మాతల మండళ్ల ఆధ్వర్యంలోనే ఈ థియేటర్ల సమ్మె జరగనుంది. వీపీఎఫ్‌ను ఒక్కసారిగా వారానికి రూ. 7500 నుంచి రూ. 30 వేలకు పెంచడాన్ని నిరసిస్తూ నిర్మాతల మండళ్లు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో తెలుగు రాష్ట్రాలలోని థియేటర్ల యజమానులు, మేనేజర్లు ఎక్కడికక్కడ ఫిలిం ఛాంబర్ కార్యాలయాల్లో సమావేశమై సినిమా ప్రదర్శనల బంద్ పాటించాలని నిర్ణయించారు. సినిమాల ప్రదర్శను ఆపేయడం ద్వారా డిజిట ల్ ప్రొవైడర్లపై ఒత్తిడి తీసుకొచ్చి ఫీజులను తగ్గింపజేయడం లేదా తక్కువ ధరలతో సర్వీసు అందించే కొత్త ప్రొవైడర్లతో ఒప్పందాలు కుదుర్చుకోవడం కోసం వీరు ప్రయత్నిస్తున్నారు.

డిజిటల్ సదుపాయం

గతంలో ప్రింట్ల ద్వారా సినిమాలను ప్రదర్శించేవారు. తర్వాత కొంత కాలానికి.. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ప్రదర్శనలు అందుబాటులోకి వచ్చాయి. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన గురు సినిమాతో దక్షిణ భారతదేశంలో డిజిటల్ యుగం ఆరంభమైంది. 2007 నుంచి డిజిటల్ ప్రొవైడర్ సంస్థలు థియేటర్లలో డిజిటల్ పరికరాలను ఉచితంగా ఏర్పాటుచేశాయి. గతంలో ప్రింట్ ద్వారా సినిమాను ప్రదర్శించేటపుడు ఒక్కో ప్రింట్‌కు రూ.70 వేల వరకూ ఖర్చయ్యేది. పెద్ద హీరోల సినిమాకు 300 వరకూ ప్రింట్లు అవసరమయ్యేవి. ఈ నేపథ్యంలో థియేటర్లలో డిజిటల్ ప్రదర్శనలు వచ్చాయి. డిజిటల్ సదుపాయం వచ్చాక ప్రింట్ వ్యయం రూ.27 వేలకు తగ్గిపోయింది. ప్రింట్‌లతో సినిమా ప్రదర్శించడం కష్టంతో కూడుకున్న వ్యవహారం కావడం, డిజిటల్‌లో నాణ్యత ఎక్కువ కావడంతో అందరూ దీనికే మొగ్గుచూపారు. దానికి తోడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నిచోట్ల కావాలనుకున్న ఒకే సమయంలో విడుదల చేయడానికి కూడా వీలవుతోంది. నెగెటివ్ ఎక్స్‌పోజింగ్, దాన్ని కత్తిరించడం లాంటి సమస్యలు కూడా అక్కర్లేకపోవడం.. ఎడిటింగ్ సులభతరం అవ్వడం లాంటివన్నీ సానుకూలంగా మారాయి.

సంస్థల పెత్తనం

క్యూబ్ సినిమా టెక్నాలజీ, యుఎఫ్‌వో మూవీస్ ఇండియా లిమిటెడ్, ప్రసాద్ ఎక్స్‌ట్రీం డిజిటల్ సినిమా నెట్‌వర్క్ (పీఎక్స్‌డీ) సంస్థలు థియేటర్లతో ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. ఈ ఒప్పందం మేరకు థియేటర్లలో డిజిటల్ పరికరాలను ఉచితంగా సమకూర్చాయి. ఇందుకుగాను యాజమాన్యాలు వీపీఎఫ్ కింద వారానికి రూ.7500 చొప్పున చెల్లిస్తున్నాయి. ఇప్పుడు ఆ ఫీజును ఒకేసారి రూ.30 వేలకు పెంచాయి. దీన్ని థియేటర్ యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మెజారిటీ థియేటర్లు కొందరు నిర్మాతల గుప్పెట్లో ఉండటంతో నిర్మాతల మండలి బంద్‌కు పిలుపునిచ్చింది.

కొత్త ఆఫర్లు

ఇప్పుడు డిజిటల్ సేవలందిస్తున్న క్యూబ్, యూఎఫ్‌వో, పీఎక్స్‌డీ సంస్థలు సిండికేట్‌గా మారి ఫీజులను పెంచడంతో కొత్త సంస్థలు రంగంలోకి దిగాయి. కొత్త ఆఫర్లను యాజమాన్యాల ముందుంచాయి. అయితే, పాత ఒప్పందాలు రద్దు కావాల్సి ఉంది. పాత సంస్థలతో ఒప్పందాలు రద్దయితే కొత్త సంస్థలతో తక్కువ ఫీజుకు ఒప్పందాలు చేసుకొనేందుకు యాజమాన్యాలు సిద్ధపడుతున్నాయి. కొన్ని కొత్త సంస్థలు వారానికి వీపీఎఫ్ ఫీజును కేవలం రూ. 2500 మాత్రమే అని ముందుకురావడం విశేషం.

కుసంస్కారం.. అహంకారం



- కేటీఆర్‌పై మండిపడ్డ జానారెడ్డి
- మా పథకాలే ప్రారంభిస్తున్నారు
- శిలాఫలకాలపై మా పేర్లు చూడండి
- ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారు
- మాలో ఎంతమందిని జైలుకు పంపారు

హైదరాబాద్, మార్చి 1 (మనం ప్రతినిధి): రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తనపై చేసిన వ్యాఖ్యలను ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి తీవ్రంగా ఖండించారు. జానా బాబా 44 దొంగలని చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌ది కుసంస్కారం, అధికార అహంకారమని గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ విమర్శించారు. పెద్దవాళ్లను విమర్శిస్తే పెద్దవాడిని అయిపోతానన్న భ్రమలో ఇష్టం వచ్చినట్లుగా అర్హతకు మించి మాట్లాడటం మంచిపద్ధతి కాదన్నారు. కేటీఆర్‌పై తాను స్పందించడం తన స్థాయికి తగనిదని... అయినా స్పందించక తప్పడం లేదని చెప్పారు. ఇక నుంచి కేటీఆర్ చేసే ఇలాంటి చౌకబారు మాటలకు స్పందించబోనని ప్రకటించారు. కేటీఆర్ వాడుతున్న భాషను ప్రజలే గమనించి, తగిన గుణపాఠం చెప్పాలని జానారెడ్డి కోరారు. కాంగ్రెస్ పార్టీ, జానారెడ్డి ఏం చేశారని ప్రశ్నించడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కేటీఆర్ ప్రారంభించిన మంచినీటి పథకానికి తానే శంకుస్థాపన చేశానని, అనాడే వంద కోట్లు కేటాయించామని తెలిపారు. సూర్యాపేటలో మంత్రి ప్రారంభించిన మంచినీటి పథకానికి తాము రూ. 70 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పాలేరు కట్టపై ఈ రెండు పథకాలకు సంబంధించిన శిలాఫలకం ఉంటుందని, దానిపై తన పేరును ఆయన చూసుకోవచ్చని అన్నారు. కొంతమంది ముఠాను తయారుచేసుకుని పడికట్టు పదాలతో జనాలను మోసం చేస్తున్న వీరికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జానారెడ్డి హెచ్చరించారు.

నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యపై టీఆర్‌ఎస్ పుట్టక ముందే కాంగ్రెస్ పోరాడిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత 500 గ్రామాల్లో ఈ సమస్య ఉన్నట్లు గుర్తించి 475 గ్రామాలకు రక్షిత మంచినీటి సరఫరా చేశామన్నారు. టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. అప్పుడు తాము మొదలుపెట్టిన పథకాలనే ప్రారంభిస్తూ తామే చేసినట్లు సిగ్గులేకుండా చెప్పుకుంటున్నారని జానారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి భవనం కట్టిన తరువాత పైన పెంట్‌హౌస్ నిర్మించుకుని .. చూడు ఇల్లు ఎలా కట్టామో అని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన అనేక పథకాల్లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేస్తూ, ఇదంతా తామే చేశామని చెప్పుకొంటూ తమపై విమర్శలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. తమపై కేసులు ఉన్నాయని పదే పదే విమర్శిస్తున్న మీపై కూడా కేసులు ఉన్న విషయం మరిచిపోవద్దన్నారు. అవినీతికి పాల్పడితే థాయిలాండ్ ప్రధాని జైలుకు వెళ్లాడని, ఆ పరిస్థితి మీకు రాకుండా చూసుకోవాలన్నారు.

తమ ప్రభుత్వ కాలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగాయని, వీరిని జైలుకు పంపుతామని కేసీఆర్ శాసనసభలోనే ప్రకటించారని, ఎంత మందిని జైలుకు పంపించారో చెప్పాలని జానారెడ్డి డిమాండ్ చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న గొర్రెలు ప్రస్తుతం ఎన్ని ఉన్నాయో చెప్పాలన్నారు. ఇందులో జరిగిన అవినీతికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు మంచినీళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదలు పెట్టి ప్రారంభించిన విద్యుత్, సాగునీటి, మంచినీటి పథకాలు ఉంటే చెప్పాలని జానారెడ్డి కోరారు. నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీరు ఇస్తామని కేసీఆర్ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారని, తన నియోజకవర్గంలో ఏనాడో నాగార్జునసాగర్, శ్రీశైలం ఎడమ కాలువ , వివిధ ఎత్తిపోతల పథకాల ద్వారా లక్షా 70 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ఏమీ చేయలేదని, జానారెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదని చేస్తున్న ఆరోపణలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.



అపాచీ హెలికాప్టర్..
మేడ్ ఇన్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలోని ఆది భట్లలోని వైమానిక సెజ్‌లో టాటా- బోయింగ్ ఏరో స్పేస్ కంపెనీలో హెలికాప్టర్ల విడిభాగాల తయారీని ఉత్పత్తిని గురువారం ప్రా రంభించారు. ఈ కార్యక్ర మంలో రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, టాటా సన్స్ ఎమరిటీస్ చైర్మ న్ రతన్ టాటా, అమెరికా రాయబారి కెన్నత్ జెస్టర్, రాష్ట్ర మంత్రి కేటీఆర్, ఎంపీలు కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, ఎమ్మెల్యేలు తీగల క ష్ణారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఆదిభట్ల కేంద్రంలో జీరో డిఫెక్ట్‌తో హెలికాప్టర్ల తయారీ జరుగుతోందని అమెరికా సంస్థ వెల్లడించినట్లు తెలిపారు. రోబోట్లు తయారు చేస్తే లోపాలు ఉండవని, అదే తరహాలో ఎటువంటి లోపాలు లేని అపాచీ హెలికాప్టర్లను ఇక్కడ నిర్మిస్తున్నారని అన్నారు. తెలంగాణలోని ఆదిభట్లలో ఉన్న సౌకర్యాలు ఆ కచ్చితత్వాన్ని ప్రదర్శిస్తున్నాయన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన మానవ శక్తితోనూ లోపాలు లేని హెలికాప్టర్లు తయారు చేయవచ్చునని ఆదిభట్ల యూనిట్ నిరూపిస్తోందని అన్నారు. ఆదిభట్ల రక్షణ ఉత్పత్తుల ప్రాజెక్టును నిర్ణీత సమయానికే పూర్తి చేశారని, డెడ్‌లైన్ కంటే ముందే ఉత్పత్తులను డెలివరీ చేస్తున్నారని మంత్రి సీతారామన్ తెలిపారు. ప్రాజెక్టును ఎంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారన్న దానికి ఇది నిదర్శనమని ఆమె అన్నారు. ఈ ప్రాజెక్టుతో అమెరికా-భారత్ మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడుతాయని పేర్కొన్నారు.

కేన్సర్‌పై టాటా ట్రస్ట్‌తో ఒప్పదం..

దేశంలోని ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలని టాటా గ్రూప్ అధినేత రతన్ టాటా అన్నారు. కేన్సర్ నివారణకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'సమగ్ర కేన్సర్ చికిత్స(కాంప్రెహెన్సివ్ కేన్సర్ కేర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం)'లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం, టాటా ట్రస్ట్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రతన్ టాటా మాట్లాడుతూ.. కేన్సర్‌పై పోరుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. కేన్సర్‌పై చాలా మందికి అవగాహన లేదని, క్యాన్సర్‌పై పేదలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కేసీఆర్ కిట్స్ గురించి మంత్రులు రతన్ టాటాకు వివరించారు. కిట్స్ అద్భుంగా ఉందని టాటా ప్రశంసించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వానికి టాటా ట్రస్టు అందిస్తున్న సహకారం మరువలేదన్నారు. ప్రభుత్వం ఆస్పత్రుల్లో 20కి పైగా ఐసీయూలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదరణ పెరిగిందన్నారు.ప్రభుత్వం ఆస్పత్రుల్లో ప్రసవాల శాతం 31 నుంచి 50కి పెరిగినట్టు పేర్కొన్నారు. ప్రసవాల సమయంలో ఆస్పత్రుల్లో ఆపరేషన్లు తగ్గాయని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుండె, కాలేయ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్‌తో కలిసి విద్యార్థులకు ఐకేర్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా కోటి ఇండ్లకు మంచినీరు ఇస్తామని వెల్లడించారు. టీహబ్ నుంచి రెండేండ్లలో 200 స్టార్టప్‌లు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంత కుమారి, టాటా ట్రస్ట్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3న జేఎఫ్‌సీ నివేదిక వెల్లడి

హైదరాబాద్, మార్చి 1 (మనం ప్రతినిధి): ఏపీ విభజన హామీలు, నిధుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్న దాంట్లో ఎవరిది నిజమో తేలిపోనుంది. ప్రజలకు వాస్తవాలను వెల్లడించేందుకు జనసేన చొరవతో ఏర్పడిన సంయుక్త నిజ నిర్ధారణ (జేఎఫ్‌సీ) కమిటీ రూపొందించిన నివేదిక మార్చి 3న ప్రజల ముందుంచుతామని ఈ పార్టీ వర్గాలు వెల్లడించాయి. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జనసేనాని పవన్‌తో జయప్రకాశ్ నారాయణ, ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, తోట చంద్రశేఖర్ భేటీ అయ్యారు. కమిటీ నివేదిక తదితరాలపై వీరంతా చర్చలు జరిపారు.



సింగరేణి ఖుషీ!

తప్పిన ప్రైవేటీకరణ ముప్పు

హైదరాబాద్, మార్చి 1 (మనం ప్రతినిధి): బొగ్గు గనుల ప్రైవేటీకరణపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన సింగరేణి కార్మికులను అభద్రతా భావంలోకి నెట్టేసింది. భవిష్యత్తుపై మేఘాలు కమ్ముకోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కానీ.. సింగరేణిని ప్రైవేటుపరం కానివ్వమంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన తిరిగి కార్మికుల్లో ధైర్యం నింపింది. సింగరేణి, ప్రభుత్వం ఓ ప్రణాళికతో పని చేస్తే సంస్థ భవిష్యత్తు బంగారుమయం అయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేటీకరణ ముప్ప తప్పినట్లే..!

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు అలుపెరగని పోరాటం చేశారు. కార్మిక సమస్యలు కాకపోయినా తెలంగాణ పోరులో మేము సైతం అంటూ చేయి కలిపారు. 35 రోజుల పాటు ఉత్పత్తిని నిలిపివేసి కేంద్ర ప్రభుత్వానికి దడ పుట్టించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ సింగరేణి కార్మికులను దేశ సరిహద్దు సైనికులతో పోల్చారు. సింగరేణికి మంచి భవిష్యత్తు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అయితే దేశంలోని బొగ్గు గనులను వేలం వేసేందుకు ఇటీవల కేంద్రం తీసుకున్న నిర్ణయంతో సింగరేణి కార్మికుల్లో ఆందోళన మొదలయ్యింది. ఇటీవల మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సింగరేణి కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో సింగరేణి ప్రైవేటీకరణ ప్రస్తకే లేదు. అసలు ఆ సమస్య ఉత్పన్నమే కాదు. అవసరమైతే కేంద్రం వాటా తెగతెంపులు చేసుకోవడంతో పాటు, వాటా ధనాన్ని చెల్లించేందుకు కూడా సిద్ధమే, ఎట్టి పరిస్థితుల్లో సింగరేణిని ప్రైవేటీకరణ కానివ్వమంటూ సీఎం కేసీఆర్ అన్న మాటలతో కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కంపెనీ ప్రైవేటీకరణ ముప్పు తప్పినట్లే అని భావిస్తున్నారు.

ప్రైవేటుకిస్తే ఉపాధి డౌటే..

ఒకప్పుడు సింగరేణిలో లక్షా 16వేల మంది కార్మికులు ఉండేవారు. యాంత్రీకరణ, ఇతర సంస్కరణల ద్వారా ఇప్పుడు ఆ సంఖ్య 50శాతం తగ్గింది. ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థను ప్రైవేటుపరం చేస్తే శాశ్వత కార్మికుల సంఖ్య దశలవారీగా తగ్గే అవకాశం ఉంది. సింగరేణిలో ప్రస్తుతం 52 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఉపరితల గనుల్లో వెలికితీసే మట్టి పనులను ఇప్పటికే ప్రైవేటు కాంట్రాక్టర్లు చేపడుతున్నారు. భూగర్భ గనుల్లోనూ కొన్ని పనులను యాజమాన్యం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. తాడిచర్లలోని ఒక బ్లాకును జెన్ కోకు అప్పగించగా, జెన్ కో ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. ఈ క్రమంలో తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయం అమలైతే ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులందరికీ ఉపాధి లేకుండా పోతుందనే భావన ఉంది. పైగా కార్మికుల వేతనాలు కూడా తగ్గుతాయి. వేజ్‌బోర్డు ఉండదు. కేంద్రం నిర్ణయంతో కార్మికుల్లో ఆందోళన మొదలైన సీఎం కేసీఆర్ ప్రకటనతో స్థిమిత పడ్డారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సరైన ప్రణాళికతో ముందుకెళితే సంస్థ భవిష్యత్తు బంగారుమయం అయ్యే అవకాశాలున్నాయి. బొగ్గు వెలికితీతలో అపార అనుభవం ఉన్న సింగరేణి కేంద్రం వేలంలో పాల్గొని బొగ్గు బ్లాకులను దక్కించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఒడిశాలో నైనీ బ్లాకును తీసుకున్న సంస్థ ఇతర రాష్ట్రాల్లోకి విస్తరించేందుకు మార్గం సుగమమవుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం తీరుతో భరోసా..

తెలంగాణకే తలమానికమైన సింగరేణి సంస్థను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపడంతో కార్మికులకు భరోసా లభించినట్లయ్యింది. దేశంలోని బొగ్గు పరిశ్రమలను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడంతో కోల్‌ఇండియాతో పాటు సింగరేణిపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. కోల్ ఇండియా పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండటంతో అక్కడి కొత్త బొగ్గు గనులను ప్రైవేటుపరం చేసే అవకాశం ఉంది. సింగరేణి కాలరీస్ సంస్థ మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో కొనసాగుతోంది. 51 శాతం తెలంగాణ రాష్ట్రం, 49 శాతం కేంద్ర ప్రభుత్వ వాటాగా ఉంది. కేంద్రం వాటా తక్కువగా ఉన్నప్పటికీ కొత్త గనుల కేటాయింపు నుంచి బొగ్గు ధర నిర్ణయం, సరఫరాకు సంబంధించిన అంశాలు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటాయి. పర్యావరణ అనుమతులు కూడా కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. దీంతో ఇన్నాళ్లు కేంద్రం సహకరిస్తూ వస్తోంది.

ఉగ్రవాదంపై పోరు మతాతీతం

- తప్పదారి పట్టించే దృక్పథ నిర్మూలనే దాని లక్ష్యం
- ఇస్లాం వారసత్వ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ
- సార్వజనీనతతోనే రక్షణ... జోర్డాన్ రాజు అబ్దుల్లా-2
- విద్వేషకులకు ఇంటర్నెట్ వంటివి వేదికలు కాకూడదు

న్యూఢిల్లీ, మార్చి 1: ఉగ్రవాదం, దుర్బోధలపై పోరాటం ఏ మతానికీ వ్యతిరేకం కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అది పూర్తిగా మతాతీమని, యువతను తప్పుదోవ పట్టించే దృక్పథ నిర్మూలనే దాని లక్ష్యమని వివరించారు. ''ఇస్లాం వారసత్వం: అవగాహన పెంపు-సంయమనం'' ఇతివృత్తంగా ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో గురువారం ఆయన ప్రసంగించారు. ప్రతి మతమూ మానవ విలువలనే ప్రబోధిస్తుందని, అనేక ప్రధాన మతాలకు భారత్ పుట్టినిల్లని పేర్కొన్నారు. అనాది వర్ధిల్లుతున్న బహుళత్వ ఆచరణకు భారత ప్రజాస్వామ్యమే నిదర్శనమని చెప్పారు. అందువల్ల ఇస్లాంసహా అన్ని మత విశ్వాసాలూ ఘోషిస్తున్న మానవతా విలువల ఆచరణతో యువత



రాష్ట్రపతి కోవింద్, ప్రధాని మోదీ, జోర్డాన్ రాజు అబ్దుల్లా-2

మమేకం కావాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ముస్లిం యువత ఒక చేత పవిత్ర ఖురాన్‌తోపాటు మరోచేత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ముందడుగు వేయాలని సూచించారు. మతం పేరిట దాడి వాస్తవానికి మతంపైనే దాడి చేయడమే కాగలదని ఈ సదస్సులో పాల్గొన్న జోర్డాన్ రాజు అబ్దుల్లా-2 కూడా కుండబద్దలు కొట్టారు. ఏ మత విశ్వాసమైనా మానవాళిని సమైక్యంగా ఉంచేది కావాలని ఆకాంక్షించారు. మత విశ్వాసం పేరిట విద్వేషం వెదజల్లేవారిని గుర్తించి, తిరస్కరించాలని నొక్కిచెప్పారు. విద్వేష ప్రచారకులకు ఇంటర్నెట్ వంటి వేదికలు అందుబాటులో లేకుండా చేయాలని సూచించారు. ఏ విశ్వాసమైనా మానవాళి ప్రగతికి, సౌభాగ్యానికి తోడ్పడేదేనని, ముస్లిములు-ముస్లిమేతరుల మధ్య సాన్నిహిత్యం పెరగాలని చెప్పారు. సంక్షోభాలనుంచి బలమైన రక్షణ కల్పించగలిగేది సార్వజనీనత మాత్రమేనని ఆయన స్పష్టీకరించారు.

భారత-జోర్డాన్‌ల మధ్య రక్షణ సహకారం

జోర్డాన్ రాజు భారత పర్యటన సందర్భంగా పలు కీలక ప్రాంతీయ, ద్వైపాక్షిక అంశాలపై ప్రధాని మోదీ ఆయనతో సమగ్ర చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం ఉగ్రవాదంపై పోరు, రక్షణ రంగంలో సహకార బలోపేతంసహా దాదాపు 12 ఒప్పందాలపై ఉభయపక్షాలూ సంతకాలు చేశాయి. దౌత్య, అధికారపరమైన పాస్‌పోర్టు ఉన్నవారికి వీసా మినహాయింపుపై ఒప్పందం కూడా వీటిలో భాగంగా ఉంది. రక్షణ రంగంపై ఒప్పందంలో శిక్షణ, రక్షణరంగ పరిశ్రమలు, ఉగ్రవాద నిరోధం, సైనికాధ్యయనం, సైబర్ భద్రత, సైనిక వైద్యసేవలు, శాంతి పరిరక్షణ తదితరాలు అంతర్భాగంగా ఉన్నాయి. అలాగే వైద్య-ఆరోగ్య రంగాల్లో సహకారం, జోర్డాన్‌లో భవిష్యత్ నైపుణ్య కేంద్రం ఏర్పాటు వంటి అంశాలపైనా ఒప్పందాలు కుదిరాయి. కాగా, రెండు దేశాల మధ్యగల సంప్రదాయక సన్నిహిత, సౌహార్ద సంబంధాలకు జోర్డాన్ రాజు పర్యటన పునరుత్తేజమిచ్చిందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్‌కుమార్ చెప్పారు.

వంటగ్యాస్ రూ.2.50 తగ్గింపు

- ఈ ఏడాదిలో మూడోసారి ధరల సవరణ



న్యూఢిల్లీ, మార్చి 1: వంటగ్యాస్ ధర రూ.2.50 తగ్గింది. ఈ మేరకు 14.2 కిలోల గృహ వినియోగ సిలిండర్ ధరను తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ప్రకటించాయి. ఈ నిర్ణయం గురువారం నుంచే అమలులోకి వచ్చినట్లు పేర్కొన్నాయి. దీంతో ఢిల్లీలో సబ్సిడీ సిలిండర్ ధర రూ.493.09, కోల్‌కతాలో రూ.496.07, ముంబైలో రూ.490.80, చెన్నైలో రూ.481.21గా ఉంటుంది. ఈ ఏడాదిలో ధర తగ్గింపు మూడోసారి కాగా, తాజా సవరణ తర్వాత సబ్సిడీ గ్యాస్ ధర రూ.689గా ఉంటుంది. ఇక నాలుగు మహా నగరాల్లో సబ్సిడీయేతర సిలిండర్ ధర రూ.47, 45.50, 47, 46.50 వంతున తగ్గుతుంది. అయితే, ఈ నగరాల్లో పెట్రోలు, డీజిలు ధర లీటరుకు 6 నుంచి 11 పైసల మధ్య పెరిగింది.



జయేంద్ర సరస్వతికి కన్నీటి వీడ్కోలు

మఠంలో పూర్తయిన మహా సమాధి.. మూడున్నర గంటల కార్యక్రమం

- భక్తులకు కనిపించని సమాధి ప్రక్రియ
- అడ్డుతెరతో గందరగోళం.. తోపులాట
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు




కాంచీపురం, మార్చి 1: కంచి కామకోటి పీఠం 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతికి వైదిక సంస్కారాలతో బృందావన ప్రాంగణంలో అంతిమ సంస్కారాలు జరిగాయి. ఆయనను బృందావన ప్రాంతంలోనే సమాధి చేశారు. కూర్చున్న స్థితిలోనే ఉన్న స్వామి పార్థివదేహాన్ని ఒక పెద్ద వెదురు బుట్టలో పెట్టి 7 అడుగుల పొడవు, అంతే వెడల్పు ఉన్న గోతిలో సమాధి చేశారు. అందులో వాసంబు, ఉప్పు, గంధపు చెక్కల లాంటి సుగంధ ద్రవ్యాలతో పాటు ఇసుక నింపారు. గురువారం ఉదయం 7.45 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం దాదాపు మూడున్నర గంటల పాటు సాగింది. ముందుగా మహా హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు గవర్నర్ భన్వారీలాల్ పురోహిత్ కూడా హాజరయ్యారు. తొలుత ముకుళిత హస్తాలతో కూర్చుని ఉన్న భంగిమలో ఉన్న జయేంద్ర సరస్వతి పార్థివదేహాన్ని ఒక కుర్చీలో ఉంచి.. అభిషేకం నిర్వహించారు. చంద్రశేఖర సరస్వతి స్వామి సమాధి ఉన్న ప్రాంతానికి దగ్గరగానే ఈ కార్యక్రమం అంతా జరిగింది. అంతిమ సంస్కారాలు జరుగుతున్నంత సేపూ కైలయ వాద్యం (సంప్రదాయ వాద్యాలతో కూడిన తమిళ సంగీతం) వినిపిస్తుండగా భక్తులు చెమర్చిన కళ్లతో చూస్తూ ఉండిపోయారు. సాధారణంగా దీన్ని శివాలయంలో పూజ సమయంలోనే వినిపిస్తారు. అంతిమ సంస్కార కార్యక్రమం అంతా విజయేంద్ర సరస్వతి స్వామి సమక్షంలోనే జరిగింది. కేంద్ర మంత్రులు పొన్ రాధాకృష్ణన్, సదానందగౌడ, బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలు తమిళసై సౌందరరాజన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

తొక్కిసలాట.. తోసివేత

జయేంద్ర సరస్వతి స్వామి అంతిమ సంస్కారాల సమయంలో కొద్దిపాటి తోపులాట చోటుచేసుకుంది. భక్తులు ప్రధాన కార్యక్రమాన్ని చూడడానికి వీలులేకుండా ఒక అడ్డుతెర కట్టడంతో ఈ తోపులాట జరిగినట్లు తెలుస్తోంది. జనాన్ని తోసుకుని ముందుకు వద్దామని ప్రయత్నించిన భక్తులను అక్కడున్న వలంటీర్లు అడ్డుకుని పక్కకు తోసేశారు. పార్థివదేహాన్ని బృందావనం వద్దకు తీసుకురాగానే అడ్డుతెర వేయడంతో బయట వేచి ఉన్న భక్తులకు లోపల ఏం జరుగుతోందో అర్థం కాలేదు. అప్పటివరకు ప్రధాన హాల్లో జరిగిన కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టి ప్రత్యక్ష ప్రసారం చేసినా, ఆ తర్వాత సమాధి సమయంలో వాటిని కూడా ఆపేశారు. దాంతో భక్తులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. కార్యక్రమం చివరి దశలో ఉండగా బృందావనం వైపు వెళ్లే మూడు దారులనూ మఠం అధికారులు మూసేశారు.

ఇక ఆస్తుల స్వాధీనమే

- 'ఎఫ్ఈవో' బిల్లుకు కేంద్రం పచ్చజెండా
- ముసాయిదాకు మంత్రిమండలి ఆమోదం
- ఈ బడ్జెట్ భేటీలోనే పార్లమెంట్ ముందుకు
- పరారీ ఆర్థిక నేరగాళ్ల సొత్తులన్నీ ప్రభుత్వానికే
- ఆడిటింగ్‌పై 'ఎన్ఎఫ్ఆర్ఏ' ఏర్పాటుకూ ఓకే
- కేబినెట్ సమావేశం తర్వాత అరుణ్‌జైట్లీ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 1: దేశాన్ని కొల్లగొట్టి విదేశాలకు పారిపోయే ఆర్థిక నేరగాళ్ల మెడకు కేంద్ర ఉచ్చు బిగించనుంది. తదనుగుణంగా లలిత్ మోదీ, విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటి మోసగాళ్ల ఆస్తుల స్వాధీనానికి వీలు కల్పించే చట్టం దిశగా అడుగు వేసింది. ఇది అమలయ్యాక మాత్రమేగాక... రాకముందు పరారైన నేరగాళ్లకూ ఈ నిబంధనలు వర్తించేలా కొత్త చట్టం రూపొందనుంది. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రిమండలి 'పరారీ ఆర్థిక నేరగాళ్ల (ఎఫ్ఈవో) బిల్లు-2018'' ముసాయిదాకు పచ్చజెండా ఊపింది. దీన్ని ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టం చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. మంత్రివర్గ భేటీలో వివిధ అంశాలపై తీసుకున్న నిర్ణయాలను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ విలేకరులకు వెల్లడించారు. తాజా బిల్లు చట్టంగా రూపొందిన తర్వాత రుణ ఎగవేతదారులు, ఆర్థిక నేరగాళ్లు పరారైన పక్షంలో వారి స్వదేశీ, విదేశీ, బినామీ ఆస్తులన్నిటినీ ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. అలాగే సదరు ఆస్తులను అమ్మకానికి పెట్టి బకాయిలకు జమచేసే అధికారం ప్రభుత్వానికి సంక్రమిస్తుందన్నారు. బకాయిల పరిమాణం రూ.100 కోట్లు.. అంతకుమించి ఉన్నపుడు పారిపోయినట్లయితే ఈ చట్టం వర్తిస్తుందని తెలిపారు. ఇలాంటి కేసులలో కోర్టులు అరెస్టు వారంటు జారీచేసినా, పరారీలో ఉన్నట్టు ప్రకటించినా సదరు నేరగాళ్లు దీని పరిధిలోకి వస్తారన్నారు. ప్రస్తుత 'అక్రమ ద్రవ్య చలామణీ నిరోధక చట్టం' (పీఎంఎల్ఏ) కింద కూడా ఆస్తులు స్వాధీనానికి వీలున్నా తాజా చట్టం దీనికి పూర్తిగా భిన్నమైనదని తెలిపారు. పీఎంఎల్ఏ కింద నేరగాళ్లు పొందిన అక్రమ లబ్ధిని మాత్రమే... అదీ కోర్టులు దోషిగా ప్రకటించినప్పుడు స్వాధీనం చేసుకునే వీలుంటుందని వెల్లడించారు. అయితే, ఆర్థిక నేరగాళ్లు పరారైన తక్షణమే కొత్త చట్టం అమలులోకి వస్తుందని వివరించారు. ''పారిపోయిన నేరగాళ్ల విచారణ ఎన్నటికీ పూర్తికాదు. అందుకే ప్రత్యేక కోర్టులో విచారణద్వారా వారి ఆస్తుల స్వాధీనాన్ని కొత్త చట్టం నిర్దేశించనుంది'' అని చెప్పారు. ఈ చట్టాన్ని 2017-18 బడ్జెట్ సమావేశాల్లోనే తేవాల్సి ఉండగా పీఎన్‌బీని రూ.12,700 కోట్లకు ముంచి నీరవ్ మోదీ పరారయ్యాక ఊపిరి పోసుకోనుండటం గమనార్హం. జాతీయ విత్త వ్యవహార నివేదన ప్రాధికార సంస్థ (ఎన్ఎఫ్ఆర్ఏ) ఏర్పాటుకు కూడా మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. చైర్‌పర్సన్, కార్యదర్శి, ముగ్గురు పూర్తికాలపు సభ్యులతో ఈ వ్యవస్థ రూపుదిద్దుకోనుంది. బ్యాంకింగ్ రంగ తనిఖీ వ్యవస్థ (ఆడిటింగ్) లోపాల మయం కావడంసహా పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.12,700 కోట్ల మోసం నేపథ్యంలో కేంద్రం ఎట్టకేలకు ఈ నిర్ణయం తీసుకుంది.

చోక్సీ గ్రూప్‌పై ఈడీ కొరడా

- రూ. 1217 కోట్ల ఆస్తులు అటాచ్
- రంగారెడ్డి జిల్లాలో 170 ఎకరాల పార్క్
- ముంబై, ఇతర ప్రాంతాల్లో కూడా ఆస్తులు
- పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం



న్యూఢిల్లీ, మార్చి 1: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణానికి సంబంధించి గీతాంజలి జెమ్స్, దాని యజమాని మెహుల్ చోక్సీకి సంబంధించిన 1200 కోట్ల విలువైన 41 ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అటాచ్ చేసుకున్నారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ చర్యలు తీసుకున్నారు. గురువారం ఈడీ అధికారులు ఈ వివరాలు వెల్లడించారు. ఈ గ్రూప్‌కు చెందిన రంగారెడ్డి జిల్లాలోని 500 కోట్ల రూపాయాలకు పైగా విలువైన 170 ఎకరాల పార్క్‌ను, ముంబైలోని 15 ఫ్లాట్లను, 17 కార్యాలయాల సముదాయాలను, కోల్‌కతాలోని ఓ మాల్‌ను, అలీబాగ్‌లోని నాలుగు ఎకరాల ఫామ్ హౌస్‌ను, నాసిక్, నాగ్‌పూర్, పాన్‌వెల్, విల్లుపురం (తమిళనాడు)లోని 231 ఎకరాల భూమిని ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ఈ జాబితాలో ముంబైలోని బోరివాలిలో నాలుగు ఫ్లాట్లు, శాంటాక్రుజ్‌లోని ఖేము టవర్స్‌లో తొమ్మిది ఉన్నాయి. చోక్సీ ఆధీనంలోని 1217.2 కోట్ల రూపాయల విలువైన 41 ఆస్తులను సీజ్ చేసినట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. పీఎన్‌బీ నుంచి రుణాలు తీసుకుని 12వేల కోట్ల మేర మోసం చేసిన కేసులో బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు చోక్సీతో పాటు వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఇతరులపై ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఈడీ, సీబీఐ వేర్వేరుగా రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాయి. కాగా కేసు నమోదు చేయక ముందే చోక్సీ, నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. అయితే విచారణకు సహకరించకుండానే, తాము ఎలాంటి మోసాలకు పాల్పడలేదని వారు బుకాయిస్తున్నారు.

పీఎన్‌బీ క్యాషియర్ అనుమానాస్పద మృతి


ఉత్తరప్రదేశ్‌లో లక్నోకు సంబంధించిన పీఎన్‌బీ పెహర్ బ్రాంచ్ హెడ్ క్యాషియర్ రోహిత్ శ్రీవాత్సవ (28) అనుమానాస్పద స్థితిలో మరణించారు. బలరామ్‌పూర్ జిల్లా మంకపూర్ రోడ్డులో ఓ కల్వర్ట్ కింద నీళ్లలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఆయన మృతదేహాన్ని శవపరీక్షలకు పంపి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్టు చెప్పారు.

కార్తీ కస్టడీ కొనసాగింపు



న్యూఢిల్లీ, మార్చి 1: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ కస్టడీని సీబీఐ ప్రత్యేక కోర్టు ఐదు రోజులు పొడిగించింది. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు లబ్ధి చేకూర్చేలా రూ.300 కోట్ల మేర అక్రమ ద్రవ్య చలామణీకి పాల్పడ్డారన్న ఆరోపణపై బుధవారం సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం కోర్టులో హాజరుపరచిన అధికారులు రెండు వారాలపాటు కస్టడీ కోరారు. కానీ, ఒక్కరోజుకు మాత్రమే కోర్టు అనుమతి ఇవ్వగా గురువారం కార్తీని అధికారులు తిరిగి హాజరుపరిచారు. ఆయన విచారణకు సహకరించడం లేదని, రెండు వారాలపాటు కస్టడీకి ఇవ్వాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఆయన నుంచి స్వాధీనం చేసుకున్న పలు పత్రాలను, మూడు సెల్‌ఫోన్లను నిశితంగా పరిశీలించాల్సి ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తెచ్చారు. మరోవైపు సాక్షాత్తూ సీబీఐ అధికారులే సాక్ష్యాలను తారుమారు చేస్తున్నారని, తద్వారా కోర్టును ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నారని కార్తీ తరపు లాయర్ సింఘ్వీ అభ్యంతరం చెప్పారు. ఈ వాదనను తోసిపుచ్చుతూ 6వ తేదీదాకా కస్టడీకి కోర్టు అనుమతించింది.

ఎండలు మండిస్తాయి!



సాధారణం కంటే 1 డిగ్రీ ఎక్కువ


- మార్చి నుంచి మే వరకు ఇంతే
- ఉత్తరాదిలో అధిక ఉష్ణోగ్రతలు
- రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా
- కొన్ని రాష్ట్రాల్లో 1.5 డిగ్రీలు అధికం
- హిమాచల్.. ఉత్తరాఖండ్‌లో మరింత
- సాధారణం కంటే 2.3 డిగ్రీలు ఎక్కువ
- వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రతి సంవత్సరం కంటే ఈసారి ఎండలు మరింత మండిస్తాయి. ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాలపై ఈసారి ఎండ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. అంతేకాదు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి ఉండబోతోంది. మార్చి నుంచి మే నెలాఖరు వరకు సాధారణ ఉష్ణోగ్రతల కంటే 1 నుంచి 1.5 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడం ఖాయమని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ఢిల్లీ, హరియాణా, పంజాబ్ రాజస్థాన్ లాంటి రాష్ట్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. అంతేకాదు.. సాధారణంగా వేసవి విడిది అని చెప్పుకొనే హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాల్లో అంతకంటే ఎక్కువగా ఏకంగా.. సాధారణం కంటే 2.3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు ఈసారి నమోదవుతాయట! ప్రతి ఏటా సీజన్ల వారీగా విడుదల చేసే నివేదికలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ వివరాలు తెలిపింది. మార్చి నుంచి మే నెలాఖరు వరకు వేడి గాలులు చాలా ఎక్కువగా వీస్తాయని, ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువగానే ఉంటాయని ఐఎండీ చెప్పింది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు.. ఢిల్లీ, పంజాబ్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిషా, మరాఠ్వాడా, విదర్భ, మధ్య మహారాష్ట్ర ఉండనున్నాయి. ఈ ప్రాంతాలన్నింటిలో ఈసీజన్‌లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 డిగ్రీ ఎక్కువగా ఉండనున్నాయి. దక్షిణ భారతంతో పాటు నాలుగు ఈశాన్య రాష్ట్రాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల ఓ మాదిరిగా ఉంటుందని ఐఎండీ చెబుతోంది. తమిళనాడు, దక్షిణ కర్ణాటక, రాయలసీమ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలలో సాధారణం కంటే 0.5 డిగ్రీలు మాత్రమే అధికంగా ఉష్ణోగ్రతలు ఉంటాయంటోంది. ఫిబ్రవరిలో ఉన్న వాతావరణ పరిస్థితులను ఆధారంగా చేసుకుని వాటికి అనుగుణంగా ఈ అంచనాలను సిద్ధం చేసినట్లు ఐఎండీ దీర్ఘకాల వాతావరణ అంచనాల విభాగం అధిపతి డి. శివానంద పాయ్ తెలిపారు. ప్రధానంగా గ్లోబల్ వార్మింగ్ వల్లే ఈ ఉష్ణోగ్రతలు పెరుగుతాయని ఆయన చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా కూడా దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఇటీవలి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఇది గ్లోబల్ వార్మింగ్ ప్రభావమేనని తెలిపారు.



సెలవుతో సౌఖ్యమేదీ!

భారత ఉద్యోగుల విముఖత



- ఎక్కడున్నా ఆఫీసు భయమే
- పనిభారంపైనే 42% ఉద్యోగుల మనసు
- విధులను వదిలించుకోలేని వారు 26 %
- అడిగే ధైర్యమే చేయలేక మరో 30 శాతం
- బ్రిటిష్ ఎయిర్‌వేస్ అధ్యయనం వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 1: సెలవు అనే మాట వినిపించగానే ఎప్పుడెప్పుడా అని ఉవ్విళ్లూరుతుంటారు! ఈ తరహా ఆలోచన స్కూలు పిల్లల దగ్గర నుంచి ఎంత పెద్ద స్థాయికి ఎదిగిన వారిలోనైనా సహజం!! కానీ మన దేశంలో ఉద్యోగులు మాత్రం సెలవు అంటే భయపడుతున్నారట. సెలవు తీసుకునేందుకే విముఖత వ్యక్తం చేస్తున్నారట. కొంచెం ఆశ్చర్యంగా ఉన్నా ఇదే నిజమని సర్వే చేసి మరీ చెబుతోంది బ్రిటిష్ ఎయిర్‌వేస్! గత ఏడాది డిసెంబరు 20 నుంచి 2018 జనవరి 4 మధ్య భారత్‌లో 2 వేల మంది ఉద్యోగులపై అధ్యయనం చేసి ఆసక్తికర విశేషాలు వెల్లడించింది. దేశంలో అన్ని రకాల ఉద్యోగులకు సగటున ఏడాదిలో 17 రోజుల సాధారణ సెలవులు ఉంటాయి. అయితే వీటిని వాడుకునేందుకు కూడా చాలా మంది ఉద్యోగులు సిద్ధంగా లేరంటోంది బ్రిటిష్ ఎయిర్‌వేస్. పనిభారంతో సెలవు తీసుకున్నా సుఖం లేదని అలా నైరాశ్యంలో ఉండిపోతున్నారట. సెలవు తీసుకున్నా ఆఫీసులో పని భారం గురించి ఆలోచించే వారు 42 శాతం ఉద్యోగులు ఉన్నారట. ఇక అసలు ఆఫీసు విధుల నుంచి తప్పించుకుని బయటపడలేక సెలవుల మాట మరచిపోయేవారి 26 శాతం వరకు ఉన్నారు. మూడో కేటగిరీ అసలు తమ బాస్ దగ్గరకు వెళ్లి సెలవు అడగడానికే భయపడేవాళ్లు. వీరు సుమారు 30 శాతం వరకు ఉన్నారని అధ్యయనం వెల్లడించింది. పై అధికారి ఇవ్వను అని నొప్పిస్తాడనే భావన వీరిలో ఎక్కువగా ఉంటోంది. సెలవులు వాడుకోకపోగా.. వారికి వచ్చే హాలిడే అలవెన్స్‌ను కూడా దాదాపు 65 శాతం ఉద్యోగులు వదులుకుంటున్నారు. ఒక వేళ సెలవుపై ఎక్కడికైనా వెళ్లినా పూర్తిగా హాలిడే మూడ్‌లోకి రావడానికి 60 శాతం వరకు ఉద్యోగులు సతమతమవుతున్నారు. వీరిలో కొంత మంది తిరిగి ఆఫీసుకు వెళ్లాలనే ఆలోచనలోనే ఉండిపోతే.. మరికొంత మంది కొద్ది సమయంలో ఏం ఎంజాయ్ చేస్తాంలే అనే భావనలో గడిపేస్తున్నారని సర్వే పేర్కొంది. కాగా, 59 శాతం ఉద్యోగులు దీర్ఘ కాల సెలవుపై ఎక్కడికైనా వెళ్లి గడిపి రావాలనే కోరికతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇక మొత్తంగా చూస్తే 97 శాతం మంది విహార యాత్రలకు (హాలిడే ట్రిప్) వెళ్లాలని ప్రణాళికలకు వేసుకుంటున్నారట. కానీ వారిలో 49 శాతం ఉద్యోగులు ఎక్కువ రోజులు సెలవకు దొరక్క ఇంట్లోనే గడిపేస్తున్నారు. 34 శాతం ఉద్యోగులు సెలవు తీసుకున్నా పనిలోనే ఉండిపోతున్నారు. ఇక మరో 27 శాతం తమ పరిపాలన బాధ్యతలను అసలు వదిలించుకోలేకపోతున్నారని సర్వే నివేదిక వెల్లడించింది.


రజనీకాంత్ చిత్రానికి...





రజనీకాంత్ చిత్రానికి పనిచేసే అవకాశం రావడం అంటే.. అది అదృష్టానికి మించిన విషయం కిందే లెక్క. ఇప్పుడు ఆ అదృష్టం ఓ క్రేజీ మ్యూజిక్ డైరెక్టర్‌కు దక్కింది. అతను మరెవరో కాదు.. అనిరుధ్. తమిళంలో విజయ్, అజిత్, సూర్య వంటి అగ్ర హీరోల చిత్రాలకు సంగీతమందించిన ఈ యువ స్వరకర్త.. తొలిసారిగా రజనీకాంత్ సినిమాకు పనిచేయబోతున్నారు. 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. త్వరలోనే ఈ సినిమా పట్టాలెక్కనుంది. రోబో తరువాత రజనీకాంత్, సన్‌పిక్చర్స్ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ ఇది.

వై.ఎస్.ఆర్‌గా మమ్ముట్టి





ఇండియన్ స్క్రీన్‌పై బయోపిక్‌ల హవా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జీవితకథను సినిమా రూపంలో తెరకెక్కించబోతున్న సంగతి తెలిసిందే. 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి.వి.రాఘవ్ దర్శకత్వంలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వై.ఎస్.ఆర్ పాత్రలో టాలీవుడ్ స్టార్ హీరో నాగార్జున నటిసారని కూడా వార్తలు వినిపించాయి. అయితే విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మలయాళ స్టార్ హీరో మమ్ముట్టి ఈ సినిమాలో రాజశేఖర్ రెడ్డి పాత్రలో నటిస్తారట. యూనిట్ కూడా మమ్ముట్టిని సంప్రదించారు. అలాగే వై.ఎస్.ఆర్ సతీమణి విజయమ్మ పాత్రలో నయనతారను నటింప చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక సమాచారం వెలువడనుంది.



'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' పోస్టర్ ఇంపాక్ట్

వరుసగా కొత్త దర్శకులతోనే...




కాజల్ అగర్వాల్

పదకొండేళ్ళుగా కథానాయికగా రాణిస్తోంది పంజాబి జాబిలి కాజల్ అగర్వాల్. తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో కలుపుకుని 50కి పైగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ.. కొత్త దర్శకులతో సినిమాలు చేసిన సందర్భాలు తక్కువనే చెప్పాలి. అలాగే ఆ సినిమాలు సక్సెస్ అయిన సందర్భాలు కూడా తక్కువే. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం కాజల్ తెలుగులో వరుసగా కొత్త దర్శకుల సినిమాలనే ఎంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది. ఇటీవల విడుదలైన 'అ!' చిత్రాన్ని నూతన దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తే.. విడుదలకి సిద్ధమైన 'ఎం.ఎల్.ఎ' సినిమా ద్వారా ఉపేంద్ర మాధవ్ దర్శకుడిగా పరిచయం కానున్నాడు. అంతేగాకుండా, బెల్లంకొండ శ్రీనివాస్‌కు జోడీగా కాజల్ నటించనున్న కొత్త చిత్రానికి కూడా శ్రీనివాస్ రెడ్డి అనే నూతన దర్శకుడు మెగాఫోన్ పట్టడం గమనార్హం. మొత్తమ్మీద.. కాజల్ కొత్త దర్శకులతో వరుసగా సినిమాలు చేస్తూ వార్తల్లో నిలుస్తోంది. నూతన దర్శకుడు ప్రశాంత్ వర్మ రూపొందించిన 'అ!' చిత్రం నటిగా కాజల్‌కు మంచి పేరు తీసుకువచ్చినట్టే.. ఈ రెండు తాజా చిత్రాలు కూడా ఆమెకి గుర్తింపు తీసుకువస్తాయేమో చూడాలి మరి.

ఘట్టమనేని వారసుడి సినీ ఎంట్రీ



రమేష్‌బాబు



జయకృష్ణ

తెలుగు చిత్రసీమలో సినీ వారసుల తాకిడి ఎక్కువైంది. మెగా.. నందమూరి.. ఘట్టమనేని.. మంచు.. కుటుంబాల నుండి పలువురు హీరోలుగా పరిచయమై యారు... అవుతున్నారు కూడా. త్వరలోనే తెలుగు సినిమా రంగంలో ఘట్టమనేని మూడో తరం వారసుడు సినీ రంగ ప్రవేశం చేయనున్నాడు. వివరాల్లోకెళ్తే... సీనియర్ హీరో కృష్ణ మనవడు... మహేశ్ సోదరుడు రమేశ్ బాబు కొడుకు జయకృష్ణ సినీ రంగ ప్రవేశం కోసం సిద్ధమవుతున్నాడు. అందుకోసమని వైజాగ్ సత్యానంద్ వద్ద జయకృష్ణ శిక్షణ పొందుతున్నాడట. ఫైట్స్, డాన్సులు, డైలాగ్ డెలివరీ ఇలా పలు అంశాల్లో శిక్షణ అనంతరం జయకృష్ణ సినీ రంగ ప్రవేశం జరుగనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం.

అభిమానులకు నిరాశే!



చిరంజీవి



ప్రభాస్



ఎన్టీఆర్

గతేడాది.. టాలీవుడ్‌కు మంచి విజయాలను అందించిన కథానాయకులలో చిరంజీవి, ప్రభాస్, ఎన్టీఆర్‌లను ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పదేళ్ళ తరువాత కథానాయకుడిగా రీ ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. 'ఖైదీ నెం 150'తో సంచలన విజయాన్ని నమోదు చేశారు. ఆయన నటన, నర్తనలో గ్రేస్ కొంచెం కూడా తగ్గలేదని ఈ సినిమా నిరూపించింది. ఇక ప్రభాస్ విషయానికొస్తే.. భారతీయ సినిమా చరిత్రలోనే బిగ్గెస్ట్ హిట్ చిత్రగా నిలిచిన 'బాహుబలి ది కంక్లూజన్' సినిమాలో కథానాయకుడిగా నటించి ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. అలాగే జై లవకుశ చిత్రంలో మూడు విభిన్న పాత్రల్లో కనిపించి ఎన్టీఆర్ మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. అలాంటి ఈ ముగ్గురు అగ్ర కథానాయకుల నుంచి ఈ ఏడాది సినిమా వచ్చే అవకాశం కనిపించడంలేదనే చెప్పాలి. చిరు నటిస్తున్న 'సైరా నరసింహా రెడ్డి', ప్రభాస్ 'సాహో', ఎన్టీఆర్ 28వ చిత్రం (త్రివిక్రమ్ దర్శకుడు).. ఈ సంవత్సరం విడుదలయ్యే అవకాశం లేదని, 2019లోనే ఈ సినిమాలు వస్తాయని వార్తలు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఈ ఏడాది ఓ ముగ్గురు స్టార్ హీరోల సినిమాలు రాకుండానే.. గడిచిపోనుందన్నమాట.



నేటి నుండి థియేటర్స్ బంద్

మార్చి 2 నుంచి సౌతిండియాలో దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ థియేటర్లలలో సినిమాలు నిలిపి వేతకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (డిఎస్‌పి) అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తుండటం ఈ బంద్‌కు కారణమైంది. ఇప్పటికే పలుమార్లు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల యాజమాన్యాలతో దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమ జాయింట్ యాక్షన్ కమిటీ చర్చలు జరిపినా విఫలమయ్యాయి. ఈ సందర్భంగా గురవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో... తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డి.సురేశ్ బాబు మాట్లాడుతూ ''డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ అయిన క్యూబ్, యు.ఎ ఫ్.ఒలతో చర్చలు సఫలం కాలేదు. దీంతో దక్షిణాదిన మార్చి 2 నుండి థియేటర్స్ బంద్ చేస్తున్నాం. వి.పి.ఎఫ్ ఛార్జీలు కట్టేది లేదని,మూడు సినిమా ట్రైలర్స్ ఫ్రీగా ఇవ్వాలని, కమర్షియల్ యాడ్స్ నిడివి 8 నిమిషాల కంటే ఎక్కువ ఉండ కూడదని నిబంధనలు వాళ్ల ముందు ఉంచాం. 25 శాతం రాయితీ అడిగాం. వారు 15 శాతం రాయితీ ఇస్తామని అంటున్నారు'' అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సురేశ్‌బాబు, సి.కల్యాణ్, కె.మురళీమోహన్, జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్, ఏషియన్ ఫిలింస్ సునీల్ నారంగ్, ముత్యాల రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

2000 జూనియర్ ఆర్టిస్టులతో...



వివేక్ ఒబెరాయ్

రామ్‌చరణ్, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. డి.వి.వి.దానయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తుంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రంలో ప్రశాంత్, ఆర్యన్ రాజేష్‌లు చరణ్ అన్నయ్యలుగా స్నేహ, అనన్యలు వదినలుగా కనిపించబోతున్నారు. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాలో వివేక్ పూర్తి స్థాయి విలన్‌గా నటిస్తున్నారు. బోయపాటి తన గత చిత్రాల్లాగానే.. ఈ సినిమాలో కూడా వివేక్ ఒబెరాయ్ క్యారెక్టర్‌ను పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారు. 2000 మంది జూనియర్ ఆర్టిస్టులతో విలన్ ఇంట్రడక్షన్ సీన్‌ను దర్శకుడు చిత్రీకరించారట. ఈ సీన్ వన్ ఆఫ్ ది బెస్ట్ సీన్‌గా నిలుస్తుందని చిత్ర యూనిట్ భావిస్తుంది.


తేజ దర్శకత్వంలో...!



ఈషా రెబ్బా

అచ్చ తెలుగు టైటిల్స్‌తో సినిమాలు చేసే సంచలన దర్శకుడు తేజ.. తన సినిమాల్లో అచ్చ తెలుగు అమ్మాయిలని కథానాయికలుగా ఎంచుకున్న సందర్భాలు తక్కువనే చెప్పాలి. రోజా, మధు శాలిని, నందిత వంటి అతి తక్కువ తెలుగు వారు మాత్రమే ఆయన సినిమాల్లో కథానాయికలుగా కనిపించారు. ఇదిలా ఉంటే.. మరో తెలుగమ్మాయికి తేజ తన చిత్రంలో అవకాశ మిచ్చారని కథనాలు వినిపిస్తున్నాయి. 'అంతకు ముందు ఆ తరువాత'తో కథానాయికగా పరిచయమై 'అమీ తుమీ', 'అ!' తదితర చిత్రాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఈషా రెబ్బాకి.. తేజ తన సినిమాలో చాన్స్ ఇచ్చారని తెలుస్తోంది. వెంకటేష్ కథానాయకుడిగా తేజ దర్శకత్వంలో 'ఆటా నాదే వేటా నాదే' (ప్రచారంలో ఉన్న పేరు) తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇందులో వెంకీకి జోడీగా శ్రియ నటిస్తుండగా.. మరో కీలక పాత్రలో నటిస్తున్న నారా రోహిత్‌కు జంటగా ఈషా రెబ్బా పేరుని పరిశీలిస్తున్నారని సమాచారం. త్వరలోనే ఈషా ఎంపికపై క్లారిటీ వస్తుంది.

అగ్రిగోల్డ్ బాధితులకు 5 కోట్లు



బాధితులకు చెక్ అందజేస్తున్న చంద్రబాబు

- 100 మందికి 5 లక్షల చొప్పన చెక్‌లు
- పంపిణీ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుంటాం: సీఎం

అమరావతి, మార్చి 1(మనం ప్రతినిధి): అగ్రిగోల్డ్ బాధితులకు సీఎం చంద్రబాబు నాయుడు 5 కోట్ల రూపాయల చెక్‌లను పంపిణీ చేశారు. 100 మందికి ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. గురువారం అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో చంద్రబాబు బాధితులకు చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఎటువంటి నిబంధనలు ఉన్నా లెక్క చేయనని, బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలన్నింటినీ ఆదుకుంటామని తెలిపారు. ప్రైవేటు పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, ఎక్కువ వడ్డీలిస్తామని, రెండేళ్లలో రెటింపు చేస్తామనే ప్రచారాలకు మోసపోవద్దని సూచించారు. నగదును ప్రభుత్వ బ్యాంకులలో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. ఇలాంటి సంస్థల కార్యకలాపాలపై నిఘా ఉంచామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆస్తులు జప్తు చేసి బాధితులకు చెల్లిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. తప్పుడు పనులు చేసేవారిని ఉపేక్షించబోనని హెచ్చరించారు. పేదలు కోర్టుకు వెళ్లి వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారని, అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని, వారికి చెల్లింపుల బాధ్యతను తీసుకుంటామని హామీ ఇచ్చారు.

చంద్రబాబు వసంతోత్సవ శుభాకాంక్షలు

దుష్టశక్తులకు ఓటమి తప్పదని, చెడుపై అంతిమంగా మంచి గెలుస్తుందన్న సందేశాన్నిచ్చే పండుగల్లో హోలీ ప్రధానమైనదని చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లోని తెలుగు వారికి ఆయన హోలీ, వసంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బరాయుడిని పరామర్శిస్తున్న చంద్రబాబు

హోదా ఆంధ్రుల హక్కు

- నినదించిన వైసీపీ శ్రేణులు
- 13 జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా
- గళమెత్తిన ఎంపీలు, ఎమ్మెల్యేలు
- కదంతొక్కిన నాయకులు, కార్యకర్తలు
- పార్లమెంట్‌లో స్పష్టమైన హామీ ఇవ్వాలి
- లేకుంటే అవిశ్వాసం: విజయసాయిరెడ్డి
- ఏప్రిల్ 6న ఎంపీల రాజీనామా: సుబ్బారెడ్డి



విశాఖలో ధర్నాలో పాల్గొన్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, నేతలు

(మనం న్యూస్ నెట్‌వర్క్, మార్చి 1): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్రంలోని 13 జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు ప్రతిపక్ష వైసీపీ ధర్నా చేపట్టింది. ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు' అంటూ నినాదాలు చేశారు. ఆయా జిల్లాల్లో పార్టీ అధ్యక్షులు, సమన్వయ కర్తలు కార్యక్రమాన్ని సమీక్షించారు. ప్రత్యేక హోదా సాధనకు దశల వారీగా అందోళనను ఉధృతం చేయాలని వైసీపీ నిర్ణయించింది.

కేంద్రానికి చంద్రబాబు తాకట్టు: ఉమ్మారెడ్డి

కేంద్రం ఎలా ఆడిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలా ఆడుతున్నారని వైసీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విమర్శించారు.

21న కేంద్రంపై అవిశ్వాసం: సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పార్టీ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పలేదని సుబ్బారెడ్డి అన్నారు. కేసుల భయంతోనే చంద్రబాబు హోదాపై ముఖం చాటేశారని విమర్శించారు. హోదాతో పాటు విభజన హామీల అమలుకు వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వేదికగా ఆందోళన చేస్తామని, 21న కేంద్రంపై అవిశ్వాసం పెడతామని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. అప్పటికీ దిగిరాకుంటే ఏప్రిల్ 6న ఎంపీలందరం రాజీనామా చేస్తామని చెప్పారు.

ఓటుకు నోటు కేసుకు భయపడి చంద్రబాబు ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టారని, రోజుకో రకంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంలో ఉమ్మారెడ్డితో పాటు ఎమ్మెల్యేలు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ముస్తఫా, కోన రఘుపతి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జంగా కృష్ణమూర్తి, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబుది రెండు నాల్కల ధోరణి: విష్ణు

ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు నాయుడు రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ వైసీపీ నేతలు పార్థసారధి, మల్లాది విష్ణు విమర్శించారు. ప్రత్యేక హోదా అంశాన్ని చంద్రబాబు నీరుగార్చారని, సంజీవని కాదంటూ సదస్సులు నిర్వహించి అక్కర్లేదనే విషయాన్ని పరోక్షంగా చెప్పడానికి విఫలయత్నాలు చేశారని ఆరోపించారు. హోదా కోసం చివరివరకూ పోరాడుతామని స్పష్టం చేశారు.

మాకు అలాంటి భయాల్లేవు: పెద్దిరెడ్డి

విభజన సమయంలో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన చంద్రబాబు నాయుడు, కిరణ్ కుమార్ రెడ్డి ఇద్దరూ చిత్తూరు జిల్లా వాసులేనని వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడితే కేసులు పెడతారేమో అని చంద్రబాబు భయపడుతున్నారని, తమకు అలాంటి భయాలు లేవని, జగన్ నేతృత్వంలో పోరాటం సాగిస్తామని పెద్దిరెడ్డి తెలిపారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరులో మేకపాటి ధర్నా

నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సంజీవయ్య, రాంరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, పార్టీ నేతలు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, వంటేరు వేణుగోపాల్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అసమర్థత వల్లే

చంద్రబాబు అసమర్థత వల్లే ప్రత్యేక హోదా రాలేదని అనంత వెంకట్రామిరెడ్డి, శంకర్ నారాయణ మండిపడ్డారు. అనంతపురంలో చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ.. హోదా, విభజన హామీలు అమలు కాకపోవటానికి చంద్రబాబే కారణమని, ఆయనకు చిత్తశుద్ధి ఉంటే ఎన్డీయే నుంచి బయటకు రావాలని డిమాండ్ చేశారు. బీజేపీపై నెపం నెట్టి తప్పించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శించారు.

హోదాపై వెనక్కి తగ్గేది లేదు: విజయసాయి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేవరకూ పోరాటాన్ని ఆపేది లేదని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలుపై విశాఖలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్టీ నగర శాఖ నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విభజన సమయంలో ప్రధాని హోదాలో మన్మోహన్ సింగ్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని, ఆ బాధ్యత ఇప్పటి బీజేపీ ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు.ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశాలపై వచ్చే పార్లమెంటు సమావేశాల్లో స్పష్టమైన హామీ ఇవ్వకుంటే అవిశ్వాస తీర్మానం పెడతామని, అనంతరం తమ పార్టీ ఎంపీలు రాజీనామా చేస్తారని చెప్పారు. ధర్నాలో వైసీపీ నేతలు మళ్ల విజయప్రసాద్, ధర్మాన ప్రసాదరావు, గొల్ల బాబూరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, తైనాల విజయకుమార్, కరణం ధర్మశ్రీ, కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

హోదా వచ్చే వరకూ పోరాటం

హోదా విషయంలో చంద్రబాబు రాజీపడ్డారని, ఆ అధికారం ఆయనకు ఎవరిచ్చారని, సాధించేవరకూ వైసీపీ పోరాడుతుందని శ్రీకాంత్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. కడపలో వైసీపీ చేపట్టిన ధర్నాలో వారితో పాటు ఎంపీ అవినాష్ రెడ్డి, సురేష్ బాబు, ఎమ్మెల్యేలు అంజాద్ బాషా, రాచమల్లు ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో నిరసన హోరు

శ్రీకాకుళంలో వైసీపీ నేతలు ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, రెడ్డి శాంతి, ఎమ్మెల్యే కంబాల జోగులు, గొర్లె కిరణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద పార్టీ నేతలు బొత్స సత్యనారాయణ, పెన్మత్స సాంబశివరాజు, మద్ది శ్రీనివాసరావు, శత్రుచర్ల పరీక్షిత్ రాజు, బొత్స అప్పలనర్సయ్య, అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు రాజన్నదొర, పుష్పవాణి నిరసన చేపట్టారు.

గోదావరి జిల్లాల్లో ధర్నా

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాలో ఎమ్మెల్సీ ఆళ్ల నాని, పార్టీ నేతలు ప్రసాదరాజు, కొట్టు సత్యనారాయణ, మేకా శేషుబాబు, కొటారు రామచంద్రరావు, మద్యాహ్నపు ఈశ్వరి, గంటా మురళి, పార్టీ కార్యకర్తలు పాల్గొని నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో వైసీపీ కో-ఆర్డినేటర్ తోట సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

బాల సాహితీ 'మూర్తి' కన్నుమూత

- అనారోగ్యంతో నాయని కృష్ణమూర్తి మృతి
- బెంగళూరులో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- నేడు స్వగ్రామంలో అంత్యక్రియలు.. సీఎం సంతాపం




బెంగళూరు, మార్చి 1: 'బాల సాహితీ' కెరటం నేలకొరిగింది. పిల్లల సాహిత్యానికి తనదైన పంథాల్లో బాటలు వేసిన ప్రముఖ రచయిత నాయని కృష్ణమూర్తి కన్నుమూశారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. స్వగ్రామమైన చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. చిత్తూరు జిల్లా నడిమిచెర్లలో 1951లో జన్మించిన నాయని హైస్కూలు చదువు స్థాయి నుంచే సాహిత్యం, రచనల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. మొదటి నవల 'యామినీకుంతలాలు' తన 23 ఏటనే రాశారు. దీనికి 1974లో ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక నిర్వహించిన ఆనంద ఉగాది నవలల పోటీ'లో మూడో బహుమతి లభించింది. మొదటి నవలకే బహుమతి రావడం ఆయనలో ఆత్మవిశ్వాసం పెంచింది. రచనా పాటవాన్ని పెంచుకుంటూ.. నలుగురికీ పంచేందుకు పత్రికా రంగంలోకి అడుగు పెట్టారు. కొంత కాలం బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా పనిచేశారు. మిత్రుడుతో కలిసి స్నేహ బాల అనే పిల్లల పత్రికను కొంతకాలం నడిపారు. 1977లో మాబడి, 1978లో పాఠశాల పత్రికలను విద్యార్థుల కోసం విజయవాణి సంస్థ ద్వారా ప్రచురించారు. నాయని కృష్ణమూర్తి వెలువరించిన విద్యా సంబంధ మ్యాగజైన్లకు అనూహ్య ఆదరణ లభించింది. పలు తెలుగు చిత్రాలకు నేపథ్య గీతాలను కూడా ఆయన రచించారు. ప్రముఖ దర్శకుడు వంశీ రూపొందించిన మహర్షి చిత్రంలో ప్రత్యేక ఆదరణ పొందిన 'సుమం ప్రతి సుమం సుమం' పాట కృష్ణమూర్తి రాసిందే. తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

నాయని మృతి పట్ల సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కృష్ణమూర్తి బాల సాహిత్య అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

సహజశైలిలో హోలీ పాటలు

- సీడీ ఆవిష్కరణలో ఎంపీ కవిత



హైదరాబాద్, మార్చి 1(మనం ప్రతినిధి): హోలీ పండుగను పురస్కరించుకుని తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం రూపొందించిన పాటల సిడీని జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత గురువారంఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్యాన్ని, వాంగ్మయాన్ని సహజ శైలిలో సమాజానికి అందించడంలో జాగృతి నిరంతరం పాటుపడుతుందని ఆమె వివరించారు. జనం నోళ్లలో నానుతున్న హోలీ పాటలను సహజ శైలిలో రికార్డు చేయించిన కోదారి శ్రీనును ఈ సందర్భంగా ఎంపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్యురియాసిటీ రోవర్‌లో లోపం

- నమూనా సేకరణకు కొత్త పద్ధతి



వాషింగ్టన్, మార్చి 1: అంగారకుడిపై పరిశోధనల కోసం పంపిన క్యురియాసిటీ రోవర్‌లో తలెత్తిన లోపాన్ని విజయవంతంగా అధిగమించినట్లు నాసా ప్రకటించింది. అరుణ గ్రహంపై నమూనాలు సేకరించే పనిలో రోవర్ కొంతకాలంగా తడబడుతోంది. నిర్ణీత ప్రాంతంలో నమూనాలు సేకరించడంలో కచ్చితత్వం లేకుండా పోతోంది. రోవర్‌లోని ఓ మోటర్ పనితీరులో లోపం కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీంతో నమూనా సేకరణ సందిగ్ధంలో పడింది. ఈ నేపథ్యంలో తాము ప్రత్యామ్నాయ విధానాన్ని అభివృద్ధి చేసినట్లు నాసా పరిశోధకులు తెలిపారు. దీని సాయంతో తొలి నమూనాను నిర్ణయించిన ప్రాంతంలో కచ్చితమైన ప్రమాణాలతో సేకరించినట్లు వివరించారు. ఇందుకోసం రోవర్‌ను మెకానకల్‌గా కదిలిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా అంగారకుడిపైన లేక్ ఆర్కాడై అనే ప్రాంతంలో విజయవంతంగా నమూనాలను సేకరించామన్నారు. ఈ విధానం సాయంతో ఇంట్లోని గోడలకు మేకులు దింపినంత సులువుగా అంగారకుడిపై కావాల్సిన చోట తవ్వకాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, 2012లో అంగారకుడిపై ల్యాండ్ అయిన రోవర్ ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో దాదాపు 15 పర్యాయాలు తవ్వకాలు జరిపి నమూనాలను సేకరించిందని నాసా తెలిపింది.

జమ్ము కశ్మీర్‌లో హిమపాతం

- యువకుడి మృతి


శ్రీనగర్, మార్చి 1: జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని బండిపూరా జిల్లాలో సంభవించిన హిమపాతం వల్ల ఓ 25 ఏళ్ల యువకుడు మరణించగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. బండిపూరా జిల్లాలోని తులాలీలో హస్‌సంగం-మాలాంగం ప్రాంతంలో బుధవారం హిమపాతం సంభవించి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో గాయపడిన అబ్దుల్ అజీజ్ బేగ్(25), హలీమ్ బేగ్(23)ను తులాలీలోని ఆస్పత్రికి తరలించగా అబ్దుల్ అజీజ్ బేగ్ చికిత్స పొందుతూ మరణించాడు. కాగా ఫిబ్రవరి 24న కుపావారా జిల్లాలో హిమపాతం సంభవించగా ముగ్గురు వ్యక్తులు ఆచూకీ లేకుండా పోయారు. మంచులో కురుకుపోయిన ఆ ముగ్గురి మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బండిపూరాలో ఎన్‌కౌంటర్.. ఉగ్రవాది హతం

జమ్ము-కశ్మీర్‌లోని బండిపూరా జిల్లాలో హాజిన్ ప్రాంతంలో భారత భద్రతా దళాలు చేసిన ఎన్‌కౌంటర్‌లో ఓ ఉగ్రవాది మరణించాడు. ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు గురువారం ఉదయం షాకురిద్దిన్ గ్రామాన్ని చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. అయితే ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు ప్రారంభించగా భద్రతా బలగాలు ఎదురుదాడికి దిగాయి. ఈ ఘటనలో ఓ ఉగ్రవాది మరణించాడు.

తెరవెనుక ఎవరు?

- ఏపీ మంత్రి మాణిక్యాలరావు హల్‌చల్
- ఢిల్లీ పర్యటనలు.. మంత్రులతో భేటీ
- ఇన్నాళ్లూ మౌనం.. మారిన వ్యూహం
- ఏపీలో నగదు కొరతపై జైట్లీకి ఫిర్యాదు
- ఏం జరుగుతోందో చూడాలని వినతి
- టీడీపీ నేతలే టార్గెట్ అని ప్రచారం
- మాణిక్యాలరావు వెనుక రాంమాధవ్?
- టీడీపీలో అనుమానాలు.. అలజడి



విశాఖపట్నం, మార్చి 1 (మనం న్యూస్‌బ్యూరో): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు ఒక్కసారిగా వార్తల్లో వ్యక్తి అయిపోయారు. నాలుగేళ్లుగా పెద్దగా హడావుడి లేకుండా, అవమానాలను సహిస్తూ మౌనంగా తన పని తాను చేసుకుపోయిన మాణిక్యాలరావు ఇప్పుడు ఉన్నట్టుండి హడావుడి చేస్తున్నారు. ఈ వారం ప్రారంభంలో దేశ రాజధానికి వెళ్లి పలువురు కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసి, తెలుగుదేశం నేతల్లో అలజడిని పెంచారు. ఇంతకాలం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న దేవాదాయశాఖలో కూడా తన మాట నెగ్గనీయకుండా, తనకు ఏమాత్రం విలువ ఇవ్వకుండా నిర్ణయాలు జరిగినా మౌనంగా ఊరుకున్న ఆయన ఇప్పుడు ఒక్కసారిగా వ్యూహం మార్చి ఢిల్లీలో హల్‌చల్ చేయడం చర్చనీయాంశమైంది. కేంద్రమంత్రులను ఆయన కలవడం, వాళ్లతో చర్చలు జరపడం ద్వారా తెలుగుదేశం నేతల్లో అనుమానాలను రాజేశారు. ఇంతకాలం బీజేపీకే చెందిన మరో మంత్రి కామినేని శ్రీనివాస్ మాత్రమే నెలకోసారి ఏదో వంకన ఢిల్లీ వెళ్లి ఇలాంటి హడావుడి చేసేవారు. ఆయన బీజేపీకి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ తెలుగుదేశం సొంత మనిషిగానే ముద్ర పడ్డారు.

గతంలో ఎన్నడూలేని విధంగా మాణిక్యాలరావు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని కలిసి దేశంలో ఎక్కడాలేని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంక్‌లలోనే నగదు కొరత ఎందుకు వచ్చిందో విచారణ జరపాల్సిందిగా కోరడం ఇప్పుడు పలు అనుమానాలను రెకెత్తిస్తోంది. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార పార్టీ నేతలు పెద్ద ఎత్తున నగదును డ్రాచేసి దాచేయడం వల్లే ఇలా ఆంధ్రాలో నగదు కొరత వచ్చిందనే ప్రచారం ఇప్పటికే సోషల్ మీడియాలో జోరందుకొంది. అందులో భాగంగానే రాష్ట్రంలో పెద్దగా రెండు వేల రూపాయల నోట్లు కనిపించడం లేదని కూడా అంటున్నారు. ఆ అనుమానాలను బలపరుస్తూ మంత్రి మాణిక్యాల రావు కేంద్రానికి ఫిర్యాదు చేయడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ రాజకీయ వర్గాల్లో ప్రారంభమైంది. అరుణ్ జైట్లీతో పాటు మరికొందరు మంత్రులనూ ఆయన కలిశారు.

తెరవెనుక రాంమాధవ్?

తన హస్తిన పర్యటనలలో భాగంగా ఆంధ్రాకే చెందిన బీజేపీ వ్యూహకర్త, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వారణాశి రాం మాధవ్‌ను కూడా మాణిక్యాలరావు కలిశారు. రాష్ట్ర పార్టీ పరిస్థితులను, విభజన హక్కుల విషయంలో బీజేపీపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన వివరించారు. మాణిక్యాలరావు ఢిల్లీ పర్యటన వెనుక, కేంద్ర మంత్రులను కలసి ఫిర్యాదులు చేయడం వెనుక రాంమాధవ్ హస్తముండి ఉండొచ్చని కొందరు బీజేపీ నేతలే చెబుతున్నారు. ఇంతకాలం కేంద్రంలోని ఒక కీలక నేత కారణంగా తెలుగుదేశం పార్టీ ఏం చేసినా నోరు విప్పని బీజేపీ నేతలకు ఇప్పుడు రాం మాధవ్ స్వేచ్ఛను ప్రసాదించారనే వాదనలు వినిపిస్తున్నాయి. విభజన హక్కుల విషయంలో బీజేపీ, తెలుగుదేశం పార్టీల మాటల యుద్ధాలు, సవాళ్లు నడుస్తున్నసమయంలో రాంమాధవ్ సూచన మేరకే మాణిక్యాలరావు హస్తిన వెళ్లివచ్చారని తెలిసింది. దేవాదాయ శాఖలో జరిగే బదిలీల విషయంలో కూడా తనను సంప్రదించకుండా ఏకపక్షంగా వ్యవహరించిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు మాణిక్యాలరావు తనవంతు ప్రయత్నాలను ప్రారంభించారు.

ఇవన్నీ చూసి తెలుగుదేశం పార్టీ నేతలు కాస్తంత కలవరపడుతున్నారు. నిజానికి మాణిక్యాలరావుకు గతంలో రాజకీయానుభవం కూడా పెద్దగా ఏమీ లేదు. ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్యే కాకముందు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆయన ఒక సాధారణ వ్యక్తిగా అందరికీ తెలుసు. అలాంటిది ఉన్నట్టుండి కాకలు తీరిన రాజకీయవేత్తలా పరిణితి ప్రదర్శించడం, అధికార పార్టీని కూడా కలవరపాటుకు గురిచేయడం లాంటివి చేస్తున్నారంటే ఆయన వెనుక కచ్చితంగా ఏదో ఒక పెద్ద శక్తి ఉండే ఉంటుందని వినిపిస్తోంది.



పెట్రోల్‌ను జీఎస్టీలోకి తేవాలి

ఏపీ ప్రభుత్వ అసంబద్ధ విధానాల వల్లే అధిక ధరలు

ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

విశాఖపట్నం, మార్చి 1 (మనం న్యూస్‌బ్యూరో): చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాల వల్లే రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ అభిప్రాయపడింది. పక్క రాష్ట్రాల్లోనూ ఏపీ కన్నా తక్కువ ధరలు ఉన్నాయని, దీంతో సరిహద్దు జిల్లాల్లో పెట్రోలు బంకులు మూతపడుతున్నాయని పేర్కొంది. పెట్రోలు, డీజిల్‌ను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేసింది. విశాఖలో గురువారం సమాఖ్య నిర్వహించిన సమావేశానికి పెట్రోలు బంకుల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో మాత్రమే పెట్రోల్‌పై లీటర్‌కు రూ.4 వ్యాట్ రూపంలో వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రాల్లో పెట్రోలు, డీజిల్ ధరలు తక్కువగా ఉండడంతో సరిహద్దు జిల్లాలలోని పెట్రోలు బంక్‌లు వందల సంఖ్యలో మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. ప్రజలకు భారంగా మారే నూతన రోడ్డు రవాణా బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండు చేశారు. వాహన కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్‌లతో కూడిన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్టు సంఘాల ప్రతినిధులు రవిశంకర్, డి.అప్పలరాజు, సూరిబాబు, కె. సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టాప్ లూజర్స్


1 మార్చి


34,046.94


పాయింట్లు		%
305.25	ఐసీఐసీఐ బ్యాంకు	-2.63%
262.55	ఎస్‌బీఐ	-2.31%
1160.25	ఇన్ఫోసిస్	-1.19%
526.10	యాక్సిస్ బ్యాంకు	-0.66%
1872.00	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-0.63%
263.60	ఐటీసీ	-0.57%
197.40	పవర్ గ్రిడ్	-0.53%
947.70	రిలయన్స్	-0.50%
3583.00	హీరో మోటార్స్	-0.49%
320.75	యస్ బ్యాంకు	-0.47%

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -137.10










'పెన్షన్ దిశగా తొలి అడుగులు'

న్యూఢిల్లీ: పెన్షన్ అందే సమాజంగా పరిణమించేందుకు భారతదేశం ''చాలా దూరం'' పయనించవలసిన అవసరం ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. ప్రస్తుత విస్తరణ ''తొలి అడుగుల'' కిందకు మాత్రమే వస్తుందని ఆయన చెప్పారు. ''మన ఎదుట సంభవిస్తున్న సామాజిక మార్పులను దృష్టిలో పెట్టుకున్నప్పుడు, భారతదేశం పెన్షన్, బీమా రక్షణ కలిగిన సమాజంగా పరిణమించవలసిన అవసరం ఎంతైనా ఉందనిపిస్తుంది'' అని జైట్లీ అన్నారు. పెన్షన్ నిధి నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (పి.ఎఫ్.ఆర్.డి.ఏ) నాల్గవ పింఛను సమావేశంలో బుధవారంనాడు జైట్లీ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో ఆయుర్దాయ పరిమితులు పెరుగుతున్నాయి. కుటుంబ రూపు రేఖలు మారుతున్నాయి. ఉపాధి అవకాశాలు వెతుక్కుంటూ జనం నగరాలకు వలస వస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. 'భారతదేశంలో సమ్మిళిత, స్థిర పింఛను వ్యవస్థను సృష్టించడం: అవకాశాలు, సవాళ్ళు' అనే భావనతో ఈ సమావేశం ఏర్పాటైంది.

'పెన్షన్ సంచయ్' పేరుతో ఫైనాన్షియల్ అక్షరాస్యత, పింఛను ప్రణాళిక వెబ్‌సైట్‌ను అరుణ్ జైట్లీ ఈ సందర్భంగా ప్రారంభించారు. ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ (క్రిసిల్ ఇన్‌క్లూసిక్స్)పై క్రిసిల్ నివేదికను, పెన్షన్ కవరేజీపై పి.ఎఫ్.ఆర్.డి.ఏ-క్రిసిల్ సంయుక్త నివేదికను జైట్లీ విడుదల చేశారు. నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్.పి.ఎస్) ''అనుభవం'' సానుకూలంగానే ఉందని, అది ఇవ్వజూపే ప్రతిఫలాలు ఆకర్షణీయంగా ఉన్నాయని ఆర్థిక మంత్రి అన్నారు. ''సమాజం పరిణామం చెందింది. సామాజిక భద్రతకు అర్థం మారింది. ప్రజల జీవితాలు సామాజికంగా మరింత పరిరక్షణ కలిగినవిగా మార్చడంలో పింఛను కీలక పాత్ర వహిస్తుంది'' అని ఆయన అన్నారు. పెన్షన్ అభివృద్ధిలో భారతదేశం చాలా వెనుకబడి ఉందని కూడా జైట్లీ అన్నారు. ఉదాహరణకు, బహుళ ప్రచారం పొందిన అటల్ పెన్షన్ యోజన (ఎ.పి.వై) కూడా 90 లక్షల చందాదార్లను మాత్రమే చేరింది. కానీ, అనియత కార్మికశక్తిలో 38 కోట్ల నుంచి 40 కోట్ల మంది వరకు ఉంటారని అంచనా అని పెన్షన్ పరిశ్రమ నిపుణుడు ఒకరు చెప్పారు. ''మనం కనుక వారిని అందుకోలేకపోతే (పెన్షన్ పరిధిలోకి తీసుకురాలేకపోతే)...సీనియర్ పౌరులలో అత్యధిక సంఖ్యాకులు ఇతరులపై ఆధారపడేవారుగా మారిపోతారు'' అని జైట్లీ అన్నారు.



ఆటోమేటిక్ నమోదు

జి.ఎస్.టి నెట్‌వర్క్ (జి.ఎస్.టి.ఎన్)లో నమోదైన చిన్న, మధ్య తరహా సంస్థల ఉద్యోగులకు పెన్షన్ లభించే విధంగా ఆటోమేటిక్ ఎన్‌రోల్‌మెంట్‌కు కేంద్రం అనుమతించాలని పి.ఎఫ్.ఆర్.డి.ఏ చైర్మన్ హేమంత్ కాంట్రాక్టర్ చెప్పారు. జి.ఎస్.టి పుణ్యమా అని, అనేక అనియత వ్యాపారాలు ఇప్పుడు నియత రూపం పొందుతున్నాయి. ఈ సంస్థలలోని ఉద్యోగుల పెన్షన్‌కు ఆటో-ఎన్‌రోల్‌మెంట్‌కు అవకాశం ఉందని హేమంత్ అన్నారు. ''చిన్న సంస్థల విషయంలో ఆటో-ఎన్‌రోల్‌మెంట్‌కు అనుమతించాలని అభ్యర్థిస్తూ ఆర్థిక మంత్రికి లేఖ రాశాను. పెన్షన్ కవరేజి విస్తరించడానికి ఇది సహాయపడుతుంది'' అని హేమంత్ తెలిపారు. గత మూడేళ్ళలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ దిశగా భారతదేశంలో గణనీయమైన పురోగతి కనిపించిందని క్రిసిల్ మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ అషు సుయశ్ అన్నారు. క్రిసిల్ ఇన్‌క్లూసిక్స్ ద్వారా ఈ విషయం తెలిసిందన్నారు. దేశంలో ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ స్థితిని తెలిపే మొదటి సూచిగా ఇది పేరు వహించింది. ఈ సూచి 2013 ఆర్థిక సంవత్సరం చివరలో ఉన్న 50.1 నుంచి 2016 ఆర్థిక సంవత్సరం చివరికి 58.0కి పెరిగింది. దీనికి రెండు ప్రధాన అంశాలు తోడ్పడ్డాయని చెబుతున్నారు. డిపాజిట్ ఎకౌంట్ల సంఖ్య (ప్రధానంగా జన్ ధన్ కార్యక్రమం కారణంగా) గణనీయంగా పెరిగింది. వివిధ రుణ ఖాతాల సంఖ్య కూడా పెరిగింది. శాఖ, రుణం, డిపాజిట్, బీమా అనే నాలుగు కోణాల నుంచి బ్యాంకులు, బీమా సంస్థలు, సూక్ష్మ రుణ సంస్థల పనితీరును క్రిసిల్ ఇన్‌క్లూసిక్స్ మదింపు చేస్తుంది.

కొనసాగిన పతనం



నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు

ముంబయి: డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం తాలూకు స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) డాటా ఊహించినదానికన్నా మెరుగ్గా ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్ల నుంచి ఉన్న మందగొడి సంకేతాలతో మదుపరులలో తెగువ తగ్గడంతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి గురువారం 137 పాయింట్లు నష్టపోయింది. బ్యాంకుల షేర్లు ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల ధరలు సూచీలు పెరగకుండా వెనక్కి లాగాయి. వివిధ బ్యాంకులలో మోసాల బాగోతాలు ఒక్కటొక్కటిగా బయటపడుతూండడంతో కలత చెంది బ్యాంకింగ్ రంగ షేర్లను తెగనమ్ముకునే ధోరణి నిరాఘాటంగా కొనసాగింది. ఫిబ్రవరి నెల అమ్మకాల సంఖ్యలు ప్రోత్సాహకరంగా ఉండడంతో కొన్ని మోటారు వాహన సంస్థల షేర్లకు గిరాకీ ఏర్పడింది. తొలి లావాదేవీల్లో 30 షేర్ల 'సెన్సెక్స్' 34,278.63 పాయింట్లను తాకినప్పటికీ, తర్వాత ప్రతికూల మండలంలోకి జారుకుని 34,015.79 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసి చివరకు 34,046.94 పాయింట్ల వద్ద ముగిసింది. యాభై షేర్ల కదలికలను సూచించే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' కూడా 34.50 పాయింట్లను కోల్పోయింది. 'నిఫ్టీ' 10,525.50 పాయింట్లు 10,447.15 పాయింట్ల మధ్య ఊగిసలాడిన అనంతరం 10,458.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వా రం మొత్తంమీద 'సెన్సెక్స్' 95.21 పాయింట్లు క్షీణించగా, 'నిఫ్టీ' 32.70 పాయింట్లు కోల్పోయింది.

ప్రోత్సహించని ప్రపంచ మార్కెట్లు

ప్రపంచ స్టాక్ మార్కెట్లు ఒడిదుడుకులతో మార్చి నెలలోకి అడుగుపెట్టాయి. వరుసగా మూడవ రోజూ పతన దిశలో సాగాయి. ఫెడరల్ రిజర్వ్ ఛీఫ్ జిరోమ్ పావెల్ రెండవసారి చట్ట సభల ప్రతినిధుల నుద్దేశించి మాట్లాడనుండడంపై ఊహాగానాలు చెలరేగి మార్కెట్లపై ప్రభావం చూపాయి. అమెరికాలో ఫెడ్ వడ్డీ రేట్లను ఇప్పటికే మూడుసార్లు పెంచింది. నాల్గవసారి కూడా అది వడ్డీ రేటును పెంచనుందని భావిస్తున్నారు. అది ఈక్విటీల అమ్మకాలకు పురికొల్పింది. బాండ్ల ప్రతిఫలాలు మరింత పెరుగుతాయనే భావన నెలకొంది. వివిధ కరెన్సీలతో అమెరికన్ డాలర్ మారకం విలువ ఆరు వారాల గరిష్ఠ స్థాయికి పెరిగింది. స్వల్పకాలిక అమెరికన్, జర్మన్ బాండ్ల ప్రతిఫలాల మధ్య వ్యత్యాసం 1997 తర్వాత తిరిగి అత్యధికంగా కనిపించింది.అన్ని దేశాల ఈక్విటీలకు గీటురాయి అయిన మోర్గాన్ స్టాన్లీ క్యాపిటల్ ఇండెక్స్ (ఎం.ఎస్.సి.ఐ) 15 నెలల విజయ పరంపరకు బ్రేక్ పడింది. అది 0.4 శాతం పతనమైంది. యూరోపియన్ స్టాక్స్ దాదాపు 1 శాతం క్షీణించాయి. ఆసియాలో ఇతర మార్కెట్లు కూడా తొలి లావాదేవీల్లో నష్టాల ను చూశాయి. జపాన్‌కు చెందిన నికాయ్ 1.6 శాతం తగ్గింది.

రికవరీ సంకేతాలు

భారతీయ ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సూచనలు కనబరచింది. అది 2017 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో అంతకుముందు ఐదు త్రైమాసికాలలో చూడని విధంగా 7.2 శాతం వృద్ధిని కనబరచింది. వ్యవసాయం, నిర్మాణం, వస్తూత్పత్తి వంటి కీలక రంగాలు మంచి పనితీరు కనబరచాయి.



బాండ్లను తిరిగి చెల్లించిన ఐ.ఓ.బి

ముంబయి: విదేశీ ఇన్వెస్టర్ల నుంచి మధ్యకాలిక నోట్స్ (ఎం.టి.ఎన్) రెండవ విడతలో భాగంగా సేకరించిన 50 కోట్ల అమెరికన్ డాలర్లను ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐ.ఓ.బి) తిరిగి చెల్లించేసింది. చెన్నై కేంద్రంగా ఉన్న ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ 2011-2012 మధ్య కాలంలో రెండు విడతల ఎం.టి.ఎన్‌లలో వంద కోట్ల అమెరికన్ డాలర్లను సేకరించింది. రెండవ విడత ఎం.టి.ఎన్‌లు మెచ్యూరిటీకి రాగానే ఫిబ్రవరి 21న చెల్లించేసింది. మొదటి విడతలో సేకరించిన 50 కోట్ల డాలర్లను 2016 అక్టోబరులో తిరిగి చెల్లించింది. ఐ.ఓ.బి ఈ ఏడాది జనవరిలో ప్రభుత్వం నుంచి రూ. 173.06 కోట్ల మూలధనాన్ని అందుకుంది. పునర్ మూలధనీకరణ పథకంలో భాగంగా, ప్రభుత్వం నుంచి 2018 ఆర్థిక సంవత్సరంలో ఐ.ఓ.బి రూ. 4,964 కోట్ల మూలధనాన్ని అందుకోనుంది. ఐ.ఓ.బి 2017 డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలానికి రూ. 971.17 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. అది 2016-17 ఆర్థిక సంవత్సరం అదే కాలంలో రూ. 554.44 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. మొండి బాకీలకు హెచ్చు మొత్తాలు పక్కనపెట్టవలసి రావడమే దానికి కారణమని పేర్కొంది.

'ప్రభుత్వ వ్యయంలో కోత ఉండదు'

- ద్రవ్యలోటు అదుపులోనే ఉంటుందన్న వ్యయ కార్యదర్శి




న్యూఢిల్లీ: స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి)లో ద్రవ్య లోటు లక్ష్యం 3.5 శాతం సాధించేందుకు 2017-18 సంవత్సరంలో ప్రభుత్వం వ్యయానికి కోత పెట్టుకోబోవడం లేదు. లక్ష్యానికి సంబంధించి 113.7 శాతం స్థాయిని ప్రభుత్వం చేరుకున్నప్పటికీ, ప్రభుత్వ పథకాలపై ఖర్చులు తగ్గించుకోబోవడం లేదు. ''వ్యయంలో కోత ఉండదు. ఏ వ్యయంలోనూ కోత పెట్టకూడదని విధానపరమైన నిర్ణయం తీసేసుకున్నారు'' అని వ్యయ కార్యదర్శి అజయ్ నారాయణ్ ఝా గురువారం ఇక్కడ చెప్పారు. ఒక కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియా ప్రతినిధులతో విడిగా మాట్లాడారు. సవరించిన ద్రవ్య లోటు లక్ష్యం 3.5 శాతాన్ని ప్రభుత్వం ఎలా సాధిస్తుందని అడిగినప్పుడు, సవరించిన లక్ష్యంలోకి పరోక్ష పన్నుల వసూళ్ళను ఇప్పటికే లెక్కలోకి తీసుకున్నామని ఆయన చెప్పారు. ప్రభుత్వం 12 నెలల ఖర్చులకు 11 నెలల జి.ఎస్.టిని మాత్రమే లెక్కలోకి తీసుకుంది. మార్చి నెల జి.ఎస్.టి వివరాలు ఏప్రిల్‌లో వెల్లడవుతాయి. ద్రవ్య లోటు 2018 జనవరి అంతానికి రూ. 6.77 లక్షల కోట్లు చేరింది. అధిక వ్యయమే దానికి కారణం. ద్రవ్య లోటు రూ. 5.95 లక్షల కోట్లుగా లేదా జి.డి.పిలో 3.5 శాతంగా ఉండగలదని ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం అంచనాను పెంచుతూ సవరించింది. ఇంతకుముందు ద్రవ్య లోటు లక్ష్యం 3.2 శాతంగా ఉంది. కీలక రంగాలు ఉత్సాహం, వృద్ధిలను కనబరుస్తున్నందు వల్ల ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతోందని ఝా చెప్పారు. ''అంచనాలకు తగ్గట్లుగానే అది మరింత వృద్ధి చెందుతుందని మేం భావిస్తున్నాం. ద్రవ్య లోటుకు సంబంధించినంత వరకు..రికవరీల ద్వారా చాలా సర్దుబాట్లు చోటుచేసుకుంటాయి. నికరంగా బడ్జెట్‌లో పేర్కొన్నట్లే ఉంటుంది'' అని ఆయన అన్నారు. ఆర్థిక సంవత్సరం చివరి రెండు నెలల్లో రాబడులలో పెరుగుదుల కనిపిస్తోంది. ద్రవ్య లోటు సంఖ్యలు సవరించిన లక్ష్యానికి లోపలే ఉంటాయని ఆయన అన్నారు. గత ఏడాది బడ్జెట్‌ను త్వరగా ప్రవేశపెట్టినందువల్ల వ్యయంలో వేగం చెప్పుకోతగినంత మెరుగ్గా ఉందని ఆ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

దేశంలోనే ఫిల్మ్ గ్రేడ్ నైలాన్ తయారీ

న్యూఢిల్లీ: ఫిల్మ్ గ్రేడ్ నైలాన్‌ను ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ 2018 ఫిబ్రవరి 28 నుంచి పని చేయడం ప్రారంభించిందని గుజరాత్ రాష్ట్ర ఎరువులు, రసాయనాల లిమిటెడ్ (జి.ఎస్.ఎఫ్.సి) వెల్లడించింది. ఈ ఫ్యాక్టరీ రోజుకు 15 టన్నుల ఫిల్మ్ గ్రేడ్ నైలాన్‌ను ఉత్పత్తి చేస్తుంది. వాటిలో ల్యూబ్రికేటెడ్ చిప్‌లు, న్యూక్లియేటెడ్ చిప్‌లు, ఈ రెండింటి మిశ్రమ చిప్‌ల కోవకు చెందినవి కూడా ఉంటాయి. ఫిల్మ్ గ్రేడ్ నైలాన్-6 (ఇంజనీరింగ్ గ్రేడ్) తయారు చేసే సంస్థ భారతదేశంలో లేకపోవడం వల్ల ఏళ్ళ తరబడి దానిని జర్మనీ నుంచి దిగుమతి చేసుకుంటూ వచ్చారు. దీనితో దిగుమతికి ప్రత్యామ్నాయాన్ని చూసుకున్నట్లయింది. ఫిల్మ్ గ్రేడ్ నైలాన్-6 దేశంలోనే లభ్యమవడం వల్ల భారతీయ ప్లాస్టిక్ పరిశ్రమలు ఎంతో లాభం పొందుతాయని జి.ఎస్.ఎఫ్.సి ఒక ప్రకటనలో తెలిపింది.

తగ్గిన ఇనుము ధరలు



న్యూఢిల్లీ: దేశంలో అతి పెద్ద ఇనుప ఖనిజ తవ్వక కంపెనీ జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్.ఎం.డి.సి) హయ్యర్ గ్రేడ్ ఇనుము (ముద్దలు) టన్ను ధరలో రూ. 100 తగ్గించింది. తగ్గింపు ధర ఈ నెలకు వర్తిస్తుంది. హయ్యర్ గ్రేడ్ ఇనుము టన్ను రూ. 3,000కే లభిస్తుంది. నాసిరకం ఇనుప ఖనిజాలను 'ఫైన్స్' అని పిలుస్తారు. వాటి ధరల్లో కూడా టన్నుకు రూ. 100 తగ్గింపును ఎన్.ఎం.డి.సి తీసుకువచ్చింది. ఫలితంగా, మార్చి నెలలో అవి టన్ను రూ. 2,660కే లభిస్తాయి. అయితే, ఈ ధరల్లో రాయల్టీ, జిల్లా ఖనిజ నిధి (డి.ఎం.ఎఫ్), జాతీయ ఖనిజాన్వేషణ ట్రస్టు (ఎన్.ఎం.ఇ.టి), సెస్సు, అటవీ అనుమతి ఫీజు, ఇతర పన్నులు కలిసి లేవు. కంపెనీ ఫిబ్రవరిలో ఇనుప ముద్దల ధరను టన్నుకు రూ. 3.100గా, 'ఫైన్స్' ధరను టన్నుకు రూ. 2,760గా నిర్ణయించింది. ఉక్కు తయారీలో ఇనుప ఖనిజాన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. పూర్తిగా యంత్రాలతో నడుస్తున్న మూడు గనుల నుంచి ఎన్.ఎం.డి.సి సుమారు 3 కోట్ల టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేస్తోంది. ఇనుప ఖనిజం, రాగి, రాస్ ఫాస్ఫేట్, సున్నపు రాయి, డోలమైట్, జిప్సమ్, బెన్‌టోనైట్, మాగ్నసైట్, టంగస్టన్, గ్రాఫైట్‌తో సహా వివిధ ఖనిజాల అన్వేషణలో కంపెనీ పాలుపంచుకుంటోంది.

ఆర్థిక అనారోగ్యంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్

న్యూఢిల్లీ: ఫోర్టిస్ హెల్త్‌కేర్ 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి రూ. 19.10 కోట్ల ఏకీకృత నికర నష్టాన్ని ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో అదే కాలానికి కంపనీ రూ. 453.29 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2017 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కూడా కంపెనీ రూ. 23.61 కోట్ల నికర నష్టాన్ని చూపింది. నిర్దేశిత బోర్డు సమావేశానికి ముందు ఆడిట్ పూర్తి చేయడానికి చట్టబద్ధంగా ఆడిటర్లు అశక్తత వ్యక్తం చేసిన దృష్ట్యా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండవ, మూడవ త్రైమాసికాల ఆదాయాలు ప్రకటించడానికి గడువు 15 రోజులు పొడిగించవలసిందిగా కంపెనీ కోరింది.

కంపెనీ ఆదాయాల నివేదికను సమర్పించినప్పటికీ, ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కి ఆడిటర్ అయిన డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్ ఎల్‌ఎల్‌పి తాను ఆడిట్ నిర్వహించలేదని పేర్కొంది. తాత్కాలిక ఫలితాలను ఇతర ఆడిటర్లు సమీక్షించారని, వారి నివేదికను మేనేజ్‌మెంట్ తమకు సమర్పించిందని డెలాయిట్ సంస్థ పేర్కొంది. ''ప్రస్తుతం సాగుతున్న దర్యాప్తులకు సంబంధించి...ఈ అంశాలకు ప్రాధాన్యం ఉన్న దృష్ట్యా...స్టేట్‌మెంట్‌పై ఒక నిర్ధారణకు రావడానికి మేం తగినంత సముచితమైన ఆధారాలను పొందలేకపోయాం'' అని ఆ సంస్థ వెల్లడించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సర రెండవ, మూడవ త్రైమాసికాల ఆదాయాల వివరాలను కంపెనీ గురువారం ఉదయం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కి తెలియజేసింది. డిసెంబరు త్రైమాసికంలో మొత్తం ఆదాయం రూ. 1163.27 కోట్లుగా చూపింది. 2017 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 1234.25 కోట్ల ఆదాయం చూపారు.

నియంత్రణలో లోపాలు

కంపెనీకి చెందిన కొందరు ప్రమోటర్లతో సంబంధమున్న సంస్థలకు నిధుల బదలీలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న నియంత్రణ పరమైన లోపాలపై వివాదం చెలరేగి, కంపెనీ ఆర్థిక పరిస్థితి పరిశీలనకు లోనవుతున్న సమయంలో ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఫలితాలు వెలువడ్డాయి. కంపెనీ ప్రమోటర్లు మల్వీందర్ మోహన్ సింగ్, శివీందర్ మోహన్ సింగ్‌లు తాము నియంత్రిస్తున్న పబ్లిక్లీ-ట్రేడెడ్ హాస్పిటల్ కంపెనీ నుంచి సుమారు ఏడాది క్రితం బోర్డు అనుమతి లేకుండా కనీసం 78 మిలియన్ డాలర్లు (ప్రస్తుత మారకం రేటు ప్రకారం సుమారు రూ. 500 కోట్లు) తీసుకున్నారని ఒక వార్తాకథనం వెలువడడంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్ వివాదంలో చిక్కుకుంది.

అనుబంధ సంస్థ ఫోర్టిస్ హాస్పిటల్స్, ప్రమోటర్లకు చెందిన గ్రూప్ సంస్థలకు, భద్రత కలిగిన స్వల్పకాలిక పెట్టుబడుల కింద రూ. 473 కోట్ల నిధులు అందించిందని కంపెనీ పేర్కొంది. బోర్డు నుంచి ఇద్దరు ప్రమోటర్లు రాజీనామా చేయడంతో, భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజి బోర్డు (సెబి) ఈ అంశాలను పరిశీలించడం ప్రారంభించింది.

ఇచ్చిన రుణాలకు తగిన హామీ ఉందని, ఒప్పందంలోని చెల్లింపు షెడ్యూలు అనుసరించి రుణాన్ని తిరిగి చెల్లించడం కూడా మొదలైందని కంపెనీ తెలిపింది. మాతృ సంస్థకు చెందిన పూర్ణ స్వామిత్వవాలి సహాయక కంపెనీ ఇచ్చిన భద్రత కలిగిన రూ. 473 కోట్ల స్వల్పకాలిక పెట్టుబడికి సంబంధించి 'సెబి' దర్యాప్తు జరుపుతున్నందున , దర్యాప్తు పూర్తికాకుండా అసంపూర్ణంగా మిగిలి ఉన్నందున ''ఫైనాన్షియల్ ఫలితాలు, కంపెనీ స్థితిగతులు, నగదు ప్రవాహాలు, గ్రూపు కార్యకలాపాలపై దాని ప్రభావం ఏమైనా ఉందా అనే విషయంలో ఒక నిర్ధారణకు'' రాలేకపోతున్నామని కంపెనీ స్టాట్యుటరీ ఆడిటర్ సంస్థ పేర్కొంది.

ఆర్థిక అనుచిత చర్య

కంపెనీ ప్రమోటర్లు మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్‌లు నిధులు కైంకర్యం చేశారనే ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు బాహ్య లీగల్ సంస్థ సేవలు వినియోగించుకుంటామని ఫోర్టిస్ హెల్త్‌కేర్ ప్రకటించింది. వారిద్దరూ గత నెలలో కంపెనీ బోర్డు నుంచి తప్పుకున్నారు. ఆడిట్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ ''బాహ్య లీగల్ సంస్థ ద్వారా స్వతంత్ర దర్యాప్తు జరిపించా''లని నిర్ణయించిందని రెండవ, మూడవ త్రైమాసిక ఆదాయ ప్రకటనలో ఫోర్టిస్ తెలిపింది. ప్రమోటర్లకు రూ. 473 కోట్ల మేర రుణాలిచ్చిన అంశంపై దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేసినట్లు ఫిబ్రవరి 16న 'సెబి' నుంచి లేఖ అందిందని కంపెనీ తెలిపింది. ఈ అంశంపై సమాచారాన్ని కోరుతూ కంపెనీల రిజిస్ట్రార్ నుంచి కూడా తాఖీదు అందిందని ఫోర్టిస్ తెలిపింది.

దివాలా ప్రక్రియలో రుచి సోయా

న్యూఢిల్లీ: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్.సి.ఎల్.టి) కింద తన వ్యాపారాన్ని విక్రయించడానికి సంబంధించిన చర్చలు ఇంకా మొగ్గ దశలోనే ఉన్నాయని రుణాల భారంతో కుంగిన రుచి సోయా ఇండస్ట్రీస్ వెల్లడించింది. ఈ కంపెనీకి వ్యతిరేకంగా దివాలా ప్రొసీడింగులు మొదలయ్యాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డుకున్న అధికారాలను సస్పెండ్ చేశారు. తాత్కాలిక పరిష్కార వృత్తినిపుణుడు (ఐ.ఆర్.పి) ఈ వ్యవహారాన్ని చూస్తున్నారు. రుచి సోయా కొనుగోలు పట్ల ఆసక్తి ఉన్నవారు ముందుకు రావచ్చని పరిష్కార వృత్తినిపుణుడు ఫిబ్రవరి 8న ప్రకటించారు. ఆసక్తి ఉన్నట్లు తెలిపే లేఖలు పంపడానికి గడువు ఫిబ్రవరి 22తో ముగిసింది. రుచి సోయా షేర్ ధర బి.ఎస్.ఇలో రూ. 18.40 వద్ద కోట్ అవుతోంది.

డివిడెండ్ చెల్లింపు పరిశీలన సమావేశం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక డివిడెండ్ చెల్లింపు అంశాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వ యాజమాన్యంలోని కోల్ ఇండియా (సి.ఐ.ఎల్) బోర్డు 2018 మార్చి 7న సమావేశం కానుంది. బోర్డు 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను ఈక్విటీ షేర్లపై డివిడెండ్ చెల్లించాలని నిర్ణయిస్తే, మార్చి 15న ఆ మొత్తాన్ని చెల్లించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. దేశంలో బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం భాగాన్ని అందిస్తున్న కోల్ ఇండియా 2020 నాటికి వంద కోట్ల టన్నుల ఉత్పత్తిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

అదనపు స్టోరేజ్



ఫోన్‌లోని మెమొరీ సామర్థ్యాన్ని ఎక్స్‌టర్నల్ మెమొరీ కార్డ్‌లతో పెంచుకోవడం తెలిసిందే. కొన్నిసార్లు ఎస్‌డీకార్డ్‌లు కూడా నిండిపోతాయి. ఏదైనా ముఖ్యమైన వీడియో చిత్రీకరిస్తున్నప్పుడు 'మెమొరీ ఫుల్' అంటూ చిత్రీకరణ ఆగిపోతుంది. ఇక చేసేది లేక స్టోరేజ్ నుంచి కొంత డేటాని తొలగించేందుకు ప్రయత్నిస్తాం. ఈ క్రమంలో కొన్ని సార్లు ముఖ్యమైన డేటానీ అనుకోకుండా తొలగిస్తుంటాం. ఇలాంటి సమస్యలేం రాకుండా ఉండాలంటే? శాన్‌డిస్క్ అందిస్తున్న డ్రైవ్‌ని వాడితే సరి. ఐఫోన్, ఐప్యాడ్‌లకు ఇది ప్రత్యేకం. దీన్ని ఫోన్‌కి కనెక్ట్ చేస్తే చాలు. ఆటోమాటిక్‌గా ఫోన్ కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను బ్యాక్‌అప్ చేస్తుంది. దీంతో ఫోన్ మెమొరీ నిండిపోతుందనే ఆలోచన రాదు. అవసరం నిమిత్తమో... ప్రయాణాల్లోనో... డ్రైవ్‌ని కనెక్ట్ చేసి చిత్రీకరించే వీడియోని సరాసరి దాంట్లోనే సేవ్ అయ్యేలా చేయవచ్చు. ఇలా డ్రైవ్‌లో సేవ్ చేసిన డేటాని సిస్టం, మ్యాక్‌లోకి కాపీ చేసుకోవచ్చు. యూఎస్‌బీ 3.0తో డేటాని మెరుపు వేగంతో సిస్టంలోకి ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు.

ఒత్తిడి దూరం



వర్చువల్ రియాలిటీ హెడ్‌సెట్‌లో ఆశ్చర్యపరిచే ఆటలాడొచ్చు. లేదంటే అద్భుతమైన వీడియోలు చూడొచ్చు. అంతేకాదు ఆ హెడ్‌సెట్‌కు ఓ చిన్న పరికరం జోడించి మీ ఒత్తిడి, ఆందోళనను తగ్గించొచ్చు. కోర్టెక్స్ సంస్థ తయారు చేసిన ఓ చిన్న గ్యాడ్జెట్ వల్ల ఇది సాధ్యమవుతుంది. దీన్ని వీఆర్ హెడ్‌సెట్‌కు జోడించి సంబంధిత వీడియోలను 20 నిమిషాల చొప్పున రోజుకు రెండుసార్లు చూస్తే మనసు ప్రశాంతంగా మారి చక్కని నిద్ర పడుతుంది. మెదడులో ఉత్పత్తి అయ్యే సెరోటొనిన్, కోర్టిసోల్‌ను ఈ హెడ్‌సెట్ అదుపు చేయడం ద్వారా ఒత్తిడి దూరమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



మ్యూజిక్ మస్తీ

వైర్లతో పని లేకుండా ఎప్పుడైనా.. ఎక్కడైనా మ్యూజిక్ మస్తీ చేద్దాం అనుకుంటే 'మెగాబూమ్' బ్లూటూత్ స్పీకర్ ఉండాల్సిందే. ట్రెండీ స్పీకర్లతో మార్కెట్‌లో సందడి చేసే మెగాబూమ్ కంపెనీ బడ్జెట్‌లో బుల్లి స్పీకర్‌ని పరిచయం చేయనుంది. 360 డిగ్రీల కోణంలో అన్ని వైపులకూ మ్యూజిక్ ట్రాక్స్‌ని స్పష్టంగా వినిపిస్తుంది. వాటర్‌ప్రూఫ్ రక్షణతో రూపొందించారు. ఫోన్‌కి కాల్స్ వస్తే స్పీకర్‌ఫోన్‌గా వాడుకోవచ్చు. ప్లే అవుతున్న ట్రాక్స్ ఆటోమాటిక్‌గా ఆగి కాల్ కనెక్టు అవుతుంది. స్పీకర్‌లో మీకు ఇష్టమైన పాటల్ని ఆలారం ట్యూన్స్‌గా సెట్ చేసుకునే వీలుంది. ఒకసారి స్పీకర్‌ని ఛార్జ్ చేసి 20 గంటల పాటు వాడుకోవచ్చు. స్పీకర్ ఎత్తు 9 అంగుళాలు. వ్యాసం 3.5 అంగుళాలు. ప్రయాణాల్లో ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు.



రెండు తెరలుంటే..!

మొబైల్‌కు ఇప్పుడు వెనుకవైపు రెండు కెమెరాలు, ముందువైపు రెండు కెమెరాలుంటున్నాయి. అలాగే రెండు స్క్రీన్‌లుంటే... బాగుంటుంది కదా. ఇటీవల ఈ ఫీచర్‌తో వీ 20 అనే మొబైల్‌ను ఎల్‌జీ లాంచ్ చేసింది. అయితే ఐదేళ్ల క్రితమే ఈ ఫీచర్‌తో చైనా నుంచి యోటా ఫోన్ విడులైంది. ఆ తర్వాత యోటా ఫోన్ 2 కూడా వచ్చింది. ఇప్పుడు వాటికి అదనపు హంగులతో 'యోటా ఫోన్ 3' త్వరలో మార్కెట్‌లోకి వస్తోంది. నవంబరు నుంచి రష్యా, చైనాలో ఇవి అందుబాటులో ఉంటాయి. మన దేశంలోకి ఎప్పుడు వచ్చేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇందులో ముందువైపు 5.5 అంగుళాల తాకే తెర, వెనుకవైపు 5.2 అంగుళాల ఈ-ఇంక్ టచ్ స్క్రీన్ ఉంటాయి. వెనుకవైపు 12 ఎంపీ కెమెరా, ముందువైపు 13 ఎంపీ కెమెరా, 3200 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంటాయి.

బుల్లి 4కే పీసీ



డెస్క్‌టాప్ కంప్యూటర్ల పక్కన చూసే సీపీయూని ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే? భుజంపై పెట్టుకుని మోసుకెళ్లాల్సిందే. దీనికి పూర్తి భిన్నంగా సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్ (సీపీయూ)ని జేబులో పెట్టుకుని తీసుకెళ్లొచ్చు. కావాలంటే 'లివా క్యూ' కంప్యూటర్‌ని చూడండి. ఇది ప్రపంచంలోనే అతిచిన్న '4కే పాకెట్ పీసీ'. ఇంచుమించి మౌస్ అంతే ఉంటుంది. 2, 4 జీబీ ర్యామ్. 32, 64 జీబీ స్టోరేజ్ మెమొరీ. మైక్రో ఎస్‌బీ కార్డుతో మెమొరీ సామర్థ్యాన్ని 128 జీబీ వరకూ పెంచుకోవచ్చు. ముందు భాగంలో రెండు యూఎస్‌బీ పోర్ట్‌లు (3.0, 2.0 వెర్షన్లు), కుడివైపు మైక్రో ఎస్‌డీ స్లాట్, వెనక హెచ్‌డీఎంఐ పోర్ట్, ఇథర్నెట్, మైక్రో యూఎస్‌బీ పోర్ట్‌లు ఉన్నాయి. బ్లూటూత్, వై-ఫై నెట్‌వర్క్‌లను సపోర్ట్ చేస్తుంది. 'ఇంటెల్ అపోలో లేక్ ఎస్ఓసీ' ప్రాసెసర్‌ని వాడారు. బరువు 260 గ్రాములు. ఇంటెల్ గ్రాఫిక్స్ హెచ్‌డీ సపోర్ట్‌తో 4కే రిజల్యూషన్ వీడియోలను ప్రాసెసర్ సపోర్ట్ చేస్తుంది.

అమ్మ చేతిలో ఓ ఫోన్... నాన్న జేబులో ఓ ఫోన్... అన్నయ్యకో ఫోన్... చెల్లాయికో ఫోన్... మొత్తానికి 'స్మార్ట్' కుటుంబం... మరి అందరినీ కలిపే ఆప్స్ ఉంటే!వాటితో ఒకరికొకరు అనుసంధానమై ఉంటే! ఇక్కడ ఉన్నవి అలాంటివే! డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు... దూరాల్లో ఉన్నా దగ్గరైనట్టే! ఎక్కడెక్కడున్నా కలిసిమెలిసి ఉన్నట్టే!! కుటుంబంలో అందరివీ వేర్వేరు వ్యాపకాలు. ఎక్కడెక్కడికో ఉరుకులు పరుగులు. చేతిలో ఫోన్లు ఉన్నా కాల్ చేసి మాట్లాడుకునే తీరికలేని పరిస్థితులు. అలాంటి వారి కోసం కొన్ని ప్రత్యేకమైన ఆప్స్ ఉన్నాయి. వాటి ద్వారా రకరకాల సమాచారాన్ని పంచుకోవచ్చు. ఇంటి పనులు చక్కబెట్టుకోవచ్చు! ఎవరెక్కడున్నారో తెలుసుకోవచ్చు! ఇంకా ఎన్నో చేయొచ్చు!



స్మార్ట్ ఫ్యామిలీ


మ్యాప్‌లో చూడొచ్చు

కుటుంబ సభ్యులు ఎవరు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి అస్తమానం ఫోన్ చేయాలా? అక్కర్లేదు. ఆప్‌ను అందుకుంటే సరి. డౌన్‌లోడ్ చేసుకున్నాక కుటుంబ సభ్యులను ఆహ్వానించి సర్కిల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఆపై అవసరమైనప్పుడల్లా వాళ్లు ఎక్కడున్నారనే విషయం ఆప్‌లో మ్యాప్ ద్వారా తెలిసిపోతుంది. అవసరం లేనప్పుడు ఈ సదుపాయాన్ని ఆపేసుకోవచ్చు కూడా. అందుకు సెట్టింగ్స్‌లోని లొకేషన్ షేరింగ్ ఆప్షన్‌కు వెళ్లి క్లోజ్ చేస్తే సరి. ఇంకా ఈ ఆప్ ద్వారా సమాచారాన్ని అందిపుచ్చుకోవచ్చు. ఉదాహరణకు ఇంటికి కావాల్సిన వస్తువులను గ్రాసరీస్ జాబితాలో రాసి పంచుకోవచ్చు. ఎవరెవరు ఏమేమి తేవాలో నిర్ణయించుకోవచ్చు. అనుకోకుండా ఏదైనా అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు హెల్ప్ అలర్ట్‌లోని ఎరుపు రంగు బటన్ ఒత్తవచ్చు. అప్పుడు అందులో ముందుగానే నిక్షిప్తం చేసిన మూడు అత్యవసర ఫోన్ నంబర్లకు సమాచారం వెళ్లే వీలుంది. ఐఓఎస్‌లోనూ ఈ ఆప్ లభిస్తుంది.



ముందే తెలుస్తుంది

కుటుంబ సభ్యుడికో, స్నేహితుడికో ఫోన్ చేయాలి... కానీ అవతలి వారు మీటింగ్‌లో ఉన్నారో, ఏదైనా కాల్ మాట్లాడుతున్నారో తెలియదు. మరెలా? ఆప్‌తో సులభంగా తెలుసుకోవచ్చు. మెయిల్ ఐడీ, ఫోను నెంబర్‌తో ఆప్‌లో లాగిన్ అయ్యి స్నేహితులను ఆహ్వానించవచ్చు. 'ప్రివూ'లో స్నేహితులైన వాళ్ల ఫోన్‌లో బిజీగా ఉన్నారా లేదా అనేది సులభంగా తెలుసుకోవచ్చు. ఆప్ ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఫోన్ కాంటాక్ట్స్ సింక్ అవుతాయి. లిస్ట్‌లో ప్రతి ఒక్కరి పేరు కింద వాళ్ల స్టేటస్ కనిపిస్తుంది. కాల్ మాట్లాడుతుంటే 'ఆన్ కాల్' అని చూపిస్తుంది. ఆ సమయంలో 'నోటిఫై మీ' అనే ఆప్షన్ ఒత్తితే... అవతలి వ్యక్తి ఫోన్ కాల్ కట్ చేయగానే మీకు నోటిఫికేషన్ వస్తుంది. మనం కాల్ లేదా మెసేజ్ చేయాలనుకున్న వ్యక్తి ఫోన్‌లో బ్యాటరీ తక్కువగా ఉన్న విషయం కూడా ఈ ఆప్ ద్వారా తెలుస్తుంది. దీని వల్ల అవతలి వ్యక్తికి ఇబ్బంది కలగకుండా చూడొచ్చు. కుటుంబ సభ్యుడు స్నేహితుడు ఎక్కడున్నారనే విషయాన్ని మ్యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.



వెంటనే పంచుకోవచ్చు

ముఖ్యమైన ఫోన్ నంబర్లన్నీ ఒకే గ్రూపులో పెట్టుకొని... అవసరమైనప్పుడు కుటుంబ సభ్యులందరూ ఆ ఫోన్ నంబర్లు వాడుకోవాలంటే. అత్యవసరమైన ఫోను నంబర్లు, బంధువుల కాంటాక్ట్ నంబర్లను గ్రూపులుగా పొందుపరుచుకోవచ్చు. తర్వాత ఆ గ్రూపులను ఈ ఆప్ ద్వారా కుటుంబ సభ్యులకు షేర్ చేయొచ్చు. అలా ఆప్‌లో ఒకరు సేవ్ చేసిన నంబర్లను కుటుంబ సభ్యులందరూ వాడుకోవచ్చు. ఒక ఫోన్‌లో నంబర్లు అప్‌డేట్ చేస్తే అన్నింటిలోనూ వాటికవే అప్‌డేట్ అవుతాయి. అంతేకాదు ఈ ఆప్‌ను కాలర్ ఐడీగానూ వాడొచ్చు. సమయానికి మందులు వేసుకోమని సన్నిహితులకి గుర్తు చేసే వీలుంటే? వాళ్ల మందులు తీసుకోకపోతే కుటుంబ సభ్యులకు తెలియాలంటే... ఆప్ ద్వారా కుటుంబ సభ్యుల మందుల వాడకం గురించి అందరికీ తెలిసేలా చేయొచ్చు. మీ బంధువులను అకౌంట్‌కు జతచేసి మీ వివరాలను వాళ్లతో పంచుకోవచ్చు. ఆప్‌లో మందుల పేర్లు ప్రీలోడెడ్ ఉంటాయి. వాటి నుంచి మనకు కావాల్సిన మందుల పేర్లు, మోతాదును ఎంచుకొవచ్చు. ఎన్ని ట్యాబ్లెట్లు వాడాం... ఇంకెన్ని ఉన్నాయనే విషయమూ ఈ ఆప్ ద్వారా తెలుస్తుంది. రిపోర్టు ఆప్షన్‌తో మీరు మందులు ఎలా వేసుకుంటున్నారనే విషయం మీ ఆప్‌తో అనుసంధానమైన వారికి తెలుస్తుంది. వీటితోపాటు డాక్టర్ అపాయింట్‌మెంట్లు ఎప్పుడు తీసుకోవాలి, ఎప్పుడు ఏ డాక్టర్ దగ్గరికెళ్లాలి అనే విషయాలనూ పొందుపరుచుకోవచ్చు. బ్లడ్ షుగర్, బ్లడ్ ప్రెజర్, పల్స్, బరువు లాంటి విషయాలను ఎప్పటికప్పుడు పొందుపరుస్తూ మీ ఆరోగ్యం గురించి కుటుంబానికి చెప్పొచ్చు.



ఉదాహరణకు..

- ఆఫీసు మీటింగులో ఉన్నా... పిల్లలు స్కూలు నుంచి వచ్చారో లేదో అనే ఆలోచన. ఎక్కడున్నారో చూద్దాం అనుకుంటే? మ్యాప్‌లో చూడొచ్చు! అంతేనా... ఇంటికి చేరామనే సందేశాన్ని మెసేజ్ రూపంలో పొందొచ్చు.
- ఇంట్లో పిల్లలకు ఫోన్ ఇస్తే వెంటనే ఏం గేమ్స్ ఉన్నాయో చూస్తారు. ఆడడం మొదలు పెడతారు. అదే ఓ ప్రత్యేక ఆప్ మీ మొబైల్‌లో ఉంటే, పిల్లలు ఇంట్లో చేసే పనులకు మార్కులు వేయవచ్చు. వారు సంపాదించిన మార్కులతో వారికి కావాల్సిన తాయిలాలు కొని ఇవ్వొచ్చు!



- స్నేహితునికి ఫోన్ చేస్తుంటారు. ఎంత సేపటికీ బిజీ.. బిజీ... మీకేమో విసుగు. అవేం లేకుండా కాల్ చేయడానికి ముందే వాళ్లు ఎవరితోనైనా మాట్లాడుతున్నారో లేదో తెలుసుకుంటే?
- వూర్లో నాన్న లేరు. అనుకోకుండా అమ్మకి బాలేదు. మీ దగ్గరేమో ఫ్యామిలీ డాక్టర్ నెంబర్ లేదు. వెంటనే ప్రత్యేక ఆప్‌లోకి వెళ్లి నాన్న ఫోన్‌లోని డాక్టర్ల గ్రూపు నుంచి ఫోన్ నెంబర్ అత్యంత సులువుగా తీసుకోగలితే!




ఎల్‌జీ మడతఫోన్

తక్కువ మందంతో ఫోన్లు నాజూకు అయిపోవడమే కాదు. మడతపెట్టి వాడుకునేలా ముందుకొచ్చేస్తున్నాయి. ఎల్‌జీ కంపెనీ ఆ ప్రయత్నాల్లోనే ఉందని నెట్టింట్లో టెక్ ప్రియుల ముచ్చట. ట్యాబ్ పరిమాణంలో ఉన్న ఫోన్‌ని రెండుగా మడిచి వాడుకోగలిగే నమూన ఫోన్ చిత్రం ఒకటి నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. పేటెంట్ హక్కులకూ ప్రయత్నాలు మొదలుపెట్టిందట. గత ఏడాదిలో జెడ్‌టీఈ కంపెనీ ప్రవేశపెట్టిన 'ఆక్సాన్ ఎమ్' ఫోన్ మోడల్‌ని పోలి ఉండొచ్చని అంచనా!



మార్కులతో పోత్సాహం



ఇంట్లో పిల్లల్ని ఎప్పటికప్పుడు ఉత్సాహపరచడానికి వీలు కల్పించే ఆప్ ఒకటుంది. పిల్లలు ఏమైనా పనులు చేశారనుకోండి. వారికి పాయింట్లు ఇచ్చి ఉత్సాహపరచవచ్చు. ఉదాహరణకు ఇల్లు సర్దితే 20 పాయింట్లు, కూరగాయలు తీసుకొస్తే 30 పాయింట్లు, బట్టలు బీరువాలో సర్దితే 15 పాయింట్లు... ఇలాగన్నమాట. ఎవరికి ఎన్ని పాయింట్లు వచ్చాయనేది ఆప్ రిపోర్టు ద్వారా కుటుంబ సభ్యులందరికీ తెలుస్తుంది. అలా సంపాదించిన పాయింట్లను ఏం చేయాలో కూడా నిర్ణయించవచ్చు. అంటే ఐస్‌క్రీమ్ కావాలంటే 20 పాయింట్లు, జాలీ ట్రిప్‌కు వెళ్లాలంటే 300 పాయింట్లు అని కొన్ని ఆప్షన్స్ ముందుగా పెట్టుకునే సౌకర్యం ఉంది. దీని ద్వారా ఇంటి పనుల విషయంలో పిల్లలను ఉత్సాహపరచడంతో పాటు ఒక ఆటలాగా వారితో అనుసంధానం కావచ్చు. ఐఓఎస్‌లోనూ ఇది లభిస్తుంది.

పారా-స్విమ్మర్ ప్రశాంత్‌పై సస్పెన్షన్ వేటు

మహిళా స్విమ్మర్ల వీడియో తీసిన ఘటన



బెంగళూరు: పారా-స్విమ్మర్ ప్రశాంత్ కర్మాకర్‌పై పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ) మూడేళ్ల నిషేధపు వేటు వేసింది. గతేడాది జైపూర్‌లో మార్చి 31 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగిన నేషనల్ పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రశాంత్ సహచర మహిళా స్విమ్మర్ వీడియో తీసినట్టు తేలడంతో పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. తన పట్ల అర్జున అవార్డు గ్రహిత ప్రశాంత్ అనుచితంగా ప్రవర్తించాడని.. చేయి చేసుకున్నాడని మహిళా స్విమ్మర్ రాత పూర్వక ఫిర్యాదు చేయడంతో ఆ ఘటనపై పీసీఐ చర్యలు చేపట్టింది. 'అతను (ప్రశాంత్) ఓ కెమెరాను తన సహచరుల్లో ఒకరికిచ్చి మహిళా స్విమ్మర్ల వీడియో తీయమని ఈ ఈవెంట్‌లో కోరాడు. అయితే మహిళా స్విమ్మర్ల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. వెంటనే పీసీఐ పారా స్విమ్మింగ్ చైర్మన్ డాక్టర్ వీకే డబాస్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ప్రశాంత్ చెప్పినందుకు తాను వీడియో తీశానని ఆ వ్యక్తి చెప్పాడు. అతను వీడియో ఆపేసిన కాసేపటికే మళ్లీ ఫిర్యాదు వచ్చింది. ఈసారి ప్రశాంత్ స్వయంగా మహిళా స్విమ్మర్ల వీడియో తీశాడు. తల్లిదండ్రులు అభ్యంతరం చేస్తున్నా పట్టించుకోలేదు' అని పీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఆ వీడియోలను తొలగించమని ఆ తల్లిదండ్రులు అడిగినప్పుడు ఆ పని చేయకపోగా.. ఇంతకుముందు వీడియో తీసిన వ్యక్తిని ఎందుకు అడ్డుకున్నారని వారితో ప్రశాంత్ వాగ్వాదానికి దిగాడు. 'ప్రశాంత్‌ను పీసీఐ చైర్మన్ పిలిపించారు. దీంతో ప్రశాంత్ తీవ్ర కోపంతో అక్కడికి వెళ్లాడు. తాను వీడియో తీయమని చెప్పిన వ్యక్తిని ఎందుకు అడ్డుకున్నారని చైర్మన్‌ను, పీసీఐ అధికారులను కోపంతో అడిగాడు. అయితే ప్రశాంత్ చర్యలపై రాతపూర్వక ఫిర్యాదును పీసీఐ కార్యాలయ సిబ్బంది కోరాగా వారు వెంటనే ఫిర్యాదు రాసి ఇచ్చారు. అయినప్పటికీ పీసీఐ చైర్మన్ డబాస్, హరియాణాకు చెందిన మహిపాల్ సింగ్ ఆర్యతో వాగ్వాదానికి దిగాడు. తాను అర్జున అవార్డు గ్రహీతనని.. ఆ వీడియోలు తొలగించనని వాదించాడు' అని పీసీఐ పేర్కొంది. ఈ ఘటనపై పోలీసులు ప్రశాంత్‌ను వెంటనే అరెస్టు చేశారు. తాను, తన సహచరుడు తీసిన వీడియోలు, ఫొటోలు తొలగిస్తానని చెప్పిన తర్వాత విడుదల చేశారు.



తొలిసారి ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ పోటీలు

ప్రత్యక్ష ప్రసారం

ఆదివారం నుంచి అర్హత టోర్నీ

న్యూఢిల్లీ: ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయర్-2018 మ్యాచ్‌లను తొలిసారి ఐదు ఖండాల్లోని 200 ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్టు గురువారం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. 'ఐసీసీ క్రికెట్ వరల్డ్ క్వాలిఫయర్స్‌ను మరింత విస్తరించే క్రమంలో వివిధ బ్రాడ్ కాస్ట్ భాగస్వాములతో కలిసి 2014 నుంచి ఐసీసీ దీర్ఘకాల భాగస్వామ్యాన్ని కొనసాగిస్తోంది. అయితే ఈసారి ప్రపంచ వ్యాప్తంగా క్వాలిఫయింగ్ మ్యాచ్‌లను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు నిర్ణయించాం' అని ఐసీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. అంతేకాకుండా ఆన్‌లైన్ ద్వారా లేదా మొబైల్ ద్వారా కూడా ఈ మ్యాచ్‌లను లైవ్‌లో చూడొచ్చు. 19 కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారమయ్యే ఈ టోర్నీకి ఇయాన్ బిషప్,



ఎంపుమెమెలో ఎంబాంగ్వా, లిసా స్థలేకర్, దీప్ దాస్‌గుప్త, ఫజీర్ మహ్మద్, మార్క్ బౌచర్, డిర్క్ నాన్నెస్ కామెంటేటర్లు వ్యవహరిస్తారు. 'అతి తక్కువ సమయంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టు పటిష్టమైన జట్టుగా ఎదుగుతుండడం ఊహించని పరిణామం. అంతేకాకుండా ప్రత్యర్థి ఎవరైనా తమ ఫాస్ట్, నైపుణ్యంగల బౌలింగ్‌తో చిత్తు చేస్తామని హెచ్చరికలు చేస్తోంది. దీంతో ఈ టోర్నీలో కామెంటరీ చెప్పేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాను. వరల్డ్ కప్‌కు కావాల్సిన ఆ రెండు స్థానాలను ఎవరు చేజిక్కించుకుంటారో ఉని ఉత్కంఠగా ఉంది' అని ఇయాన్ బిషప్ అన్నారు.

ఆదివారం నుంచి క్వాలిఫయింగ్ టోర్నీ

ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ ఆదివారం జింబాబ్వేలో ప్రారంభం కానుంది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్ ప్రకారం 8 ర్యాంకుల్లో ఉన్న జట్లు వచ్చే ఏడాది వరల్డ్ కప్‌కు నేరుగా ప్రవేశం పొందుతాయి. మిగిలిన రెండు స్థానాల కోసం మిగిలిన క్వాలిఫయింగ్ టోర్నీలో తలపడతాయి. అంటే ఈ టోర్నీలో రెండు స్థానాల కోసం మొత్తం 10 జట్లు తలపడనున్నాయి. దీంతో క్వాలిఫయింగ్ టోర్నీ హోరాహోరీగా, నువ్వా నేనా అన్నట్టు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగనుంది అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. అయితే ఈ క్వాలిఫయింగ్ టోర్నీ గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిన అవసరముంది. 10 జట్లు తలపడే ఐసీసీ వరల్డ్ కప్‌లో మిగిలిన రెండు స్థానాలను కైవసం చేసుకోవడంలో వెస్టిండీస్, ఆఫ్ఘనిస్థాన్ జట్లు క్వాలిఫయింగ్ టోర్నీలో ఫేవరెట్స్‌గా బరిలోకి దిగనున్నాయి. అయితే టెస్టు జట్లయిన ఐర్లాండ్, జింబాబ్వే కూడా తమ ప్రత్యర్థులకు షాకిచ్చే అవకాశముంది. మార్చి 4 నుంచి 25వ తేదీ వరకు క్వాలిఫయింగ్ టోర్నీ జరగనుంది.

పెద్ద జట్టుగా పేరున్న వెస్టిండీస్ జట్టు వరల్డ్ కప్‌కు నేరుగా అర్హత సాధించలేకపోవడం నిజంగా ఆ జట్టుకు అవమానమే. అంతేకాదు వరల్డ్ కప్‌ను కైవసం చేసుకున్న జట్లలో వెస్టిండీస్ కూడా ఒకటి. అటువంటి విండీస్ జట్టు ఇప్పుడు తన కంటె ఎన్నో రెట్లు చిన్నవైన జట్లతో క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడబోతోంది. అయితే విండీస్ జట్టును వరల్డ్ కప్‌కు చేర్చే బాధ్యతను విధ్వంసకర బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ తీసుకున్నాడు. గేల్ వన్డేల్లో 22 సెంచరీలు చేశాడు. వెస్టిండీస్ జట్టు వరల్డ్ కప్‌కు అర్హత సాధిస్తే గేల్‌కు ఇది ఐదో వరల్డ్ కప్ అవుతుంది. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు గత ఏడాది కాలంగా అనూహ్యంగా, చాలా వేగంగా ఎదుగుతోంది. ఈ జట్టుకు యువ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నేతృత్వం వహిస్తున్నాడు. అష్గర్ స్టానిక్‌జాయ్ గాయం కారణంగా క్వాలిఫయింగ్ టోర్నీ ఆరంభంలో ఈ 19 ఏళ్ల యువకుడు ఆఫ్ఘన్ జట్టును నడిపిస్తాడు. అంతేకాకుండా అత్యంత వేగంగా 100 వికెట్లు తీసిన ఫాస్ట్ బౌలర్ రికార్డుకు రషీద్ ఖాన్ చాలా దగ్గరగా ఉన్నాడు. గత నెలలో జరిగిన ఐపీఎల్ ఆటగాళ్ల వేలం పాటలో రషీద్ ఖాన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ 1.41 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఇతను 37 వన్డేల్లో 86 వికెట్లు తీశాడు. దీంతో 52 మ్యాచ్‌ల్లో 100 వికెట్ల మిచెల్ స్టార్క్ రికార్డు ప్రమాదంలో పడింది.

ఆతిథ్య జింబాబ్వే జట్టు 1983 వరల్డ్ కప్ తర్వాత మళ్లీ మెగా ఈవెంట్‌లో ఆడలేదు. 15 ఏళ్ల తర్వాత మళ్లీ వరల్డ్ కప్‌కు అర్హత పొందే అవకాశాన్ని జింబాబ్వే సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. అండర్‌డాగ్స్‌గానైనా వరల్డ్ కప్‌లో ఆడాలని భావిస్తోంది. గత మూడు వరల్డ్ కప్ టోర్నీలో జింబాబ్వే జట్టు మూడు మ్యాచ్‌లు (యూఏఈపై, కెనడాపై, కెన్యాపై) మాత్రమే గెలిచింది. గత నెలలో జరిగిన వన్డే సిరీస్‌లో ఆఫ్ఘనిస్థాన్ చేతిలో 4-1తో జింబాబ్వే ఓటమిపాలైంది. బ్రెండన్ టేలర్, కైల్ జార్విస్, సీన్ విలియమ్స్ మళ్లీ జట్టులోకి రావడంతో జింబాబ్వే జట్టు క్వాలిఫయింగ్ టోర్నీపై ఉత్సాహంగా ఉంది. కానీ తమకంటే తక్కువ జట్టయిన ఆఫ్ఘనిస్థాన్ చేతిలో సిరీస్ ఓటమి నేపథ్యంలో వరల్డ్ కప్‌కు జింబాబ్వే అర్హతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. వరల్డ్ క్రికెట్ లీగ్ డివిజన్-2లో ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌లో గెలిచిన నేపాల్ జట్టు క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించింది. కెనడాతో జరిగిన మ్యాచ్‌లో చివరి బంతికి లక్ష్యాన్ని సాధించి ఒక వికెట్‌తో గెలవడంతో జింబాబ్వేకు బెర్త్ పొందింది. అంతేకాదు నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో చివరి వికెట్ జోడీ చివరి ఓవర్లో నేపాల్‌ను గెలిపించింది. 17 ఏళ్ల లెగ్ స్పిన్నర్ సందీప్ నేతృత్వంలోని నేపాల్ జట్టు ఆటను క్వాలిఫయింగ్ టోర్నీలో అభిమానులు పూర్తిగా ఎంజాయ్ చేయనున్నారు. గ్రూప్ దశ మ్యాచ్‌ల తర్వాత అసలు పోటీ ప్రారంభమవుతుంది. ఎందుకంటే గ్రూప్-ఎ, గ్రూప్-బిల నుంచి మూడేసి జట్లు సూపర్ సిక్స్ దశకు చేరుకుంటాయి. అయితే వెస్టిండీస్, జింబాబ్వే, ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్ ఐసీసీలో పూర్తి సభ్యత్వమున్న జట్లు. కానీ మిగతా జట్లయిన నేపాల్, యూఏఈ, హాంకాంగ్, స్కాట్లాండ్, పపువా న్యూ జెనీవాకు కూడా వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు రానున్న రెండు వారాల్లో కావలసినంత అవకాశముంది.

పాండ్యా బ్యాటింగ్‌ను మెరుగు పరచుకోవాలి

మాజీ కెప్టెన్ కపిల్ దేవ్

మొనాకో: హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌పై మరింత శ్రమించాలని.. ఆల్ రౌండర్‌గా రాణించేందుకు చాలా కీలకమైందని టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నారు. సౌతాఫ్రికా పర్యటనలో కేప్‌టైన్ టెస్టులో 93 పరుగులు చేసిన పాండ్యా ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ప్రతిభావంతులైన ఆల్ రౌండర్‌ను కపిల్‌తో పోల్చడం భారత్‌లో పరిపాటి అయింది. అయితే పాండ్యా ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆడాలని కపిల్ సూచించారు. 'అతను (పాండ్యా) తనలోని ప్రతిభను చాటాడు. అతనిలో నైపుణ్యం, సామర్థ్యం ఉన్నాయి. ఇతరులతో పోల్చితే అతను మరింత ఒత్తిడికి గురవుతాడు. కానీ తన సహజ సిద్ధమైన ఆటతో క్రికెట్‌ను ఎంజాయ్ చేయడం చూడాలనుకుంటు న్నాను' అని కపిల్ అన్నారు. ఆల్ రౌండర్ అంటే ఏదో ఒక దాంట్లో బలంగా ఉండా లని.. పాండ్యా ప్రధానంగా బ్యాటింగ్‌పై దృష్టి పెట్టాలని కపిల్ చెప్పారు. 'ఒక కారణంతో బౌలర్‌గా లేదా బ్యాట్స్ మన్‌గా అతను జట్టులో కొనసాగాలని భావిసు ్తన్నాను. ముఖ్యంగా బ్యాటింగ్‌పై పాండ్యా మరికొంత శ్రమించాలి. ఎందుకంటే అతను బ్యాట్స్‌మన్ ఆల్ రౌండ ర్. అతను బ్యాటింగ్‌లో మరికొంత ప్రతిభ కనబరిస్తే.. బౌలింగ్ అనేది దానంతటదే వస్తుంది. ఆల్ రౌండర్ల విషయంలో అదే జరుగుతుంది' అని కపిల్ వివరించారు. పాండ్యా చాలా పిన్న వయస్కుడని.. అతని నుంచి ప్రతి ఒక్కరూ ఎక్కువగా ఆశిస్తున్నారని కపిల్ అన్నారు. 'తక్కువ సమయంలోనే అతని నుంచి మనము చాలా ఆశిస్తున్నాం. అతనికి ఆ సామర్థ్యం ఉంది. జట్టులోని అద్భుతమైన ఆటగాళ్లలో పాండ్యా కూడా ఒకడు. అయితే ఆల్ రౌండర్‌గా విజయవంతం కావాలంటే అతను మరికొంత శ్రమించక తప్పదు' అని 1983 వరల్డ్ కప్ విజేత జట్టు కెప్టెన్ చెప్పారు. వచ్చే ఏడాది జరగనున్న వరల్డ్ కప్ గురించి కూడా కపిల్ స్పందించారు. వరల్డ్ కప్‌ను మరోసారి చేజిక్కించుకోవాలంటే కెప్టెన్ విరాట్ కోహ్లీ దూకుడు, మహేంద్ర సింగ్ ధోనీ శాంతం చాలా అవసర మన్నారు.





వరల్డ్ కప్‌పై బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్

బ్యాకప్ సిద్ధం చేయడమే లక్ష్యం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగనున్న ఐసీసీ వన్డే వరల్డ్ కప్‌కు టీమిండియా పక్కా ప్లాన్‌ను సిద్ధం చేసుకుంటోంది. మొన్న ప్లాన్-ఎను సిద్ధం చేసుకున్న టీమిండియా మేనేజ్‌మెంట్ ఇప్పుడు బ్యాకప్‌ను సిద్ధం చేయడంపై దృష్టి పెట్టింది. ప్రతిభావంతులైన పేస్ బౌలర్లను తయారు చేయడమే తదుపరి లక్ష్యమని టీమిండియా బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ అన్నారు. నిర్ణీత ఓవర్ల ఫార్మాట్‌లో భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రాలతో టీమ్ మేనేజ్‌మెంట్ ఇప్పటికే ప్లాన్-ఎను సిద్ధం చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రధాన కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ విరాట్ కోహ్లీతో కలిసి కనీసం మూడు బ్యాకప్ ఆప్షన్లను పెట్టుకోవాలని అరుణ్ భావిస్తున్నారు. 'అవును! మా పేస్ బౌలింగ్ యూనిట్‌ను పరీక్షించేందుకు శ్రీలంకతో ముక్కోణపు సిరీస్ గొప్ప అవకాశం ఇచ్చింది. భువీ, బుమ్రా రూపంలో మాకు ఇద్దరు ప్రపంచ శ్రేణి బౌలర్లు ఉన్నారు. అయినప్పటికీ శక్తివంతమైన రిజర్వ్ బెంచ్‌ను సిద్ధం చేసుకోవాలి. దీంతో మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కట్ తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకునేందుకు ఈ టోర్నీ వారికి బాగా ఉపయోగపడుతుంది. మున్ముందు సుదీర్ఘ సీజన్ నేపథ్యంలో గాయాలు గానీ, ఫిట్‌నెస్ సమస్యలు గానీ ఎదురైతే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. శార్దూల్ ఠాకూర్ రాణిస్తున్నాడు. సౌతాఫ్రికా పర్యటనలో సత్తా చాటాడు. చివరికి షమీ, ఉమేష్ కూడా బౌలింగ్ ప్రాక్టీస్‌లో ఉన్నారు. వాళ్లిద్దరూ దేవధర్ ట్రోఫీలో ఆడనున్నారు' అని ఆరుణ్ వివరించారు.

వినేశ్ పొగట్‌కు రజతం

హర్‌ప్రీత్‌కు కాంస్యం

ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్



బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళా రెజ్లర్ వినేశ్ పొగట్ రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గురువారమిక్కడ జరిగిన మహిళల 50 కిలోల కేటగిరి ఫైనల్లో వినేశ్ 2-3తో చైనాకు చెందిన చున్ లీ చేతిలో ఓటమి పాలైంది. కామన్వెల్త్ గేమ్స్ పతక విజేత వినేశ్ సెమీఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన యుకి ఇరీని ఓడిం చింది. భారత మరో రెజ్లర్ సంగీత కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. 59 కిలోల కేటగిరి ఫ్రీ స్టైల్ ఈ వెంట్‌లో సంగీత కొరియాకు చెందిన జీయున్ యామ్‌ను చిత్తు చేసిం ది. పురుషుల విభాగంలో హర్‌ప్రీత్ ఇండియాకు మరో పతకం అందించాడు. పురుషుల గ్రీకో-రోమన్ 82 కిలోల విభాగంలో హర్‌ప్రీత్ 11-3తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఖషింబెకోవ్‌ను చిత్తు చేసి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గతేడాది జరిగిన ఇదే పోటీలో 80 కిలోల కేటగిరిలో హర్‌ప్రీత్ కాంస్య పతకాన్ని గెలిచాడు. పురుషుల 55 కిలోల విభాగంలో రజేంద్ర కుమార్ కూడా కాంస్య పతకాన్ని సాధించాడు.

పోలీస్ ఉద్యోగంలో చేరిన హర్మన్‌ప్రీత్



చండీఘర్: భారత మహిళా క్రికెటర్, టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పోలీస్ ఉద్యోగం కల ఎట్టకేలకు నెరవేరింది. పంజాబ్ పోలీస్ శాఖలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్‌పీ) పదవీ బాధ్యతలను ఆమె గురువారం చేపట్టింది. పంజాబ్ ముఖ్యమంత్రి అమరేందర్ సింగ్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సురేష్ అరోరా ఆమె యూనిఫామ్‌పై స్టార్‌లను అమర్చారు. 'డీజీపీ సురేష్ అరోరా ఈ యువ క్రికెటర్ యూనిఫామ్‌పై స్టార్లను గుచ్చడం తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ పంజాబ్ పోలీస్‌లో డీఎస్‌పీ ఉద్యోగం చేపట్టడం గర్వంగా ఫీలయ్యాను. ఈమె మమ్మల్ని గర్వాకారకులను చేసింది. ఇక ముందుకూడా ఆమె అలాగే చేస్తుందని భావిస్తున్నాను. ఆమెకు నా శుభాకాంక్షలు' అని ఆమరిందర్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం చేస్తున్న హర్మన్‌ప్రీత్ విజ్ఞప్తి మేరకు ఆ బాధ్యతలను నుంచి విడుదల చేశారు. ఈ విషయంలో పంజాబ్ ముఖ్యమంత్రి కూడా తనవంతు పాత్ర పోషించారు.

సందిగ్ధంలో పాక్ టోర్నీ

భారత జట్టు దూరం కావడంతో అయోమయం

కరాచీ: ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్ క్రికెట్ టోర్నీ సందిగ్ధంలో పడింది. ఈ టోర్నీ ఏప్రిల్‌లో జరగాల్సివుంది. అయితే ఈ టోర్నీలో పాల్గొనేందుకు జట్టును పంపేందుకు భారత్ నిరాకరించడంతో నిర్వహణపై నిర్వాహకులు తికమకపడుతున్నారు. అయితే భారత జట్టు ఇక్కడికి వచ్చేందుకు ఇష్టపడటం లేదనందున ఈ టోర్నీని శ్రీలంక లేదా బంగ్లాదేశ్‌కు మారుస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధికారులు చెబుతున్నారు. 'అన్ని జట్లూ పాల్గొనాలన్న ఉద్దేశంతో ఈ టోర్నీని ఏప్రిల్‌లో నిర్వహించాలనుకున్నాం' అని పీసీబీ చైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) అధ్యక్షుడు నజాం సేథీ అన్నారు. ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్, ఆసియా కప్ టోర్నీలో నిర్వహణలపై త్వరలోనే కొలంబోలో ఏసీసీ సమావేశాన్ని ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే ఇండియాలో జరగనున్న ఆసియా కప్‌లో తాము పాల్గనేదీ లేనిదీ తర్వాత తెలియజేస్తామని చెప్పారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.